
గురువారం
10•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 64
• పేజీలు : 16 + 24

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD





శ్రీరాం సాగర్‌కు పునరుజ్జీవం
16 లక్షల ఎకరాలకు పచ్చని పంటల వరం

తెలంగాణ వర ప్రదాయిని అయిన శ్రీరాం సాగర్ ప్రాజెక్టును గత పాలకులు వట్టిపోయేలా చేశారు. చివరి ఆయకట్టు దాకా నీరందిన చరిత్ర లేనే లేదు. పంట పండింది లేదు. కడుపు నిండింది లేదు. ప్రాజెక్టు ఉండీ లేని సమానమైంది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు దార్శనికతతో భవిష్యత్ అవసరాలు తీర్చే విధంగా శ్రీరాంసాగర్ కు తిరిగి పునరుజ్జీవనం ఇచ్చే సృజనాత్మక పథకానికి ఆకృతినిచ్చారు.

ఎస్.ఆర్.ఎస్.పి. పునరుజ్జీవన పథకం

ప్రధాన గోదావరిలో ఎగువ రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి ఒక్క చుక్క నీరు రాకున్నా సరే.. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు, కాలువలు నిత్యం జలకళ ఉట్టిపడేలా రూ.2వేల కోట్లతో ఎస్.ఆర్.ఎస్.పి. పునరుజ్జీవం పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ప్రాణహిత ద్వారా గోదావరికి వచ్చి చేరుతున్న నీటిని మేడిగడ్డ నుంచి తోడి రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి మళ్లిస్తారు. మేడిగడ్డ నుంచి గోదావరి నీటిని ఎల్లంపల్లి, ఎస్.ఆర్.ఎస్.పి. వరద కాలువ, మిడ్ మానేరు, లోయర్ మానేరుకు తరలిస్తారు.

వరదకాలువను జలాశయంగా మారుస్తారు. అన్ని కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని పెంచుతారు. ఎస్.ఆర్.ఎస్.పి. కాలువల్లో నిరంతరం నీరు పారేలా, అన్ని చెరువులను నింపేలా పథకం.

గౌరవ ముఖ్యమంత్రి

శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు

గారి చేతుల మీదుగా లక్షలాది మంది రైతుల ఆనందోత్సాహాల నడుమ...

నేడే శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకం శంకుస్థాపన

స్థలం: ఎస్.ఆర్.ఎస్.పి., పోచంపాడు గ్రామం, నిజామాబాద్ జిల్లా
తేది: 10 ఆగస్టు 2017, **సమయం:** ఉదయం 11 గంటలు,
బహిరంగ సభ: మధ్యాహ్నం 12 గంటలు

గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతంలో ప్రతీ నీటి బొట్టును ఒడిసిపట్టి తెలంగాణ నేలను తడిపేలా ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను నిర్మిస్తున్నది. గత పాలకులు తెలంగాణను వంచిస్తూ లోపభూయిష్టంగా చేసిన డిజైన్లను మార్చి తెలంగాణ అవసరాలకు తగినట్టు రీ డిజైన్ చేసిండు మన ముఖ్యమంత్రి కేసీఆర్.

తీరుతున్నది మన రైతుల నీటి కల - తెలంగాణ నేలంతా ఇక అపూర్వ జలకళ

ఏడు జిల్లాలకు వర ప్రదాయిని

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం: పాత కరీంనగర్, వరంగల్,మెదక్, నల్గొండ, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు... శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు జలాశయాల కింద ఉన్న మరో 18 లక్షల ఎకరాలను స్థిరీకరించడం... దారి పొడుగున ఉన్న వందలాది గ్రామాలకు , హైదరాబాద్ నగరానికి మంచినీరు అందించే బృహత్తర ప్రాజెక్టు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం. వచ్చే ఏడాది నుంచే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి పంట పొలాలకు గోదావరి నీరు అందుతుంది.

వలసలు ఆపే కల్పతరువు

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు: మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పథకం.

శరవేగంగా పూర్తవుతున్న

ఆన్ గోయింగ్ ప్రాజెక్టులు : పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ ఎత్తిపోతల పథకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, శరవేగంగా పూర్తి చేయడం వల్ల 8లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వెసులుబాటు కలిగింది.

నల్గొండ ఫ్లోరైడ్ బాధలు తీర్చి బతుకునిచ్చే

డిండి ఎత్తిపోతలు: పాత నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలైన దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో 3.41 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు.

ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే

సీతారామ ప్రాజెక్టు : పాత ఖమ్మం జిల్లాలో 3.87 లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టుకు, 6.44 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉద్దేశించిన పథకం.



గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారితో నీటి పారుదల శాఖామాత్యులు, శ్రీ తన్నీరు హరీష్‌రావు గారు

ఆదిలాబాద్ పొలాలకు ప్రాణం పోసే

ప్రాణహిత ఎత్తిపోతల పథకం : ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు ప్రాణహిత నది నుంచి సాగునీరు అందించే పథకం

తుపాకుల గూడెం బ్యారేజితో

దేవాదులకు నిరంతర నీరు: గోదావరి నదిపై తుపాకుల గూడెం వద్ద బ్యారేజి నిర్మించడం వల్ల దేవాదుల ఎత్తిపోతల పథకం పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో 6.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

పాలేరు బతుకులు పండించే


భక్త రామదాసు ఎత్తిపోతల పథకం : రికార్డు స్థాయిలో 11 నెలల్లోనే పూర్తయి కరువు పీడిత పాలేరు నియోజకవర్గంలో 59వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న పథకం.

మిషన్ కాకతీయతో మారిన పల్లె వాతావరణం

సమైక్య పాలనలో శిథిలమైన 46వేల చెరువులను పునరుద్ధరించే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా సాగుతున్నది. చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలమట్టం పెరిగింది. పూడిక మట్టి పోసుకోవడంతో పొలాల్లో భూసారం పెరిగింది. చెరువుల్లో జలకళ ఉట్టి పడడంతో పల్లెల వాతావరణమే మారిపోయింది. చేపల పెంపకానికీ ఉపయోగపడింది. రెండు దశల్లో అమలు అయిన మిషన్ కాకతీయ ఫలితంగా గత ఖరీఫ్, రబీ పంట కాలంలో రికార్డు స్థాయిలో చెరువుల కింద 15 లక్షల ఎకరాలకు సాగు నీరు అందింది.

సాగునీటి రంగంలో మూడేళ్లలో సాధించిన మరిన్ని విజయాలు

• ఎస్.ఆర్.ఎస్.పి. స్టేజ్ 2 పనులు పూర్తి చేయడం ద్వారా 4 లక్షల ఎకరాలకు సాగునీరు • నాగార్జున సాగర్ లో లెవల్ కెనాల్ పనులు పూర్తి చేయడం ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరు • ఉదయ సముద్రం పనులు పూర్తి చేయడంతో లక్ష ఎకరాలకు సాగునీరు • దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయడం ద్వారా లక్షా 50 వేల ఎకరాలకు సాగునీరు • శ్రీపాద సాగర్-ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడం ద్వారా 1.78 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు • కడెం పథకం కింద 30వేల ఎకరాలు, మంథని ఎత్తిపోతల పథకం కింద 7వేల ఎకరాలు స్థిరీకరణ. • లోయర్ పెన్ గంగ ద్వారా 37వేల ఎకరాలకు, చనాఖా-కొరాట బ్యారేజి నిర్మాణం ద్వారా 13,500 ఎకరాలకు సాగునీరు • సింగూరు ప్రాజెక్టు కాల్వల నిర్మాణం ద్వారా 40వేల ఎకరాలకు సాగునీరు • మధ్య తరహా నీటి పారుదల ప్రాజెక్టులైన నీల్వాయి, ర్యాలి వాగు, గొల్లవాగు, పెద్ద వాగు, కొమురంభీమ్, మత్తడి వాగు, గడ్డెన్న-సుద్దవాగు, కిన్నెరసాని కెనాల్, పాలెం వాగు, నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేయడం ద్వారా దాదాపు లక్షా 50వేల ఎకరాలకు సాగునీరు అందే పరిస్థితులు ఏర్పడినాయి.



నీటి పారుదల శాఖ
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము

కోటికి పైగా ఎకరాలకు నిరంతరం సాగునీరు-
ఇక ఏ రైతు కంట పొంగదు కన్నీరు

10,332 డబుల్ బెడ్‌రూం ఇండ్ల టెండర్లకు ఆమోదం

జీహెచ్ఎంసీ పరిధిలోని ఐదు నియోజకవర్గాల్లో నిర్మాణాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం వేగాన్ని పెంచింది. నగరంలో దాదాపు లక్ష నిర్మాణాలే లక్ష్యంగా దూసుకుపోతున్నది. పలు నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల పురపాలక శాఖ మంత్రి కే తారకరామారావు డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తాజాగా పురపాలకశాఖ 10,332 రెండు పడక గదుల నిర్మాణానికి టెండర్లను ఆమోదించింది. బుధవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో పురపాలకశాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ జీహెచ్ఎంసీ పరిధిలోని ఐదు నియోజకవర్గాల్లో ఇండ్ల నిర్మాణానికి ఆదేశాలిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఈదులనాగులపల్లిలో 1944, కర్దనూరులో 1620 ఇండ్లను సెల్లార్+ స్టిల్ట్+9 అంతస్తుల ఎత్తులో రెండు పడక గదులను నిర్మిస్తారు. చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లి మండలంలోని 286, 278 సర్వే నంబర్లలో 1,512 ఫ్లాట్లను కట్టడానికి అనుమతినిచ్చారు. శంషాబాద్ విమానాశ్రయం చేరువలో నివసించే నిరుపేదలను దృష్టిలో పెట్టుకుని మహేశ్వరంలోని మన్‌సాన్‌పల్లిలో 756, గంగారంలో 504 ఫ్లాట్లను నిర్మిస్తారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెములలో 800, కీసరలోని కుందన్‌పల్లిలో 864 ఫ్లాట్లను నిర్మించనున్నారు. హైదరాబాద్‌లో అధికశాతం నిరుపేదలు నివసించే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలోని 186/2 సర్వే నంబర్లో 1080 డబుల్ బెడ్‌రూంలను, గాగిల్లాపూర్‌లో 640, అమీన్‌పూర్‌లోని కిష్టారెడ్డిపేట్‌లో 432 ఇండ్లను సెల్లార్ + స్టిల్ట్ + 9 అంతస్తుల ఎత్తులో కట్టడానికి పురపాలకశాఖ అనుమతించింది. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని గండిపేట్ మండలం బైరాగిగూడలో 180 గృహాలను నిర్మిస్తారు.

ఇంజినీరింగ్ బీ కోటా సీట్లకు ఆన్‌లైన్‌లో అనుమతి

వెబ్‌సైట్ కోసం సీజీజీ అధికారులతో ఉన్నతవిద్యామండలి సంప్రదింపులు

ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో యాజమాన్య కోటా ద్వారా భర్తీ అవుతున్న సీట్ల అనుమతి (రాటిఫికేషన్లు) ప్రక్రియ ఆన్‌లైన్‌లో చేపట్టాలని ఉన్నతవిద్యామండలి అధికారులు భావిస్తున్నారు. బీ కోటా సీట్ల రాటిఫికేషన్ల ప్రక్రియ ప్రతి ఏటా తొలి సెమిస్టర్ పరీక్షల వరకు కొనసాగుతున్నది. దీంతో ఈ విద్యాసంవత్సరం నుంచి ఆన్‌లైన్ విధానాన్ని అమలులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే యాజమాన్య కోటా ద్వారా ప్రవేశాలు పొందిన విద్యార్థుల అర్హతలకు సంబంధించి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొందరు విద్యార్థులు యూజీసీ అనుమతులు లేని వర్సిటీల నుంచి ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లు పొందడం, అధిక క్యాపిటేషన్ ఫీజులు చెల్లించి యాజమాన్య కోటాలో సీట్లు పొందుతున్నారు. తిరిగి ఆ సీట్లను అనుమతించాలని విద్యామండలికి కాలేజీలు దరఖాస్తు చేస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్హతలకు సంబంధించి విద్యార్థులు దాఖలుచేసిన పత్రాలు నిజమైనవా నకిలీవా అని తెలుసుకునే క్రమంలో విద్యామండలిపై భారం పడుతున్నది. కొన్ని అక్రమాలు కూడా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బీ కోటా సీట్ల రాటిఫికేషన్ల ప్రక్రియ ఏడాది పొడుగునా కొనసాగుతున్నది. పరీక్షల సమయంలో ఒత్తిడిచేసి చివరకు రాటిఫికేషన్లు పొందుతున్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను అడ్డుపెట్టి ఈ విధంగా రాటిఫికేషన్లు పొందుతున్న కాలేజీల సంఖ్య ఎక్కువగానే ఉన్నది. అయితే ఈ విధానానికి స్వస్తి పలికేందుకు ఆన్‌లైన్ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చినట్లు విద్యామండలి అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ రాటిఫికేషన్ల విధానాన్ని ప్రవేశపెడితే ప్రతి ఏటా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే సీట్ల భర్తీ పూర్తవుతుంది. రాటిఫికేషన్ల విధానంలో దరఖాస్తులు, అనుమతులు కూడా ఆన్‌లైన్ ద్వారా జరిగిపోతాయని అధికారులు చెప్తున్నారు. రాటిఫికేషన్లు పారదర్శకంగా నిర్వహించడం కోసం ఈ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చామన్నారు. ఇంజినీరింగ్ కోర్సులే కాకుండా అన్నిరకాల వృత్తివిద్యా కాలేజీల్లో బీ కోటా సీట్లకు ఇకపై విద్యామండలి ఆన్‌లైన్ ద్వారా రాటిఫికేషన్ ఇవ్వనున్నది.

గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేక అభివృద్ధి నిధి

సీఎం కేసీఆర్ పర్యటించిన మూడు గ్రామాలకు నిధుల వరద

దాదాపు 106 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వివిధ జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధి (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) కింద బుధవారం భారీగా నిధులు విడుదల చేసింది. రంగారెడ్డి, మేడ్చల్, కామారెడ్డి జిల్లాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం దాదాపు రూ.106 కోట్లు విడుదలయ్యాయి. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇచ్చిన హామీ మేరకు మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని లక్ష్మాపూర్, కేశవరం, మూడుచింతలపల్లి గ్రామాల్లో అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేకంగా రూ.5 కోట్లు విడుదల చేస్తూ ప్రణాళికాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అదే మండలంలోని లింగాపూర్ తండాలో అభివృద్ధి పనుల కోసం రూ.58 లక్షలు, మూడుచింతలపల్లి గ్రామానికి రూ. 28 కోట్లు విడుదలయ్యాయి. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.12 కోట్లు, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ.26 కోట్లు, కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ. 35 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా సీఎం కేసీఆర్ హామీ మేరకు మొదటివిడుతలో ఇప్పటికే లక్ష్మాపూర్, కేశవరం గ్రామాలకు రూ.27 కోట్లు మంజూరు చేశారు.

త్యాగాల నెలవు తెలంగాణ

'తెలంగాణ వచ్చుడో.. సచ్చుడో' అనేది కేసీఆర్ నినాదమే కాదు.. కార్యాచరణ కూడా

ఆరు దశాబ్దాల్లో కోల్పోయింది.. సాధించుకుంటున్నాం

క్విట్ ఇండియా వార్షికోత్సవంలో ఎంపీ జితేందర్‌రెడ్డి

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:

స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో చేసినటువంటి త్యాగాలు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం సమయంలోనూ ఉన్నాయని టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి చెప్పారు. క్విట్ ఇండియా ఉద్యమానికి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జితేందర్‌రెడ్డి ఉద్వేగంగా మాట్లాడారు. 'త్యాగాల గురించి మాట్లాడుకునేటప్పుడు మనకు మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్ లాంటి మహనీయులు గుర్తుకొస్తారు. వలసపాలన నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి స్వాతంత్ర్యంకోసం పోరాడిన యోధులు వారు. ప్రాణాలనుకూడా త్యాగంచేశారు. వారు యోధులుగా ఉన్నప్పుడు మనం పుట్టనే లేదు. అందువల్ల అది మనకు చరిత్ర. కానీ నేడు మనం తెలంగాణ ఉద్యమాన్ని చూశాం. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీకాంతాచారి, సువర్ణ, వేణుగోపాల్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, యాదిరెడ్డి, యా దగిరి.. ఇలా ఎంతోమంది మనకు తెలంగాణ ఉద్యమంలో కనిపిస్తారు. తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన రాష్ట్ర సాధన కోసం వారు ప్రాణాలు త్యాగంచేశారు' అని జితేందర్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సమితికి అధ్యక్షుడిగా ఉన్న కే చంద్రశేఖరరావు 'తెలంగాణ వచ్చుడో.. లేక సచ్చుడో' అనే నినాదం ఇచ్చి రాష్ట్ర సాధన కోసం రాజకీయ ఉద్యమానికి ఢిల్లీని వేదికగా ఎంచుకున్నారని జితేందర్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ నినాదానికి అనుగుణంగా ఆయన కార్యాచరణ సాగిందని, చివరకు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని జితేందర్‌రెడ్డి వివరించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడగానే ఆయన విశ్రమించలేదని, దాని పునర్నిర్మాణంలో తలమునకలయ్యారని అన్నారు. 60 ఏండ్లుగా తెలంగాణ ప్రజలు ఏం కోల్పోయారో వాటిని ఒక్కటొక్కటిగా తిరిగి పొందే దిశగా సీఎం స్థాయిలో కేసీఆర్ దృష్టి సారించారని చెప్పారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ ఇప్పుడు అనేక అంశాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశం కూడా ఆ దిశగా ఆలోచించి మెరుగైన నవభారతాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

నాటి స్ఫూర్తి నేటికీ సందర్భోచితం

సరిగ్గా 75 ఏండ్ల క్రితం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తి ఇప్పటికీ సందర్భోచితమని జితేందర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ప్రధాని మోదీ సైతం మతతత్వం, కులతత్వం, అవినీతి, ఉగ్రవాదం, పేదరికం తదితరాలను సమాజం నుంచి పారదోలడానికి మళ్లీ 'క్విట్ ఇండియా' స్ఫూర్తితో పనిచేయాలని కోరారని గుర్తుచేశారు.

దేవరకద్రలో ఆర్వోబీ నిర్మించాలి

రైల్వే మంత్రికి ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల వినతి

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు సంబంధించిన రైల్వే సమస్యలను పరిష్కరించాలని రైల్వే మంత్రి సురేశ్ ప్రభును ఎంపీ జితేందర్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే ఆళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. బుధవారం ఢిల్లీలో వారు ఆయనను కలుసుకొని ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. దేవరకద్రలో రైల్ ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి రైల్వేశాఖ అనుమతి మంజూరు చేసినా ఇప్పటివరకు టెండర్ ప్రక్రియ కూడా పూర్తికాలేదని, ప్రజల సౌకర్యార్థం వీలైనంత త్వరితగతిన నిర్మాణం జరిగేలా చొరవ తీసుకోవాలని వారు అభ్యర్థించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇటీవలి కాలంలో కొత్తగా ఎన్నో పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రైవేటు కంపెనీలు, ఫార్మా సంస్థలు వచ్చాయని, రియల్ ఎస్టేట్ రంగం కూడా అభివృద్ధి చెందుతున్నదని, ఈ కారణంగా దేవరకద్ర నుంచి ప్రతి నిత్యం హైదరాబాద్‌కు ప్రజల రాకపోకలు పెరిగాయని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎక్స్‌ప్రెస్ రైళ్లను దేవరకద్రలో ఆపించాలని కోరారు.



బుధవారం రైల్వే మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ జితేందర్‌రెడ్డి



బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో 'పడుగు పేకలు' కథా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, సాంస్కృతికశాఖ డైరెక్టర్ హరికృష్ణ, పుస్తక సంపాదకులు సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ మేడికుర్తి ఓబులేసు, వెల్దండి శ్రీధర్ కూడా ఉన్నారు.

'పడుగు పేకలు' సంకలనం ఆవిష్కరణ

చేనేత వృత్తి కథల సంకలనం అభినందనీయం: మంత్రి కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: చేనేత కార్మికుల బతుకు చిత్రం నేపథ్యంగా రూపొందించిన 'పడుగు పేకలు' కథాసంకలనాన్ని ఐటీ, మున్సిపల్, జౌళి చేనేత శాఖల మంత్రి కే తారక రామారావు బుధవారం సెక్రటేరియట్‌లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. 1924 నుంచి 2016 వరకు చేనేత కళ, కార్మికుల జీవన విధానంపై ప్రచురితమైన కథల నుంచి సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ మేడికుర్తి ఓబులేసు, వెల్దండి శ్రీధర్ సంపాదకత్వంలో 58 కథలను ఎంపికచేసి దీనిని ప్రచురించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ చేనేత వృత్తి నేపథ్యంగా వచ్చిన తెలుగు కథలను సంకలనం చేయడాన్ని అభినందించారు. నేత వృత్తి, జీవన విధానాన్ని తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. పుస్తకావిష్కరణలో సంగిశెట్టి శ్రీనివాస్, మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు కేవీ రమణాచారి, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నేషనల్ బుక్‌ట్రస్ట్ ఇండియా (తెలుగు) సంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్, కేంద్ర సెన్సార్ బోర్డ్ సభ్యుడు వారాల ఆనంద్, ఐటీశాఖ మంత్రి కార్యాలయ ప్రత్యేకాధికారి కొణతం దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

1,665 కోట్లతో మూసీ సుందరీకరణ

తొలి ప్యాకేజీ కింద రూ.956 కోట్లు

రూ.709 కోట్లతో రెండో ప్యాకేజీ

మున్సిపల్, ఎండీసీ అధికారుల సమావేశంలో మంత్రి కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సుమారు రూ.1,665 కోట్ల నిధులతో మూసీనది అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టనున్నట్టు ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. రూ.500 కోట్లను బడ్జెట్ నుంచి, మిగతా నిధులను బ్యాంకులు, ఇతర ఆర్థికసంస్థల నుంచి స్వీకరిస్తామన్నారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో మున్సిపల్‌శాఖ, మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎండీసీ) అధికారులతో జరిగిన సమావేశంలో మంత్రి కేటీఆర్ ఈ మేరకు వెల్లడించారు. ఈ నిధులకు ప్రభుత్వం పాలనపర అనుమతులిస్తూ జీవో జారీ చేసిందన్నారు. మూసీ నది సుందరీకరణ పనుల ప్రణాళికల రచనకు అధికారులు ఇప్పటికే గుజరాత్‌లో పర్యటించారని మంత్రి తెలిపారు. అక్కడి సబర్మతి రివర్ ఫ్రంట్ ద్వారా సబర్మతి నదిని అభివృద్ధి చేసిన తీరులోనే మూసీనది సుందరీకరణ చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ మేరకు అవసరమైన పనులు, నిర్మాణాల తాలుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని మంత్రి వివరించారు. ప్రభుత్వం నుంచి నిధులకు అనుమతులు వచ్చినందున పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్‌శాఖ కార్యదర్శి నవీన్‌మిట్టల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి తెలంగాణ కృషి అభినందనీయం

- **ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎంపీ రాజేశ్ దివాకర్ కితాబు**

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: రజకుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని, మరే రాష్ట్రం ఇంత శ్రద్ధ చూపడంలేదని ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎంపీ రాజేశ్ దివాకర్ అన్నారు. కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్‌ను బుధవారం ఆయన నివాసంలో కలిసిన దివాకర్.. తెలంగాణ ప్రభుత్వం రజకుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను, వాటి ద్వారా అందుతున్న ఫలాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేశ్ దివాకర్ మీడియాతో మాట్లాడుతూ దేశంలో 18 రాష్ట్రాల్లో రజకులు షెడ్యూల్డ్ కులాల జాబితాలో ఉన్నా.. అభివృద్ధికి అందనంత దూరంలో ఉన్నారన్నారు. తెలంగాణలో రజకులు వెనుకబడిన వర్గాల జాబితాలో ఉన్నా.. వారి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను రూపొందించడం అభినందనీయమని, బడ్జెట్‌లో రూ. 250 కోట్లను కేటాయించడం మామూలు విషయం కాదని చెప్పారు. దేశంలోనే తొలిసారి అధునాతన వాషింగ్ మెషిన్లను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం అద్భుతమని, తెలంగాణను అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధికి పాటుపడుతున్నదని అన్నారు. దేశంలో రజక సామాజికవర్గానికి చెందిన ఏకైక ఎంపీ రాజేశ్ తివారీ.

లోకం పోకడ



ఈయనకు రికార్డులో భూమి ఉంది, బయట లేదు.. ఆయనకు బయట భూముంది, రికార్డులో లేదు.. ఈయన పేరు మీదున్న భూమి ఆయనది.. ఆయన పేరు మీదున్న భూమి ఆమెది.. ఆయనకు సగం భూమి రికార్డులో ఉంది.. సగం బయట ఉంది..

ముహూర్తం



సూర్యోదయం: 6.02 గంటలకు



సూర్యాస్తమయం: 6.41 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, విదియ 12.45 వరకు. తదుపరి తదియ. నక్షత్రం: శతభిషం తె. 5.47 వరకు తదుపరి పూర్వాభాద్ర. అమృతఘడియలు: రాత్రి 10.05 నుంచి 11.41 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.56 నుంచి 3.31 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.19 నుంచి వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 12.18 నుంచి మధ్యాహ్నం 1.54 వరకు.

టీచర్ పోస్టుల భర్తీకి కసరత్తు పూర్తి

ఏకీకృత సర్వీస్‌రూల్స్ నిబంధనలకు రూపకల్పన

సీఎం ఆమోదం కోసం ఫైల్ పంపనున్న విద్యాశాఖ

కొత్త జిల్లాల ప్రకారమే నూతన నియామకాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాఠశాల విద్యాశాఖలో టీచర్‌పోస్టుల ఖాళీల భర్తీకి కసరత్తు దాదాపు పూర్తయింది. ఇటీవల ఉపాధ్యాయ ఏకీకృత సర్వీస్‌రూల్స్‌కు రాష్ట్రపతి ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, నియామకాలకు నిబంధనలను కూడా విద్యాశాఖ రూపొందించింది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ ఆధ్వర్యంలో తయారైన ప్రతిపాదనలను ప్రత్యేక ప్రధానకార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్యకు పంపించారు. తర్వాత ఈ నిబంధనలను పరిశీలించిన డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి కూడా ఆమోదం తెలుపుతూ ఫైల్‌పై సంతకం చేశారు. మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, కోర్టు నుంచి ఎలాంటి న్యాయవివాదాలు తలెత్తకుండా ఉండేందుకు అన్నికోణాల్లో నిబంధనలను పరిశీలిస్తున్నారు. అనంతరం ఆమోదం కోసం సీఎం కేసీఆర్ వద్దకు పంపనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ఉపాధ్యాయ ఖాళీల భర్తీని కొత్త జిల్లాల ప్రకారం భర్తీ చేయాల్సి ఉన్నది. ఈ అంశంపైనా సీఎం ఆమోదం తెలుపాల్సి ఉన్నది. తర్వాత ఖాళీల భర్తీ ప్రక్రియను టీఎస్‌పీఎస్సీకి అప్పగించనున్నారు.

కామన్ మెరిట్ ప్రకారం పోస్టింగ్స్

రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యాశాఖలో 8,792 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్టు ఇప్పటికే అధికారులు వివరాలు సేకరించారు. కొత్త సర్వీస్ రూల్స్ ప్రకారం 31 జిల్లాల ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేయాల్సి ఉండడంతో ఇబ్బందులు రాకుండా న్యాయశాఖ నుంచి పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు సలహా తీసుకున్నారు. టీచర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీచేసిన ఆరు నెలల్లో నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. వచ్చే రెండేండ్లలో మొత్తం 27 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి కూడా గతంలోనే ప్రకటించారు. ఇప్పుడు ఆ దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. తాజా నిబంధనలతో డీఎస్సీలో మెరిట్ మార్కులు సాధించిన అభ్యర్థులకు కోరుకున్న స్కూల్‌లో పోస్టింగ్స్ దక్కనున్నాయి. ఆ మేరకు జిల్లాల వారీగా కలెక్టర్లు, డీఈవోల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ ప్రకారం తొలుత ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిర్వహించి, తర్వాతే కొత్తగా నియామకమయ్యే వారికి పోస్టింగ్స్ ఇవ్వాలని పలు ఉపాధ్యాయ సంఘాల నుంచి విద్యాశాఖకు ప్రతిపాదనలు అందాయి. దీనిపై పరిశీలన చేస్తున్నామని, ఈలోగా టీచర్ నియామకాలకు బ్రేక్ వేసేది లేదని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు.

సర్కారుకు ఆ అధికారం ఉంది

మహిళా గురుకుల పోస్టుల భర్తీపై ప్రభుత్వనిర్ణయానికి ఉమ్మడి హైకోర్టు సమర్థన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళా విద్యాసంస్థల్లోని పోస్టులన్నీ మహిళా అభ్యర్థులతోనే భర్తీ చేయడంపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉమ్మడి హైకోర్టు సమర్థించింది. రాజ్యాంగం మేరకు అటువంటి అధికారం ప్రభుత్వానికి ఉన్నదని జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, జస్టిస్ జీ శ్యాం ప్రసాద్ నేతృత్వంలోని ధర్మాసనం తేల్చిచెప్పింది. రాష్ట్రంలోని సాంఘిక, బీసీ, గిరిజన, మైనార్టీ సంక్షేమ గురుకుల బాలికలు, ఇతర మహిళావిద్యా సంస్థల్లో బోధన, బోధనేతర సిబ్బందిని పూర్తిగా మహిళలతోనే భర్తీ చేయాలని ప్రభుత్వం సంకల్పించి జీవో-1274 జారీ చేయడం..దానిపై సింగిల్ బెంచ్ జడ్జి జూలై 19న స్టేవిధించడం..దాంతో ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించడంతో ధర్మాసనం పరిశీలించి సింగిల్ బెంచ్ దేశాలపై గత వారం సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చిన సంగతి తెలిసిందే. బుధవారం ఈ కేసులో పూర్తిస్థాయి విచారణ జరిపి మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. మహిళాభ్యున్నతి, సాధికారిత లక్ష్యంగా మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో కేవలం మహిళా సిబ్బందిని నియమించే విధానాన్ని తోసిపుచ్చడానికి వీల్లేదని పేర్కొంది. విజయలక్ష్మి వర్సెస్ పంజాబ్ యూనివర్సిటీ, విజయకుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఏపీ తదితర కేసుల్లో సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వులు ఈ విషయాలపై స్పష్టతనిస్తున్నదని పేర్కొంది. రాజ్యాంగంలోని అధికరణ 15(3) ప్రకారం మహిళలతోనే పోస్టులు భర్తీ చేసే అధికారం ప్రభుత్వం ఉన్నదని హైకోర్టు తెలిపింది. ఈ విధానం అధికరణలు15(4), 16(4)లకు విరుద్ధం కాదని స్పష్టం చేసింది. అయితే సదరు జీవో ప్రకారం భర్తీ చేసే పోస్టులన్నీ తమ తుదితీర్పునకు లోబడి ఉంటాయని తెలిపింది. తొలుత విచారణ సందర్భంగా అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి ప్రభుత్వం తరపున వాదనలు వినిపించారు. షీ టీమ్స్‌లో సైతం మగవాళ్లను నియమించుకుంటున్నారని, అటువంటిది మహిళా విద్యాసంస్థల్లో పోస్టులను పూర్తిగా మహిళలకు మాత్రమే కేటాయించడం చట్టవిరుద్ధమే అవుతుందని పిటిషనర్ల తరపు న్యాయవాది సరసాని సత్యంరెడ్డి వాదించారు. కానీ ధర్మాసనం ఆయన వాదనలను తోసిపుచ్చింది.

ఏవోబీలో భారీగా గంజాయి సాగు

రైతులను ప్రలోభ పెట్టి గ్రామాల్లో చాటుగా పంట ఉత్పత్తి

నిరుద్యోగ యువతకు ఎరజూపి రైళ్లలో అక్రమంగా రవాణా

ఒక్కో ట్రిప్పునకు రూ.5 వేల వరకు చెల్లింపు

పట్టుబడకుండా పొడిగా మార్చి ప్యాకెట్ల తయారీ

వాసన రాకుండా పార్సిళ్లలో డాంబర్ గోలీలు

ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలకు రవాణా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్ర ఒడిశా సరిహద్దు(ఏవోబీ)ల్లో పెద్ద ఎత్తున గంజాయి సాగు.. ఢిల్లీ, ముంబై వంటి మహానగరాల్లోని మాఫియా ముఠాలతో లింకు.. రైళ్ల ద్వారా సరుకు చేరవేత.. ఇందుకు అమాయకులైన నిరుద్యోగులకు, పేదలకు డబ్బు ఆశ పెట్టి వారిని రవాణాదారులుగా వినియోగించుకోవడం.. రవాణాలో పట్టుబడకుండా గంజాయిని పొడిగా మార్చడం.. వాసన రాకుండా పార్శిళ్లలో డాంబర్ గోలీలు ఉంచడం.. ఇవీ గంజాయిని అక్రమంగా ఉత్పత్తి చేయించి, స్మగ్లింగ్ చేసే వ్యాపారుల ఎత్తుగడల్లో కొన్ని.. ఏఓబీలో దట్టమైన అడవులు విస్తరించి ఉండటం వల్ల అక్రమార్కులు ఆయా చుట్టుపక్కల గ్రామాల్లో గంజాయిని వందల ఎకరాల్లో సాగు చేయిస్తున్నారు. ఆ ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉండటం వల్ల పోలీసులు అక్కడికి ఎక్కువగా వెళ్లరు. ఈ పరిస్థితి గం జాయి వ్యాపారులకు వరంగా మారింది. పెద్దమొత్తంలో డబ్బు సంపాదించ వచ్చని గ్రామాల్లోని రైతులను ప్రలోభ పెట్టి వారి చేత గంజాయి పంట వేయిస్తున్నారు. ఇతరులకు, ముఖ్యంగా అధికారులకు అనుమానం రాకుండా బంతిపూల చెట్ల మాటున గంజాయి సాగు చేస్తున్నారు. ఇలా గ్రామాల్లో టన్నుల కొద్దీ ఉత్పత్తి అయిన గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా రైళ్లలో రవాణా చేయిస్తున్నారు. గడిచిన మూడేండ్ల దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 2,528 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు పట్టుకున్నారంటే ఇంకా పట్టుబడని గంజాయి పెద్దమొత్తంలోనే ఉంటుంది. స్మగ్లర్లు నిరుద్యోగ యువతను ఎంపిక చేసుకుని వారితో సరుకు రవాణా చేయిస్తున్నారు. రవాణా చేసిన గంజాయిని వివిధ రకాలుగా ప్యాక్ చేసి, వాసన రాకుండా పార్శిళ్లపై డాంబర్ గోలీలను వేస్తారు.

ఏసీ కోచుల్లో దర్జాగా రవాణా!

రైళ్లలో గంజాయి రవాణాకు జనరల్ బోగీల కంటె ఎక్కువగా ఏసీ కోచులనే స్మగ్లింగ్ కూలీలు ఎంచుకుంటున్నారు. ఏసీ త్రీటైర్, ఫస్ట్‌క్లాస్, సెకెండ్ క్లాసుల్లో ప్రయణాలు చేస్తారు. ఎవరికీ అనుమానం రాకుండా ప్యాక్ చేసిన గంజాయిని ఒకచోట పెట్టి మరొక చోట కూర్చుంటారు. ఎవరైనా ఈ మూటను తనిఖీ చేస్తే తమది కాదన్నట్లుగా వ్యవహరించి అక్కడి నుంచి చాకచక్యంగా తప్పుకుటారు. చివరికి మూటకు సంబంధించిన వ్యక్తులు కానరాకపోవడంతో తనిఖీ అధికారులు దానిని స్వాధీనం చేసుకుంటారు. అంతేతప్ప అసలు రవాణాదారులను పట్టుకోలేరు. ఇట్లా రైళ్ల ద్వారా తరలించిన గంజాయిని ఢిల్లీ, ముంబైలో ఉన్న గంజాయి విక్రేతలైన మాఫియా ముఠాలకు అప్పగిస్తారు. సరుకు తీసుకువచ్చిన వారి పని అంతటితో ముగుస్తుంది. కాబట్టి వారు తిరుగు ప్రయాణం చేస్తారు. గంజాయి లాభాలు, తదితర లావాదేవీలకు సంబంధించిన అసలైన బడా స్మగ్లర్లతో సరుకు రవాణా కూలీలకు అంతకుమించిన సంబంధాలుండవు. మిగతా పని అంతా మాఫియా ముఠానాయకులు, ఏవోబీ నుంచి పంపించిన వాళ్లు చూసుకుంటారు. సరుకు రవాణా చేసేవారికి ఒక్కో ట్రిప్పునకు రూ.5 వేల వరకు కూలీ కింద చెల్లిస్తారు. ఫోన్ల ద్వారా పరస్పరం సమాచారం అందించుకుంటారు.

రైళ్లలో పట్టుబడిన గంజాయి వివరాలు.. 2015 నుంచి ఇప్పటివరకు

సంవత్సరం	కేసులు	అరెస్టులు	స్వాధీనం చేసుకున్న గంజాయి కిలోల్లో
2015	16	22	719
2016	20	34	731
2017 జూలై	26	38	1,078
మొత్తం	**62**	**94**	**2,528**

మంచిర్యాలలో ఇద్దరి అరెస్ట్

మహారాష్ట్రకు చెందిన షాకీర్‌ఖాన్ పఠాన్(22), సునీల్ ఇంగ్లే(19) అనే వ్యక్తులు ఆనంద్‌వన్ ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమంగా గంజాయి తరలిస్తుండగా మంచిర్యాలలో పట్టుకున్నట్టు బుధవారం డీజీపీ కృష్ణ ప్రసాద్ తెలిపారు. నిందితుల నుంచి 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, వారిని కాజీపేట రైల్వేకోర్టులో హాజరు పరిచామన్నారు. ఒడిశా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి గంజాయి వస్తున్నదని, ఇటీవల 1500 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

గురువారం
10•08•2017

హైదరాబాద్
• వెల.5 రూ.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఊపిరిపోసుకున్న పైర్లు

కరువు నీడ వదిలె..

రైతు ఊపిరి పీల్చుకున్నాడు! ఎండుముఖం పట్టిన పైర్లు.. నోళ్లు తడుపుకొన్నాయి! తలవాల్చుతున్న పంట మళ్లీ నిలబడింది! మంగళవారం నుంచి మొదలైన వానలు.. అన్నదాతల ఆశలను సజీవంగా నిలిపాయి. ముందు కాస్త ముఖం చాటేసినా.. వరుణుడు మళ్లీ కరుణించడం.. నెలన్నర వరకూ వానలకు ఢోకాలేదన్న వాతావరణ శాఖ భరోసాతో తెలంగాణకు కరువు పీడ వదిలినట్టే! యాదృచ్ఛికమే అయినా.. ప్రభుత్వం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునర్జీవానికి సిద్ధమైన వేళ.. వానదేవుడు తన 'వర్షా'మోదాలు ప్రకటించి.. సీఎం కేసీఆర్ వజ్ర సంకల్పానికి నేను సైతం అంటూ తోడయ్యాడు!

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వానల సందడి

నేడు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు ▪ మరో రెండ్రోజులు ఇదే తీరులో వానలు

ఆపై నెలన్నర వరకూ వానలకు ఢోకాలేదు ▪ వాతావరణశాఖ అంచనా.. రైతుల్లో భరోసా

ఖమ్మంలో అత్యధికంగా 9 సెం.మీ. వర్షపాతం

ప్రభుత్వ సంకల్పానికి వరుణుడి తోడు ▪ ఎస్సారెస్పీ పునర్జీవానికి వానదేవుడి హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ మీదుగా దక్షిణ తమిళనాడు వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వానలతో రైతుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం కూడా రాష్ట్రవ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితి మరో రెండ్రోజులు కొనసాగే అవకాశాలున్నాయని చెప్పన్నారు. తదుపరి కూడా నెలన్నరవరకూ వర్షాలకు ఢోకా లేదని స్పష్టంచేస్తున్నారు. బుధవారంనాటికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంటలు కలిపి 34.05 లక్షల హెక్టార్లలో సాగవుతున్నాయి. కొద్ది రోజులుగా వానలు లేకపోవడంతో తీవ్ర ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఆ ఆందోళనలన్నింటినీ పటాపంచలు చేస్తూ కురుస్తున్న వర్షాలు.. వరికి జీవనాధారంగా నిలిచాయి. వర్షాభావంతో వాడుముఖం పట్టిన పత్తి పంటకు తిరిగి పునర్జీవం వచ్చింది. అదేసమయంలో పొట్ట దశలో ఉన్న మక్కజొన్న పంట గట్టెక్కింది. ద్రోణి ప్రభావంతో హైదరాబాద్ నగరం సహా రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 4వ పేజీలో



బుధవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని ఓ పంటపొలంలో జోరుగా కురుస్తున్న వాన

నేడు పోచంపాడ్ జాతర

చలో
ఇందూరు
కరువు
బలాదూరు



సీఎం కేసీఆర్ షెడ్యూల్

గురువారం

11 గంటలకు
శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద కాల్వ హెడ్ రెగ్యులేటర్ వద్దకు చేరుకుని పునర్జీవ పనులకు శంకుస్థాపన చేస్తారు.

11:30 గంటలకు
ప్రాజెక్టు వరద కాల్వ హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తారు.

1:10 గంటలకు
బహిరంగసభనుద్దేశించి ప్రసంగిస్తారు.



నిజామాబాద్ జిల్లాలో గులాబీమయమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రోడ్డు

ఎస్సారెస్పీ పునర్జీవ సభకు సర్వం సిద్ధం

పోచంపాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్

పరీవాహక ప్రాంత జిల్లాల నుంచి భారీగా తరలి వస్తున్న రైతులు

నిజామాబాద్/నమస్తే తెలంగాణ ప్రతినిధి:

మరో ముఖ్యమైన పరిణామానికి తెలంగాణ సాక్షిగా నిలువనున్నది. రాష్ట్రంలో సిరులు పడించే శక్తిమంతమైన జల వనరు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు తన విశ్వరూపం చూపించగల అద్భుత ప్రణాళికకు గురువారం రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుడుతున్నది. ఎస్సారెస్పీకి తిరిగి ప్రాణం పోసేందుకు ఉద్దేశించిన పునర్జీవ పథకం ప్రారంభోత్సవానికి నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలోని పోచంపాడ్‌లో ఏర్పాట్లన్నీ పూర్తిచేశారు. 'పోదాం పావె జాతర.. పోచంపాడ్ జాతర..' అన్నట్టు ప్రాజెక్టు పరీవాహక జిల్లాలనుంచి భారీగా తరలిరానున్న రైతులకోసం 60 ఎకరాల సువిశాల మైదానంలో బహిరంగసభాస్థలిని సిద్ధంచేశారు. గురువారం ఉదయం 11 గంటలకు ఎస్సారెస్పీ పునర్జీవ పథకం పైలాన్‌ను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆవిష్కరిస్తారు. అనంతరం 1.10 గంటలకు అక్కడే ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు సీఎం కేసీఆర్ బుధవారం సాయంత్రమే పోచంపాడ్ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. మంత్రులు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జోగురామన్న, ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపీ బాల్కసుమన్, ఎమ్మెల్సీలు వీజీగౌడ్, రాజేశ్వర్, భూపతిరెడ్డి, జెడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు, బాల్కొండ ఎమ్మెల్యే, మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నెడ్‌క్యాప్ చైర్మన్ ఎస్ఏ అలీం, జిల్లా కలెక్టర్ యోగితారాణా, ఇరిగేషన్ ఈఎన్సీ మురళీధర్, సీఈ శంకర్, జాయింట్ కలెక్టర్ రవీందర్‌రెడ్డి, పోలీసు కమిషనర్ కార్తికేయశర్మ తదితరులు సీఎంకు స్వాగతం పలికారు. అంతకు ముందు ఉదయం ఇంటెలిజెన్స్ ఐజీ ఎంకే సింగ్, ఐజీ స్టీఫెన్ రవీంద్ర హెలికాప్టర్ ట్రయల్ నిర్వహించారు. అక్కడి పరిస్థితులను సమీక్షించారు. సీఎం పర్యటన నేపథ్యంలో భారీగా పోలీసు

మిగతా 4వ పేజీలో

సింహంలాంటోళ్లం..
సింగిల్‌గానే వస్తాం

టీఆర్ఎస్‌కు మళ్లీ అధికారంపై జానా, ఉత్తంకూ డౌటు లేదు

బీజేపీకి ఇప్పుడున్న ఐదు సీట్లు వస్తే గొప్ప ▪ వామపక్షాల్లేవు.. దోమపక్షాల్లేవు

ప్రాజెక్టులపై 18% జీఎస్టీపై కోర్టుకు వెళుతాం ▪ ఎన్డీయే ప్రభుత్వంతో దోస్తీ లేదు.. దుష్మనీ లేదు

నేరెళ్ల ఘటనలో దళిత కోణం లేదు ▪ ప్రధాని చేతులమీదుగా నవంబర్‌లో మెట్రో ప్రారంభం

మీడియాతో ఇష్టాగోష్ఠిలో మంత్రి కే తారక రామారావు



రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కే తారక రామారావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వచ్చే ఎన్నికల్లో మళ్లీ టీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కే తారక రామారావు చెప్పారు. ఈ విషయంలో కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, ఉత్తంకుమార్‌రెడ్డికి కూడా అనుమానం లేదని అన్నారు. బీజేపీకి ప్రస్తుతం ఉన్న ఐదు సీట్లు వస్తే అదే గొప్పని చెప్పారు. 'టీడీపీ అసలు ఉందా? ఉంటే గింటే హైదరాబాద్‌లో కొంత ఉందేమో! వామపక్షాలు లేవు దోమపక్షాలు లేవు. ఎన్టీఆర్ ఎవరిమీద కోపంతో టీడీపీని పెట్టారు? ఎవరిని ఓడించడానికి పెట్టారు? అలాంటి వారితో వీళ్ళు మిలాఖత్ అయితే.. ప్రజలు గమనిస్తున్నారు. అందరూ కలిసి వస్తున్నారంటే.. మా బలం పెరిగినట్టే కదా! అయినా ఎందరు కలిసి వచ్చినా.. సింహం సింగిల్‌గానే వస్తుంది. ఏం ఢోకా లేదు' అని చెప్పారు. 'నిజంగా టీడీపీ, వామపక్షాలు ఎక్కడున్నాయి? ఒక్క సీటన్నా గెలుస్తరా? ఈ గెలువనోళ్లు ఇంకొకరికి తోడయ్యారంటే ఏమనుకోవాలి?' అని ప్రశ్నించారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో పాత్రికేయులతో కేటీఆర్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పలు అంశాలపై నిర్మొహమాటంగా అభిప్రాయాలు వెల్లడించారు. కొన్నింటిపై సూటిగా స్పందించారు. పలువురు రాజకీయ నేతలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తన కుమారుడిపై వ్యాఖ్యలుచేయడంపై ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను క్షుణ్ణంగా విశ్లేషించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఏమన్నారో ఆయన మాటల్లోనే..

జానా, ఉత్తంలకూ అనుమానం లేదు..

టీఆర్ఎస్ మళ్ళీ అధికారంలోకి వస్తుందనేది అందరికీ తెలిసిందే. జానారెడ్డి, ఉత్తంకుమార్‌రెడ్డిలకుకూడా దీనిపై

మిగతా 11వ పేజీలో

60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే
అద్భుత ప్రాజెక్టు ఇది



- ఎస్సారెస్పీ పునర్జీవం పూర్తయితే కరువు రాదు
- వచ్చే జూలైనాటికి ప్రాజెక్ట్‌ను పూర్తిచేసి నీళ్లు పారిస్తాం
- రాజకీయ మనుగడ కోసం కేసులు వేస్తున్న కాంగ్రెస్
- లాయర్‌కు ఓ రైతు గంటకు ఆరు లక్షలు చెల్లించగలడా?
- భారీ నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు సూటి ప్రశ్న

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వర్షాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి లేకుండానే ఉత్తర తెలంగాణ జిల్లాలకు వరప్రదాయినిగా ఎస్సారెస్పీ పునర్జీవ పథకం నిలుస్తుందని భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఎకరా భూసేకరణ అవసరం లేకుండా, తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అద్భుతమైన పథకంగా వర్ణించారు. ఇది పూర్తయితే కరువనేదే ఉండదని చెప్పారు. గురువారం పోచంపాడ్ వద్ద ఎస్సారెస్పీ పునర్జీవ పథకానికి సీఎం కే చంద్రశేఖర్‌రావు శంకుస్థాపన చేయనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, లోయర్‌మానేరు డ్యాం, కడెం ప్రాజెక్టులకు దాదాపుగా 210 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నాయి. ఈ కేటాయింపులు వాడుకోలేకపోతున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు కింద నిర్మించనున్న మేడిగడ్డ నుంచి 215 టీఎంసీల నీరు కరువులోనూ దిగువకు వృథాగా పోయింది. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా రెండు పంటలకు నీరిచ్చే అవకాశం

మిగతా 4వ పేజీలో



మంత్రి పోచారం

ఎస్సారెస్పీ పునర్జీవ పథకం తరతరాలకు గుర్తుంటుంది. సీఎం కేసీఆర్‌కు వచ్చిన ఆలోచనతో 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు కచ్చితంగా సాగు నీరు అందుతుంది. ఈ నీళ్లతో పండే పంట విలువ రూ.80 వేల కోట్ల వరకు ఉంటుంది.



ఎంపీ కవిత

పునర్జీవ పథకంతో ఎస్సారెస్పీ ప్రాజెక్టు జీవనదిగా మారబోతున్నది. ఈ పథకంతో లాభపడే జిల్లాల్లో జగిత్యాల జిల్లా మొదటిది. పోచంపాడ్ సభకు రైతులు, గొల్ల కుర్మలు లక్షల సంఖ్యలో హాజరుకావాలి.



అవినీతి, పేదరికం.. క్విట్ ఇండియా!

కరేంగే.. ఔర్ కర్ కే రహేంగే.. అన్ని జాడ్యాలనూ నిర్మూలించి తీరుతాం

స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న భారత్‌ను నిర్మించేందుకు ఎంపీలందరూ ముందుకురావాలి

లోక్‌సభలో ప్రధాని మోదీ పిలుపు

5





మతశక్తులను ఓడిద్దాం

స్వాతంత్ర్యానికి ముప్పుగా పరిణమించిన శక్తులను అడ్డుకుందాం

కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ పిలుపు

ఉప్మా డబ్బాలో విదేశీ కరెన్సీ

విలువ రూ.1.29 కోట్లు.. పుణె ఎయిర్‌పోర్టులో ఇద్దరు అరెస్టు

16

ముదురుతున్న మాటల యుద్ధం!

బెదిరింపులు ఆపకపోతే ఉగ్రరూపాన్ని చూస్తారన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

అమెరికా నడిబొడ్డున అణుదాడి చేస్తామన్న ఉత్తర కొరియా





నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ వద్ద ఎస్సారెస్పీ పునర్జీవ పథకం శంకుస్థాపన సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ యోగితారాణా.. సిద్ధమైన బహిరంగ సభ వేదిక.. మైదానంలో ఏర్పాటు చేసిన ఫ్లడ్‌లైట్లు, టీఆర్‌ఎస్ జెండాలు

పోదాం పద పోచంపాడ్

పునర్జీవ సభకు కదులుతున్న పల్లెలు

స్వచ్ఛందంగా ట్రాక్టర్లు, డీసీఎంలలో పయనం

హైదరాబాద్/తిమ్మాపూర్/రాయికల్, నమస్తే తెలంగాణ:

ఉత్తర తెలంగాణకు ఊపిరిపోసే ఎస్సారెస్పీ పునర్జీవ పథకం శంకుస్థాపన సభ కోసం పల్లెలు కదులుతున్నాయి. సమైక్యపాలనలో ఎడారిలా మారిన ఎస్సారెస్పీకి జలజీవాలు కల్పించి జీవనదిలా మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన మరోభగీరథ ప్రయత్నానికి బాసటగా నిలిచేందుకు ప్రజలు, రైతులు ఉత్సాహంగా తరలివెళ్తున్నారు. గోదావరి నది నుంచి వేర్వేరు ప్రాంతాల్లో లిఫ్టుల ద్వారా 60 టీఎంసీలను ఎత్తిపోసి 16 లక్షల ఎకరాలకు రెండు పంటలకూ నీళ్లిచ్చే సీఎం కే చంద్రశేఖర్‌రావు సంకల్పానికి మద్దతు పలికేందుకు సిద్ధమవుతున్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ వద్ద నిర్వహించే ఎస్సారెస్పీ పునర్జీవ శంకుస్థాపనలో భాగస్వాములయ్యేందుకు ట్రాక్టర్లు, లారీలు, డీసీఎంలను బుక్ చేసుకున్నారు. సభకు ఐదు లక్షలకుపైగా ప్రజలు, రైతులు హాజరయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది. పోచంపాడు సభకు జగిత్యాల జిల్లా రాయికల్ మండలం నుంచి బుధవారమే 20 ట్రాక్టర్లలో ప్రజలు, రైతులు బయల్దేరివెళ్లారు. ఎస్సారెస్పీ పునర్జీవ పథకంతో తమ బతుకులు బాగుపడుతాయని మండల గ్రామాల ప్రజలు చెప్పారు. ట్రాక్టర్లలో తరలివెళ్లినవారిలో టీఆర్‌ఎస్ నాయకులు మోర హన్మాండ్లు, గన్నె రాజరెడ్డి, బెజ్జంకి మోహన్, గంద్ర అచ్యుత్, బూర్గుల రాజేందర్, మచ్చ నారాయణ, ఎలిగేటి అనిల్ తదితరులు ఉన్నారు.



జగిత్యాల జిల్లా రాయికల్ నుంచి పోచంపాడ్ సభకు ట్రాక్టర్లలో బయలుదేరుతున్న టీఆర్‌ఎస్ నేతలు, రైతులు



బుధవారం నిజామాబాద్ జిల్లా పోచంపాడ్‌లోని ఎస్సారెస్పీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కూడా ఉన్నారు.

నేడు పోచంపాడ్ జాతర

మూడోపేజీ తరువాయి...

బందోబస్తును ఏర్పాటుచేశారు.

60 ఎకరాల స్థలంలో భారీ బహిరంగ సభ.

ఎస్సారెస్పీ అతిథి గృహం సమీపంలో సుమారు 60 ఎకరాల మైదానాన్ని బహిరంగ సభకు సిద్ధం చేశారు. సభకు 600 మీటర్ల దూరంలో హెలిప్యాడ్ ఏర్పాటుచేశారు. 60 అడుగుల పొడవు, 40అడుగుల వెడల్పు, ఏడు అడుగుల ఎత్తుతో సభా వేదికను నిర్మించారు. వేదికపై ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు 100 మంది ప్రముఖులు పాల్గొనేలా ఏర్పాట్లుచేశారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మైదానం వరకు నాలుగు రోడ్లను ఏర్పాటుచేశారు. ఎటువంటి గందరగోళానికి ఆస్కారం లేకుండా బారికేడ్లను అమర్చారు. వేదిక కుడి పక్కన సాంస్కృతిక కార్యక్రమాల వేదికను నెలకొల్పారు. హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వరకు సీఎం రావడానికి ప్రత్యేకమైన రోడ్డు వేశారు. సభా వేదికను భద్రతా సిబ్బంది పూర్తిగా తనిఖీ చేసి, వేదిక నాణ్యతను పరీక్షించారు. సభా మైదానం చుట్టూ గులాబీ జెండాలు రెపరెపలాడుతున్నాయి.

ఎనిమిది చోట్ల పార్కింగ్ స్థలాలు..

సభకు వచ్చే వారికి ఎనిమిది చోట్ల పార్కింగ్ సౌకర్యం కల్పించారు. ఎస్సారెస్పీ రామాలయం, శివాలయంలో రెండు పార్కింగు స్థలాలు, ఇరిగేషన్ కార్యాలయం సమీపంలో ఒకటి, నెహ్రూనగర్ కాలనీలో ఒకటి, దూద్‌గామ్ చర్చిలో ఒకటి, సోన్‌పేట్ గ్రామం, చాకిర్యాల్‌లోని కోతి దేవుడు సమీపంలో, పోచంపాడ్ బస్టాండ్ సమీపంలో అమరవీరుల స్తూపం వద్ద.. మొత్తం ఎనిమిది స్థలాలను ఏర్పాటు చేశారు.

అంతా గులాబీమయం..

పోచంపాడ్ వద్ద నిర్వహించే ఎస్సారెస్పీ పునర్జీవ మహాసభను విజయవంతం చేసేందుకు రెండు వారాలుగా గులాబీ శ్రేణులు రైతులను పెద్ద ఎత్తున తరలించేందుకు నిమగ్నమయ్యాయి. మంత్రి హరీశ్‌రావు, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి బహిరంగ సభ వేదిక, పైలాన్ ఏర్పాటు స్థలం తదితర ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. బహిరంగ సభ ఏర్పాట్ల ఇన్‌చార్జిగా మంత్రి ఈటల రాజేందర్ జిల్లాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో పాల్గొని ఈ పథకం ఉద్దేశాన్ని, రైతుల బంగారు భవిష్యత్తుకోసం ప్రభుత్వం చేపడుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల రీడిజైనింగ్‌పై వివరించి, చైతన్యపరిచారు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, జోగురామన్న, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ జిల్లాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని భారీగా రైతులను తరలించేందుకు పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

తరతరాలకు గుర్తుండే పథకం



ఎస్సారెస్పీ పునర్జీవ పథకం తరతరాలకు గుర్తుంటుంది. సీఎం కేసీఆర్‌కు వచ్చిన ఆలోచనతో 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు కచ్చితంగా సాగునీరు అందుతుంది. ఈ నీళ్లతో పండే పంట విలువ రూ.80 వేల కోట్ల వరకు ఉంటుంది. ఈ పథకం శంకుస్థాపనను ఆశీర్వదించడానికి రైతులు స్వచ్ఛందంగా వస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన బహిరంగ సభల్లో ఇదే అతిపెద్దది కానున్నది. గురువారం ఉదయం 11 గంటలకే సభాప్రాంగణం నిండిపోనున్నది. సీఎం కేసీఆర్ తీసుకునే నిర్ణయాలు రైతులకు పెద్ద వరం. వాటిలో ఎస్సారెస్పీ పునర్జీవం కూడా ఒకటి. సాగునీటి సమస్యపై దృష్టిపెట్టి ప్రతి ఎకరానికి నీరందించాలని నిరంతరం పరితపించే వారిలో దేశంలో తొలిస్థానంలో సీఎం కేసీఆర్ ఉంటారు. సుపరిపాలనతో రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచే సీఎం కేసీఆర్ సభలో చెప్పే విషయాలను వినేందుకు ప్రజలు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు.

-వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సాగును పండుగ చేయడమే సీఎం లక్ష్యం

ఎస్సారెస్పీ పునర్జీవ సభను విజయవంతం చేయాలి

గొల్లకుర్మలు సంఘీభావం తెలుపాలి: ఎంపీ కవిత

జగిత్యాల, నమస్తే తెలంగాణ: 'వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు. కాళేశ్వరం నుంచి రివర్స్‌పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీని నింపే ఎత్తిపోతల పథకానికి గురువారం పోచంపాడ్‌లో శంకుస్థాపన చేస్తున్నారు. పునర్జీవ పథకంతో ఎస్సారెస్పీ ప్రాజెక్టు జీవనదిగా మారబోతున్నది'అని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత చెప్పారు. శంకుస్థాపన సభకు లక్షలాదిగా ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో కులసంఘాల నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కవిత మాట్లాడుతూ పునర్జీవ పథకంతో లాభపడే జిల్లాల్లో జగిత్యాల జిల్లా మొదటిదని చెప్పారు. రైతుల కోసం ప్రభుత్వం ఏం చేస్తున్నదో తెలియజేసే ఈ సమావేశానికి రైతులు, ఇతరవర్గాలు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉన్నదన్నారు. అందుబాటులో ఉన్న బస్సులు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు, సైకిళ్లను ఉపయోగించుకొని సభకు హాజరుకావాలని కోరారు. గొల్లకుర్మల అభివృద్ధికి పాటు పడుతున్న టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలువాల్సిన అవసరం ఉన్నదన్నారు. గొల్ల కుర్మలు సభకు హాజరై ప్రభుత్వానికి సంఘీభావాన్ని తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, నిజామాబాద్ జిల్లా గొల్ల, కుర్మసంఘం అధ్యక్షుడు మర్కల భూమన్న, ఉమ్మడి కరీంనగర్ జిల్లా గొల్ల, కుర్మసంఘం నాయకులు పాల్గొన్నారు.



జగిత్యాలలో గొల్లకుర్మ సంఘాల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కల్వకుంట్ల కవిత

అద్భుత ప్రాజెక్టు ఇది

మూడోపేజీ తరువాయి...

ఉన్నది. మహారాష్ట్రలో అధికవర్షాలు కురిస్తే ఎత్తిపోతలు అవసరం లేకుండానే ప్రాజెక్టు నిండుతుంది. లేకుంటే మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిల్ల, ఎల్లంపల్లి, మీదుగా మిడ్‌మానేరు వరదకాల్వ 102వ కిలోమీటరు వద్ద 15 మెగావాట్ల మోటర్లను బిగించి మూడుచోట్ల ఎత్తిపోతల ద్వారా శ్రీరాంసాగర్‌లోకి 60 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తాం. వరదకాల్వనే జలాశయంగా మార్చుకొని ఎత్తిపోతలకు డిజైన్ చేశాం. 11 నెలల్లోనే పూర్తి చేయాలనేది లక్ష్యం. వచ్చే జూలై నాటికి ఎస్సారెస్పీ రైతాంగానికి నీళ్లిస్తాం. కడెం ప్రాజెక్టుకూ ఏనాడు ప్రస్తుత పరిస్థితి రాలేదు. సరస్వతి కాల్వ ద్వారా 35 వేల ఎకరాలకు, లక్ష్మీ కాల్వ ద్వారా 25 వేల ఎకరాలకు నీళ్లిస్తాం. నిర్మల్, ముథోల్, గుత్ప, నిజాంసాగర్, కాళేశ్వరం ప్రాజెక్టుల కింద 4.4 లక్షల ఎకరాలకు అదనంగా నీరు అందించగలుగుతాం. టీఎస్ఐడీసీ చేపట్టిన ఎత్తిపోతల పథకాలకు నీరందిస్తాం'అని మంత్రి చెప్పారు.

రివర్స్ పంపింగ్ కాంగ్రెస్ ఎందుకు చేపట్టలేదు?

టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రతి పనిని విమర్శించడం కాంగ్రెస్ నాయకులకు పరిపాటిగా మారిందని మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‘అధికారంలో ఉన్నప్పుడు రివర్స్ పంపింగ్ గురించి ఎందుకు ఆలోచించలేదో చెప్పాలి? ఇప్పుడు వాళ్లు చెప్తున్నట్టుగా బరాజ్ ఎత్తుపెంచితే ముంపు, వ్యయం పెరుగుతుంది. ప్రాజెక్టులపై కేసులు వేయడాన్ని తప్పుపట్టడంలేదు. రైతులు కాకుండా కాంగ్రెస్ నాయకులు కేసులు వేయడాన్ని ఖండిస్తున్నాం. కాంగ్రెస్ నాయకులకు ప్రాజెక్టుల కింద భూమిలేదు, నిర్వాసితులు కాదు. కానీ కేసులు వేస్తున్నారు. ఇద్దరు ముగ్గురు వందకుపైగా కేసులు వేశారు. ఒక రైతు కేసు సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ఆ రైతు తరుపున వాదించిన న్యాయవాది ఫీజు గంటకు రూ.6 లక్షలు. ఆ రైతుకు వచ్చే నష్టపరిహారం నుంచి అంత మొత్తంలో ఫీజు ఎలా చెల్లించగలుగుతాడు? చనిపోయిన రైతులు కేసులు ఎలా వేస్తారు? వారి పేరుతో కాంగ్రెస్ నాయకులు కేసులు వేస్తున్నారు. దీంతో ఇంజినీర్ల సగం సమయం కోర్టుల చుట్టూ తిరుగడానికే సరిపోతున్నది. ఎన్నికల్లోపు ప్రాజెక్టులు పూర్తయితే రాజకీయ మనుగడ ఉండదనే కేసులు వేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును అనుకున్న సమయానికే పూర్తిచేస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టు మామూలుగా పూర్తిచేయడానికి ఐదేండ్ల సమయం పడుతుంది. ప్రాజెక్టు ప్రాధాన్యం దృష్ట్యా 18 నెలల్లో పూర్తిచేసేందుకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులోనూ పనిచేస్తున్నాం'అని మంత్రి హరీశ్‌రావు వివరించారు.

పునర్జీవంతో పునర్జన్మ



ఎస్సారెస్పీ పునర్జీవం ద్వారా పునర్జన్మ వచ్చినట్టుగా ఆయకట్టు రైతులు భావిస్తున్నారు. బాల్కొండ నియోజకవర్గంలో పాత ఆయకట్టు 36 వేల ఎకరాల స్థిరీకరణ, ప్యాకేజీ 21కింద 70 వేల ఎకరాలకు మొత్తంగా 1.3 లక్షల ఎకరాలు సాగులోకి రానున్నాయి. ఉత్తర తెలంగాణలో ఆరు ఉమ్మడి జిల్లాల రైతులు ఈ పథకంపై సంతోషంగా ఉన్నారు. ఈ పథకం ద్వారా కొత్తగా 4.5 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి. రైతులంతా సంతోషంగా సభకు హాజరుకావాలని గ్రామాల్లో తీర్మానాలు చేసుకున్నారు. సభకు రైతులు ఐదారు లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేశాం. తాగునీరు అందుబాటులో ఉంచాం.

-మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు నీళ్లు



అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం. 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కల ఎస్సారెస్పీ పునర్జీవం ద్వారా సాకారం కానున్నది. సీఎం కేసీఆర్‌ది నీళ్ల సిద్ధాంతం. తాగు, సాగు నీరు అందించడమే లక్ష్యం. శంకుస్థాపన సభకు ఇంటికొకరి చొప్పున రావడానికి సిద్ధమయ్యారు. రివర్స్ పంపింగ్ ద్వారా ఆర్మూర్ నియోజకవర్గంలో గుత్ప ఎత్తిపోతల పథకం కింద 39 వేల ఎకరాలకు, 12 ఎత్తిపోతల పథకాల ద్వారా 40 వేల ఎకరాలకు, త్వరలో మంజూరుకానున్న ఎత్తిపోతల ద్వారా మరో 20 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

- ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

పునర్జీవం.. ఉత్తర తెలంగాణకు వరం



గత పాలకుల నిర్లక్ష్యంతో ఎస్సారెస్పీ ఎగువన ఇతరరాష్ట్రాలు 160 బరాజ్‌లు నిర్మించడంతో ఆశించిన స్థాయిలో నీరు రావడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎస్సారెస్పీకి పూర్వవైభవం తెచ్చేందుకే సీఎం కేసీఆర్ రివర్స్ పంపింగ్‌తో పునర్జీవ పథకాన్ని రూపొందించారు. దీన్ని చూసి ఇంజినీర్లు, మేధావులు సైతం ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. దీని కోసం రూ.1,067 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇది పూర్తయితే ఉత్తర తెలంగాణకు వరంగా మారుతుంది. 10 వేల మెగావాట్ల కరెంటును ఉత్పత్తి చేసుకునే అవకాశం కూడా ఉంటుంది.

- ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి

17 నుంచి తుదివిడుత ఫార్మసీ కౌన్సెలింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని బీ ఫార్మసీ, ఫార్మా డీ, బయోటెక్నాలజీ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం ఈ నెల 17, 18 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తోపాటు వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఎంసెట్ కన్వీనర్ ఏ వాణీప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న ఎంసెట్ బైపీసీ విభాగంలో సీట్లు కేటాయిస్తామని, పూర్తి వివరాలకు https:// teamcetb.nic.in అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

ఊపిరిపోసుకున్న పైర్లు

మూడోపేజీ తరువాయి...

అనేక జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచే వర్షాలు పడుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపిలేని వాన కురిసింది. చాలా ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరి స్థానికులు అవస్థలుపడ్డారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులతో పాటు సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అల్పపీడనం ప్రభావంతో రానున్న 48గంటల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో పలుచోట్ల భారీ వర్షాలు, కొన్ని చోట్ల సాధారణం నుంచి మోస్తరు, మరి కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు కురుస్తాయని అధికారులు తెలిపారు. వానలతో రాష్ట్రంలోని అనేక చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతున్నది. పలు ప్రాజెక్టుల్లోకి సైతం నీరు వస్తున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు, కిన్నెరసాని, పెదవాగు, మూకమామిడి పూర్తిస్థాయి మట్టానికి నిండుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మహాముత్తారం మండలం యామన్‌పల్లి సుందరమ్మ చెరువు కట్టకు గండి పడింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ ఉప్పొంగింది. వరదనీటి ప్రవాహం పెరుగడంతో పిల్లాయిపల్లి మూసీ వంతెనపై నుంచి వెళ్తున్న ఒక వ్యక్తి బైక్‌తో సహా వరద నీటిలో కొట్టుకుపోయాడు.

ఎండిన పైర్లకు జీవం

ఈసారి వానాకాలం సీజన్ ప్రారంభానికి రెండ్రోజుల ముందే వర్షాలు మొదలయ్యాయి. విడుతలవారీగా మంచి వానలు పడటంతో రైతన్నలంతా పొలం పనుల్లో దిగారు. రికార్డుస్థాయిలో పత్తి వేశారు. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 16.76 లక్షల హెక్టార్లకుగాను బుధవారానికి 106%తో 17.77 లక్షల హెక్టార్లలో సాగుచేశారు. మక్కజొన్న, కంది, సోయాబీన్ సహా అన్ని పంటలువేశారు. గత నెల రోజులుగా వర్షాలు తగ్గడంతో చాలాచోట్ల పైర్లు వాలిపోయాయి. ఇంకో వారం ఇలానే గడిస్తే పంటలు దెబ్బతింటాయన్న ఆందోళన వ్యక్తమైన సమయంలో బుధవారంనుంచి మొదలైన వానలు పైర్లకు ప్రాణంపోశాయి. ఇప్పటివరకు మక్కజొన్న 4.44లక్షల హెక్టార్లలో సాగుచేశారు. ప్రస్తుతం పంట గింజ దశలో ఉంది. మరో వారం వర్షాలు లేకుంటే దిగుబడి దెబ్బతినేదని శాస్త్రవేత్తలు తెలిపారు. తాజా వానలతో మక్కజొన్న రైతులు నష్టాల నుంచి బయటపడ్డట్టేనని చెప్పారు. 2.37 లక్షల హెక్టార్లలో సాగుచేసిన కందికి ఈ వర్షాలు, దోహదపడనున్నాయి. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో 1.61 లక్షల హెక్టార్లలో సాగైన సోయాబీన్‌కు సైతం వానలు ఎంతో మేలు చేశాయి.

ఊపందుకోనున్న వరినాట్లు

రాష్ట్రవ్యాప్తంగా వానాకాలంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 9.34 లక్షల హెక్టార్లకుగాను బుధవారం వరకు 4.66 లక్షల హెక్టార్లలో నాట్లు పడ్డాయి. గత నెలలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సాగు విస్తీర్ణంలో 50శాతమే నాట్లు వేశారు. మంగళవారం రాత్రి నుంచి అన్ని జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో వరినాట్లు పుంజుకుంటాయని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్ సెంటర్ వరిప్రధాన శాస్త్రవేత్త ఆర్ జగదీశ్వర్ తెలిపారు.

అప్రమత్తమైన వ్యవసాయశాఖ

రాష్ట్రంలో పంటల పరిస్థితులు, వానలపై ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ అంచనా వేస్తున్నది. మంగళవారం భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్), కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రిడా), రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. వచ్చే నెలంతా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పడంతో భవిష్యత్ ప్రణాళికపై చర్చించారు. పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా అధికారులకు సూచించారు.




నిజామాబాద్ జిల్లా రెంజల్‌లో పత్తి పంటలో చేరిన వర్షం నీరు , సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలంలో మడికట్లు జలమయం

నేడు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు

ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ మీదుగా దక్షిణ తమిళనాడువరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వానలు కురుస్తున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకే రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు చెప్పారు. మరో రెండ్రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు అత్యధికంగా ఖమ్మం పట్టణంలో 9 సెం.మీ.వర్షపాతం నమోదైనట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. మెదక్‌లో 7 సెం.మీ., గోల్కొండలో 6 సెం.మీ., వెంకటాపురం, సరూర్‌నగర్, నాగార్జునసాగర్‌ల్లో 4 సెం.మీ. చొప్పున వర్షం కురిసింది. జూలపల్లి, సుల్తానాబాద్, పాలకుర్తి, మహబూబాబాద్, పేరూరు, సంగారెడ్డి, పరకాల, మక్తల్, పిట్లం, జగిత్యాల, నాగరెడ్డిపేటల్లో 3 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

78.7 శాతానికి చేరిన సాగు విస్తీర్ణం

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంటలు కలిపి 78.7 శాతం సాగులో ఉన్నట్టు బుధవారం వారాంతపు నివేదికలో వ్యవసాయశాఖ వెల్లడించింది. అన్ని పంటలు కలిపి సాధారణ సాగు విస్తీర్ణం 43.24 లక్షల హెక్టార్లకు, 34.05 లక్షల హెక్టార్లలో పంటలు వేశారు. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 16.76 లక్షల హెక్టార్లకుగాను 17.77 లక్షల హెక్టార్లలో సాగుచేశారు. వరి సాధారణ సాగు విస్తీర్ణం 9.34 లక్షల హెక్టార్లకు 50%తో 4.66 లక్షల హెక్టార్లలో వరినాట్లు వేశారు. సోయాబీన్ సాగు విస్తీర్ణం 69 శాతానికి చేరింది. వానాకాలంలో సోయాబీన్ సాధారణ సాగు విస్తీర్ణం 2.32 లక్షల హెక్టార్లు కాగా, 1.61 లక్షల హెక్టార్లలో సాగైంది. మొత్తం ఆహారధాన్యాల పంట సాధారణ సాగు విస్తీర్ణం 19.48 లక్షల హెక్టార్లకుగాను 13.05 లక్షల హెక్టార్లలో సాగుచేశారు. మరో వారంపాటు రాష్ట్రవ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అంచనా వేస్తున్నందున పంట సాగు విస్తీర్ణం వచ్చే వారంలో అనూహ్యంగా పెరిగే అవకాశం ఉంది.



వర్షాధార పంటలకు మేలు

వర్షాధార పంటలకు ఈ వానలతో ఎంతో మేలు కలుగుతుంది. నీటి వనరులు పెరుగుతున్నాయి. వరినాట్లు వేగవంతం చేసుకోవచ్చు. యూరియాను సిఫార్సు చేసిన మోతాదులోనే వేసుకోవాలి. పత్తి ఇతర పంటలకు ఈ వానలు ఎంతో మేలు చేస్తాయి.

-రాజిరెడ్డి, రీసెర్చ్ డైరెక్టర్, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం



మరో రెండ్రోజులు ప్రతి గ్రామంలో వాన

రాష్ట్రంలో రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మరో రెండ్రోజులు ఓ మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశముంది. ప్రతి గ్రామంలో కనీసం 2నుంచి 3 సెం.మీ.వర్షం కురుస్తుంది. పరిస్థితి ఆశాజనకంగా ఉంది.

- వైకే రెడ్డి, డైరెక్టర్, హైదరాబాద్ వాతావరణ కేంద్రం



వరి రైతులకు ఆందోళన వద్దు

తాజా వానలతో 20% వరినాట్లు పెరిగే అవకాశం ఉంది. ముదురునారు దగ్గర దగ్గరగా నాటుకోవాలి. 30లోపు నాట్లు పూర్తిచేసుకోవాలి.పూతదశలో చలి ఎక్కువైతే గింజ నాణ్యత ఉండదు.

-ఆర్ జగదీశ్వర్, వరి ప్రధాన శాస్త్రవేత్త, జయశంకర్ వర్సిటీ



మెట్టపంటలకు కోట్ల విలువచేసే వర్షం

ప్రస్తుత వర్షాలు మెట్టపంటలకు జీవంపోశాయి. ఇది కోట్ల రూపాయల విలువ చేసే వర్షం. మెట్టపంటలు గట్టెక్కినట్లే. వర్షాలు మరో వారం కురువనున్నందున పంటలకు ఇబ్బంది ఉండదు.

- పార్థసారథి, వ్యవసాయశాఖ కార్యదర్శి



పత్తిలో గులాబీరంగు పురుగు నివారణకు చర్యలు

వానాకాలం వేసిన పంటల్లో పత్తిలో గులాబీరంగు పురుగును గుర్తించాం. ఇది ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో కొన్ని గ్రామాలకే పరిమితమైంది. నివారణ చర్యలుచేపట్టాం.

- జగన్మోహన్, వ్యవసాయశాఖ కమిషనర్

పత్తిని ఆశించే పురుగులు తగ్గుతాయి

పత్తి రైతులు ఎకరానికి 25కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మిశ్రమాన్ని మొక్క మొదళ్ల దగ్గర వేసుకోవాలి. పత్తి పంటలో పేనుబంక, తెల్లదోమ, తామర పురుగులు ఆశించినట్టు గుర్తించాం. తాజా వర్షాలతో అవి తగ్గుతాయి.

-సుదర్శన్, పత్తి ప్రధాన శాస్త్రవేత్త

మరాఠాల మహా ప్రదర్శన



విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బుధవారం ముంబైలో భారీ ర్యాలీ నిర్వహించిన మరాఠాలు

ముంబైలో పోటెత్తిన కాషాయసముద్రం
రిజర్వేషన్లకై కదం తొక్కిన 9లక్షలమంది

ముంబై, ఆగస్టు 9: విద్యాఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల కోసం మరాఠాలు ముంబైలో బుధవారం మహా ప్రదర్శన నిర్వహించారు. మరాఠా క్రాంతి మోర్చా ఆధ్వర్యంలో భాయఖ్లాలోని జీజీమాతా ఉద్యాన్ నుంచి ముంబై నగరంలోని ఆజాద్ మైదానం వరకు సాగిన ఈ ర్యాలీలో సుమారు తొమ్మిది లక్షలమంది పాల్గొన్నారు. ముంబై రహదారులన్నీ జనప్రవాహలయ్యాయి. వెల్లువలా దూసుకొచ్చిన ఆందోళనకారులతో మహానగర జనజీవనం స్తంభించింది. రైతుల రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధరలను డిమాండ్ చేస్తూ మరాఠాలు నిరసనబాట పట్టారు. శాంతియుతంగా సాగిన ఈ మహా ర్యాలీలో రాజకీయ ప్రముఖులు ఎవరూ లేరు. ఉదయం 11గంటలకు ప్రదర్శన ప్రారంభ వేదిక వద్ద శివసేన ఏర్పాటు చేసిన భారీ బ్యానర్‌ను ఉద్యమకారులు తొలగించి, పార్టీల మద్దతు తమ ఆందోళనకు అవసరం లేదని ప్రకటించారు. ప్రదర్శనకారులతో నిండిపోయిన ఆజాద్ మైదానం కాషాయ సముద్రంలా కనిపించింది. రాజ్యసభ సభ్యుడు ఛత్రపతి శంభాజీ రాజే మాట్లాడుతూ తాను మరాఠా సామాజికవర్గం సాధారణ వ్యక్తిగా పాల్గొన్నానని ఆయన చెప్పారు. ఇక బీజేపీ ముంబైశాఖ అధ్యక్షుడు ఆశిష్ షేలార్ అక్కడకు రాగానే ఆందోళనకారులు ఆయనను వెనక్కి పంపేశారు. ప్రదర్శనకు మద్దతు పలికిన బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ 'ఏక్ మరాఠా.. లాఖ్ మరాఠా' అని మరాఠీలో ట్వీట్ చేశారు. మూడేండ్ల చిన్నారి ఇష్టవి దేశ్‌ముఖ్ మరాఠాలకు రిజర్వేషన్లపై చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. పదివేలమందికి పైగా పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

దిగి వచ్చిన ఫడ్నవిస్ సర్కార్

ఫడ్నవిస్ ప్రభుత్వం ఉపశమన చర్యలకు దిగింది. మరాఠాల ప్రధాన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ బుధవారం తెలిపారు. రిజర్వేషన్ల డిమాండ్‌పై అధ్యయనానికి ప్రత్యేక బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

అవినీతి, పేదరికం..
క్విట్ ఇండియా

కరేంగే.. ఔర్ కర్ కే రహేంగే
అన్ని జాడ్యాలనూ నిర్మూలించి తీరుతాం
స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న భారత్‌ను నిర్మించేందుకు ఎంపీలందరూ ముందుకురావాలి
'క్విట్ ఇండియా' 75వ వార్షికోత్సవం సందర్భంగా లోక్‌సభలో ప్రధాని మోదీ పిలుపు



75 ఏండ్ల క్రితం క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా ముంబైలో జరిగిన సభలో మహాత్మాగాంధీ

న్యూఢిల్లీ, ఆగస్టు 9: అవినీతి, పేదరికం, నిరక్షరాస్యత.. ఈ దేశంలో అతి పెద్ద సవాళ్లని వాటిని నిర్మూలించేందుకు 'కరేంగే.. ఔర్ కర్ కే రహేంగే (కృషి చేస్తాం.. చేసి తీరుతాం)' అన్న ప్రతిజ్ఞ చేయాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఇందుకు వచ్చే ఐదేండ్లలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం లోక్‌సభలో ప్రధాని ప్ర సంగిస్తూ క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా 1942 నుంచి 1947 మధ్య ప్రజల్లో రగులుకున్న స్ఫూర్తిని 2017 నుంచి 2022 మధ్య మళ్లీ మేల్కొల్పాల్సి ఉన్నదన్నారు. అవినీతి, పేదరికం, నిరక్షరాస్యత, పోషకాహార లోపం దేశం ముందున్న అతిపెద్ద సవాళ్లని చెప్పారు. ఈ విషయమై ఓ సానుకూల మార్పును తేవాల్సి ఉందన్నారు. నాడు 1942లో 'కరేంగే యా మరేంగే (పోరాడుతాం లేదా చనిపోతాం)' అంటూ శంఖారావం పూరించారని, నేడు 'కరేంగే ఔర్ కర్ కే రహేంగే' అని నినదించాల్సి ఉందని, వచ్చే ఐదేండ్లు ఇదే సంకల్పంతో ముందుకు సాగాలని ప్రధాని చెప్పారు.

ఇతర దేశాలకు భారత్ స్ఫూర్తిగా నిలువాలి

వచ్చే ఐదేండ్లలో భారత్‌లో జరిగే సానుకూల మార్పులు విదేశాలకు ఆదర్శంగా నిలువాలని ప్రధాని మోదీ చెప్పారు. వలస పాలకుల నుంచి పొందిన స్వాతంత్ర్యం కేవలం మనదేశానికే పరిమితం కాలేదని, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో కూడా వలస పాలన ముగింపునకు మన జాతియోద్యమం స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న భారత్‌ను సృష్టించేందుకు ఎంపీలందరూ పార్టీలకతీతంగా ముందుకురావాలని ప్రధాని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య పోరులో మహిళలు నిర్వహించిన పాత్రను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉమ్మడి లక్ష్యాల సాధనలో వారు కూడా అపారమైన శక్తిగా మారగలరని అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభంలో మహాత్మాగాంధీ తదితర జాతీయ నేతలు జైలుపాలయ్యారని, దీంతో కొత్త తరం నేతలు ముందుకు వచ్చి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని ప్రధాని మోదీ గుర్తు చేశారు. క్విట్ ఇండియా ఉద్యమం కొత్త తరం నేతలకు స్ఫూర్తినిచ్చిందని, భవిష్యత్ తరాలకు ఆ వారసత్వాన్ని అందించే బాధ్యత ప్రస్తుత తరంపై ఉన్నదని అన్నారు. జీఎస్టీ చట్టం ఆవిష్కరణలో కూడా రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వచ్చాయని, దేశంలోని అన్ని సమస్యల పరిష్కరించేందుకు అదే దృక్పథంతో ముందుకు రావాలన్నారు.



హక్కులతోపాటు విధులు మరువొద్దు

దేశ ప్రజలకు తమ హక్కులపై అవగాహన ఉన్నదని, అదే సమయంలో వారు తమ విధులను కూడా మరువరాదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అవినీతిని అధిగమిస్తామని, పేదలకు వారి హక్కులను, యువతకు స్వయం ఉపాధిని కల్పిస్తామని, పోషకాహార లోపానికి ముగింపు పలుకుతామని, మహిళాసాధికారతకు నిరక్షరాస్యత నిర్మూలనకు ఎదురవుతున్న ఆటంకాలను తొలగిస్తామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు.

మతశక్తులను ఓడిద్దాం

- **స్వాతంత్ర్యానికి ముప్పుగా పరిణమించిన శక్తులను అడ్డుకుందాం**
- **కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ పిలుపు**



లోక్‌సభలో బుధవారం మాట్లాడుతున్న సోనియా

న్యూఢిల్లీ, ఆగస్టు 9: భారత ప్రజాస్వామ్య పునాదులను చీకటి శక్తులు ధ్వంసం చేస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. మత శక్తులను పురోగమించనివ్వరాదని, ఆ నిరంకుశ శక్తులను ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు. నాటి క్విట్ ఇండియా ఉద్యమా న్ని కొన్ని సంస్థలు వ్యతిరేకించాయని, స్వాతంత్రోద్యమం లో వాటికి ఏ పాత్ర లేదని ఆమె పరోక్షంగా ఆరెస్సెస్‌నుద్దేశించి అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం లోక్‌సభలో జరిగిన ప్రత్యేక చర్చలో ఆమె మాట్లాడుతూ, దేశంలో విభజన రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని, స్వాతంత్ర్యానికి ముప్పుగా పరిణమించిన శక్తులను ఓడించాలన్నారు. స్వేచ్ఛ లౌకిక, ప్రజాస్వామిక, విలువలు అంతరించిపోతున్నాయన్నారు. చర్చకు, భిన్నాభిప్రాయాలకు తావులేకుండా పోతున్నదన్నారు. 'చీకటి శక్తులు ఆవిర్భవించా యా? స్వేచ్ఛా భావన ఉనికి కోల్పోయిందన్న ఆందోళన కలుగుతున్నదా? సమానత్వం, సామాజిక న్యాయం, వా క్ స్వాతంత్ర్యంపై ఆధారపడిన ప్రజాస్వామ్య పునాదుల ధ్వంసానికి ప్రయత్నాలు జరుగుతున్నాయా?' అని సోనియా ప్రశ్నించారు. ఆమె ప్రసంగాన్ని ప్రధాని మోదీ ఆసాంతం శ్రద్ధగా విన్నారు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించిన సంస్థలను, వ్యక్తులను మరిచిపోరాదని, వారు స్వాతంత్ర్య పోరులో ఎటువంటి పాత్ర పోషించలేదని సోనియా ఈ వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు బీజేపీ సభ్యురాలు కిరణ్‌ఖేర్ 'అసంబద్ధ వ్యాఖ్య' అంటూ అరిచారు. అధికార పక్ష సభ్యులు ఆమెను మౌనంగా ఉండాలని సైగలు చేశారు. ఈ దేశాన్ని విభజన, మతపరమైన సిద్ధాంతాలకు, సంకుచిత మనస్తత్వాలకు బందీగా మారనివ్వబోమని స్పష్టంచేశారు. స్వాతంత్ర్య పోరులో కాంగ్రెస్ నేతల త్యాగాలను గుర్తు చేశారు.

బీజేపీ.. క్విట్ ఇండియా: మమత

మెదినిపూర్: మోదీ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని అణిచివేస్తున్నదని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడానికి అన్ని విపక్ష పార్టీలతో కలిసి తృణమూల్‌పనిచేస్తుందని అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని మెదినిపూర్‌లో 'బీజేపీ క్విట్ ఇండియా' ప్రచారాన్ని ప్రారంభించారు.

పటిష్ఠమైన భారత్‌ను నిర్మిద్దాం

- **పార్లమెంట్ ఉభయ సభల తీర్మానం**

పటిష్ఠమైన, స్వయం ఆధారిత, లౌకిక, ప్రాజాస్వామిక భారత్‌ను నిర్మించాలని, సామరస్యాన్ని ప్రోత్సహించాలని, అవినీతిని అరికట్టాలని పార్లమెంట్ ఉభయ సభలు తీర్మానించాయి. క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభ నాటి వీరోచిత పోరాటాన్ని, లక్షల మంది భారతీయుల ప్రాణత్యాగాన్ని స్మరించుకుంది. చైర్మన్ హమీద్ అన్సారీ ఒక తీర్మానాన్ని ప్రవేశపెడుతూ, బ్రిటిష్ పాలన ముగింపునకు నాడు మహాత్మాగాంధీ 'పోరాడు లేదా చావు' అని పిలుపునిచ్చారని చెప్పారు.'స్వాతంత్రోద్యమ విలువలను, ఆదర్శాలను పరిరక్షిస్తామని, లౌకిక, ప్రజాస్వామిక భారత్‌ను నిర్మించేందుకు పునరంకితమవుతామని ఈ సభ ప్రతిజ్ఞ చేస్తున్నది' అని అన్సారీ చెప్పారు. ఈ తీర్మానాన్ని రాజ్యసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మరోవైపు ప్రజాస్వామిక విలువలను పరిరక్షిస్తామని, సామరస్యాన్ని, దేశభక్తిని ప్రోత్సహిస్తామని, దేశం నుండి అవినీతిని పారదోలుతామని లోక్‌సభ తీర్మానించింది. ప్రధాని మోదీ సహా ఆయా పార్టీలనేతలు మాట్లాడిన తర్వాత తీర్మానాన్ని స్పీకర్ సుమిత్రా మహాజన్ చదివి వినిపించారు.

హిందూ పాకిస్థాన్‌ను సృష్టించవద్దు

భారత్ నుంచి 'హిందూ పాకిస్థాన్'ను సృష్టించరాదని సీపీఎం నేత సీతారాం ఏచూరి హెచ్చరించారు. క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో బుధవారం జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. 'దేశం నుంచి మతోన్మాదం వెళ్లిపోవాలి (క్విట్ ఇండియా) అని ప్రధాని మోదీ అంటున్నారు. నిజానికి మతోన్మాదాన్ని సాగనంపేందుకు మనమేదైనా చేస్తున్నామా' అని ఆయన ప్రశ్నించారు. తృణమూల్ సభ్యుడు సుఖేందు రాయ్ మాట్లాడుతూ నాడు కూడా కొందరు దేశద్రోహులు క్విట్ ఇండియా ఉద్యమాన్ని నీరుగార్చేందుకు బ్రిటీషువారితో జతకట్టారని ఆరోపించారు. బీజేడీ సభ్యుడు ప్రసన్న ఆచార్య మాట్లాడుతూ, కాంగ్రెస్ రహిత, బీజేపీ రహిత భారత్‌ను కాకుండా అవినీతిలేని మతోన్మాద రహిత భారతదేశాన్ని నిర్మించాలన్నారు. సమాజంలో అసమానతల గురించి బీఎస్పీ సభ్యుడు వీర్‌సింగ్ ప్రస్తావించారు. హిందీ మాట్లాడలేనివారు, కొన్ని ఆహార పదార్థాలు తినేవారు భారతీయులే కాదన్న వాతావరణం నెలకొన్నదని డీఎంకే సభ్యురాలు కనిమొళి ఆవేదన వ్యక్తం చేశారు. శివసేన సభ్యుడు సంజయ్ రౌత్ మాట్లాడుతూ, క్విట్ ఇండియా ఉద్యమం ఏ ఒక్క పార్టీ గుత్తాధిపత్యం కాదన్నారు. కాంగ్రెస్ నాయకుడు గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ, నాటి క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభోత్సవ సందర్భాన్ని మంగళవారం రాత్రి గుజరాత్‌లో జరిగిన పరిణామాలతో పోల్చారు.


క్విట్ ఇండియా స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- **కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జిల్లాల సమగ్రాభివృద్ధికి కలెక్టర్లు 'క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రధాని నరేంద్రమోదీ కోరారు. బుధవారం రాత్రి ఏడు గంటలకు ఆయన దేశవ్యాప్తంగా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఒక లక్ష్యంతో నాడు క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించి ఐదేండ్లలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారన్నారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో దేశాభివృద్ధికి 2017 – 22 మధ్య ఐదేండ్ల కాల పరిమితితో సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. దీని అమలు కోసం కార్యాచరణ ప్రణాళిక తయారుచేయాలని అన్నారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలు విజయవంతమైనట్లు తనకు దేశంలోని నలుమూలల నుంచి సమాచారం అందిందన్నారు. జిల్లాల కలెక్టర్లు నిబద్ధతతో పనిచేస్తేనే ప్రజలకు అభివృద్ధి ఫలాలు, సంక్షేమ పథకాలు చేరతాయని ప్రధాని మోదీ తెలిపారు.

ఏ సవాల్‌నైనా ఎదుర్కొంటాం

- **మన సైన్యానికి ఆ సత్తా ఉంది**
- **చైనాకు రక్షణశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ పరోక్ష హెచ్చరిక**



న్యూఢిల్లీ : దేశ భద్రత విషయంలో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే సత్తా భారత సైన్యానికి ఉన్నదని రక్షణశాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. 1962 నాటి భారత్–చైనా యుద్ధం నుంచి ఎంతో నేర్చుకున్నామని, ఆ తర్వాత మన సైన్యం క్రమంగా బలపడిందన్నారు. క్విట్‌ఇండియా ఉ ద్యమం మొదలై 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం రాజ్యసభలో జరిగిన ప్ర త్యేక చర్చలో అరుణ్‌జైట్లీ ప్రసంగిస్తూ సరిహ ద్దు వివాదాలపై స్పందించారు. ఓవైపు భారత సైన్యానికి స్ఫూర్తిని రగిలిస్తూ.. మరోవైపు డోక్లాం సరిహద్దు వివాదంలో చైనాను పరోక్షంగా హెచ్చరించారు. 'దశాబ్దాలుగా భారత్‌కు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. వీటన్నింటినీ సమర్థంగా ఎదుర్కోవడం ద్వారా మనం మరింత శక్తిమంతంగా తయారయ్యామని సగర్వంగా చెప్పగలను. 1962 యుద్ధం నుంచి మనం ఎంతో నేర్చుకున్నాం. 1965, 1971 యుద్ధాల్లో విజయం సాధించగలిగాం' అని అన్నారు. భారత్ 1962 యుద్ధంలో చైనా చేతిలో ఓడిపోగా, 1965, 1971 యుద్ధాల్లో పాక్‌పై చిరస్మరణీయ విజయం సాధించింది. 'ఇప్పటికీ మన దేశానికి ముప్పు పొంచి ఉన్నది. కొందరు మన దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నారు. కానీ మన సైన్యం వాటిని సమర్థంగా ఎదుర్కొని భారత ప్రజలకు రక్షణ కల్పిస్తుందని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. తూర్పు..పడమర.. ఇలా ఏ సరిహద్దు నుంచి సవాళ్లు ఎదురైనా తిప్పికొడుతాం. దేశ రక్షణ కోసం ఆర్మీ ఏ త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నది' అని జైట్లీ స్పష్టం చేశారు. కాగా, డోక్లాం వివాదంలో సమయం మించి పోతున్నదని చైనా ప్రభుత్వ పత్రిక 'చైనా డైలీ' యుద్ధ సంకేతాలు ఇస్తూ భారత్‌ను హెచ్చరించింది.


హిందీ-చీనీ భాయీ భాయీ : దలైలామా



డోక్లాం సమస్య అంత తీవ్రమైన విషయం కాదని టిబెట్ ఆధ్యాత్మిక నేత దలైలామా అన్నారు. భారత్, చైనా కలిసి ముందుకు సాగాలని, ప్రస్తుత పరిస్థితుల్లో హిందీ–చీనీ భాయీ భాయీ నినాదమే ఉత్తమ పరిష్కారమన్నారు. రెండు నెలలుగా డోక్లాంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై బుధవారం ఆయన స్పందించారు. భారత్‌లో స్వేచ్ఛ ఉన్నదని అందుకే తాను ఇక్కడ నివసిస్తున్నానని పేర్కొన్నారు. స్వేచ్ఛ లేని ప్రాంతాన్ని తాను ఇష్టపడనని పరోక్షంగా చైనాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

గుజరాత్ ఎన్నికల విజేత ఈసీ!

స్వయంప్రతిపత్తిని చాటిన ఎన్నికల కమిషన్
కాంగ్రెస్‌కు ఊరటనిచ్చిన కీలక నిర్ణయం
ఐదోసారి రాజ్యసభకు ఎన్నికైన అహ్మద్ పటేల్



న్యూఢిల్లీ: గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో సిసలైన విజేతగా ఎన్నికల కమిషనే(ఈసీ) నిలిచింది. బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ వ్యూహాలు, పలు ఉత్కంఠ పరిణామాల మధ్య కాంగ్రెస్ అభ్యర్థి, సోనియా రాజకీయ వ్యవహారాల కార్యదర్శి అహ్మద్ పటేల్ విజయం సాధించినా, ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం మొత్తం ఫలితాలను మలుపుతిప్పింది. ఎమ్మెల్యేల బలాబలాల ప్రకారం బీజేపీ నుంచి అమిత్‌షా, స్మృతిఇరానీ రాజ్యసభకు ఎన్నిక ముందే ఖరారైంది. ఇకపోతే సరిపడా సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థి గెలుపుకోసం బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేసింది. కాంగ్రెస్ నుంచి బల్వంత్ సింహ్ రాజ్‌పుత్‌ను పార్టీలో చేర్చుకుని అతడినే కాంగ్రెస్‌పై పోటీకి దింపింది. వాఘేలా నాయకత్వంలోని కాంగ్రెస్ తిరుగుబాటు వర్గాన్ని బయటకు లాగింది. దీంతో అప్రమత్తమైన కాంగ్రెస్ ఉన్న ఎమ్మెల్యేలు చేజారకుండా చూసుకుంటూ, గెలుపు దిశగా హోరాహోరీగా పోరాడింది. ఒక దశలో అహ్మద్ పటేల్ విజయంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అలాంటి కీలక సందర్భంలో ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం మొత్తం ఫలితాన్నే తిరుగరాసింది. కాంగ్రెస్‌కు ఊరటనిచ్చే విజయాన్ని అందించింది.

ఫలితాన్ని మార్చిన రెండు ఓట్లు

గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికల కౌంటింగ్ ప్రారంభించేందుకు అనుమతించాలని కోరుతూ రిటర్నింగ్ అధికారి సాయంత్రం 5.19 గంటలకు ఈసీకి నివేదిక పంపారు. బీజేపీకి ఓటేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భోలాభాయ్ గోహిల్, రాఘవ్‌జీభాయ్ పటేల్ ఓట్లను తిరస్కరించాలని కోరుతూ కాంగ్రెస్ ఎన్నికల ఏజంట్ రెండు రాతపూర్వక దరఖాస్తులు సమర్పించారని ఆ నివేదికలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి – 1961లోని 39 ఏఏ నిబంధన ప్రకారం ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఏజంట్‌కు కాకుండా ఇతరులకు తమ ఓట్లను చూపి, నిబంధనలను ఉల్లంఘించారని తమకు ఫిర్యాదు చేశారని నివేదించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు పోటాపోటీగా రెండుసార్లు ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించి తమ వాదనలను బలంగా వినిపించారు. రెండోసారి ఈసీతో సమావేశమైన కాంగ్రెస్ బృందం.. కుల్దీప్‌నయ్యర్ కేసులో ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పును ఉటంకించింది. దీంతో గుజరాత్ రాజ్యసభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను చిత్రీకరించిన వీడియోను ప్రధాన ఎన్నికల కమిషనర్ అచల్‌కుమార్ జ్యోతి సారథ్యంలోని పూర్తిస్థాయి కమిషన్ వీక్షించింది.

14 మంది నేతలపై కాంగ్రెస్ వేటు

విప్‌కు ఉల్లంఘించిన 8 మంది ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఆరేండ్లపాటు బహిష్కరణ వేటు విధించింది. వీరితోపాటు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన మరో ఆరుగురు నేతలను కూడా బహిష్కరించాలని అధిష్ఠానానికి సిఫారసు చేసినట్లు గుజరాత్ ఇన్‌చార్జి అశోక్ గెహ్లాట్ తెలిపారు.

బీజేపీ ఓటమిలో కీలకవ్యక్తి శక్తీసింహ్

కాంగ్రెస్ పోలింగ్ ఏజెంట్ శక్తీసింహ్ గోహిల్ బీజేపీ ఓటమిలో కీలక భూమిక పోషించారు. ఇద్దరు కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు నిబంధనలు ఉల్లంఘించిన విషయాన్ని తొలుత ఆయనే గుర్తించారు. 'అమిత్‌షా కూర్చున్న వైపు ఇద్దరు కాంగ్రెస్ రెబల్స్ తమ బ్యాలెట్లు చూపడం గమనించాను. నిబంధనల ప్రకారం రహస్య ఓటింగ్‌కు భిన్నంగా వ్యవహరించి దొరికిపోయారు' అని రాజ్యసభ ఎన్నికల్లో శక్తిసింహ్ గోహిల్ తెలిపారు.

గట్టెక్కించిన ముగ్గురి మద్దతు

ఓవైపు క్రాస్‌ఓటింగ్‌లో సొంతపార్టీ ఎమ్మెల్యేల ఓట్లే చేజారిపోతుంటే అహ్మద్‌పటేల్‌ను ముగ్గురి కాంగ్రెసేతర ఎమ్మెల్యేల మద్దతు కాపాడింది. వారిలో ఎన్సీపీ ఎమ్మెల్యే జయంత్‌పటేల్ మొదటి వ్యక్తి. రెండో వ్యక్తి జేడీయూ ఎమ్మెల్యే ఛోటూ వాసవ కాంగ్రెస్ అభ్యర్థికే మద్దతు తెలిపినట్లు ప్రకటించారు. మూడోవ్యక్తి గుజరాత్ పరివర్తన్ పార్టీ ఎమ్మెల్యే నళిన్ కొటాడియా కాంగ్రెస్‌కు ఓటేసినట్లు ప్రకటించారు.



1942లో క్విట్ ఇండియా ఉద్యమం నాటి లక్ష్యాలు వేరు. వలస పాలన అంతం కావటమే లక్ష్యం. కానీ 75 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత మన లక్ష్యాలు మరిన్ని ఉన్నాయి. పేదరికం, అవినీతి, టెర్రరిజం, కులతత్వం, మతోన్మాదం ఇవ్వాళ్టి సమస్యలు. వీటన్నింటి నుంచి దేశాన్ని 2022 వరకు విముక్తి చేయాలి.

నరేంద్రమోదీ, ప్రధాని

వాస్తవ చరిత్ర అవగాహనే భవిష్యత్తును తీర్చిదిద్దుతుంది. ఒకవేళ చరిత్రను వక్రీకరిస్తే దేశ అభివృద్ధి మూలాలే దెబ్బతింటాయి. ఇప్పుడు చరిత్రను వక్రీకరించే పని అనేకవిధాలుగా జరుగుతున్నది. చరిత్రను తప్పుడు భావాలతో చెప్పుకున్న జాతి, దేశం సమస్యల్లో కూరుకుపోతుంది.

శరద్‌యాదవ్, జేడీయూ అధినేత



చరిత్రలో నేడు



1511

మలక్కా భూ భాగాలను ఆక్రమించిన పోర్చ్‌గీసు సేనలు.

1831



బానిసత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన నాట్ టర్నర్.



1869

సినిమా 'ప్రాజెక్టర్'ను కనుగొన్న ఓబీ బ్రౌన్.

ఈ మధ్య చండీగఢ్‌లో హర్యానా బీజేపీ నేత కుమారుడు ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి కూతురిని వేటాడి వేధించిన ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నది. ఈ క్రమంలో కొందరు బీజేపీ నేతల తీరు విడ్డూరంగా ఉన్నది. అర్ధరాత్రి వేళ మహిళకు రోడ్లపై ఏం పని అని ఎదురుప్రశ్నిస్తూ తప్పంతా ఆమెదే అన్నట్లు వ్యవహరించారు. బాధితురాలు మాత్రం నేతల తీరును తీవ్రంగా ఖండించింది. ఏదేమైనా రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా దోషులను శిక్షించి స్త్రీ గౌరవానికి, స్వేచ్ఛకు హామీగా నిలువాలి.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 రాజకీయ పక్షాల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉన్నది. అదింకా చట్టరూపం దాల్చకుండా మిగిలిపోయింది. దీనికి రాష్ట్రాలు అవలంబించవలసిన విధానాలు, కేంద్రప్రభుత్వ బాధ్యతల విషయంలో స్పష్టత లేక చట్టం మరుగునపడటం రాజకీయ పార్టీల చిత్తశుద్ధికి నిదర్శనం ఈ చట్టం అమల్లోకి వస్తే దేశంలో పేదలకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉన్నది. కేంద్రం చట్టం చేసిన తర్వాత కూడా అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్రాలదే. కాబట్టి ఇప్పటికైనా రాజకీయ పక్షాలు ఆహార భద్రతా చట్టంపై ముందుకు కదలాలి.

ది హిందూ

ఓటు గోప్యత, పవిత్రత

గుజరాత్ నుంచి రాజ్యసభ సభ్యులను ఎన్నుకోవడానికి జరిగిన పోలింగ్ సార్వత్రిక ఎన్నికలను తలపించి ఉత్కంఠను రేపింది. బీజేపీ, కాంగ్రెస్ కొద్ది రోజులుగా నడుపుతున్న రాజకీయ నాటకం రసవత్తరంగా మారి మంగళవారం అర్ధరాత్రికి పతాకస్థాయికి చేరింది. మొత్తం మూడు స్థానాలలో బీజేపీకి ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకునే బలం మాత్రమే ఉన్నది. లెక్క ప్రకారం మూడో స్థానం కాంగ్రెస్‌కు దక్కుతుంది. కానీ బీజేపీ మూడో అభ్యర్థిని కూడా పోటీ పెట్టి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టి గెలువాలనుకున్నది. కాంగ్రెస్ నుంచి కొంత మందిని తమవైపు తిప్పుకోగలిగింది. కాంగ్రెస్‌లోని బలమైన నాయకుడు వాఘేలా కొత్త పార్టీ ఏర్పాటు చేసి, బీజేపీకి మద్దతు పలికారు. కాంగ్రెస్ చీఫ్ విప్‌గా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే బల్వంత్‌సింహ్ రాజ్‌పుత్‌ను మూడో అభ్యర్థిగా నిలబెట్టి కాంగ్రెస్ ప్రముఖుడు, సోనియా గాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్ విజయావకాశాలను దెబ్బకొట్టాలని భావించింది. వచ్చే ఏడాది గుజరాత్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయాలనేది బీజేపీ నేత అమిత్ షా ఎత్తుగడ. కానీ రాజ్యసభకు పోటీ చేస్తున్న అహ్మద్ పటేల్ కూడా అమిత్‌షా మాదిరిగా అపర చాణక్యుడే. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రత్యేక శిబిరానికి తరలించి కాపాడుకున్నారు. బీజేపీకి ఓటేసి బ్యాలట్ పత్రాన్ని అమిత్‌షాకు చూపించిన తమ ఇద్దరు ఎమ్మెల్యేల ఓట్లను చెల్లకుండా చేయించడంలో కూడా కాంగ్రెస్ నాయకత్వం సఫలమైంది. దీంతో బీజేపీ వ్యూహం బెడిసికొట్టడమే కాదు, ఆ పార్టీ నైతికత ప్రశ్నార్థకమైంది. పార్టీ రాజకీయాలు ఎట్లా ఉన్నా, బ్యాలట్ పత్రాన్ని బహిరంగ పరిచిన కాంగ్రెస్ సభ్యుల ఓట్లు చెల్లవని ప్రకటించిన ఎన్నికల కమిషన్ నిర్ణయం హర్షించదగినది.

ప్రజాక్షేత్రంలో విజయం సాధించి చట్టసభల్లో ప్రవేశించడం ప్రజాస్వామ్య లక్షణం. అయితే దేశ ప్రయోజనాల కోసం, శాసన రంగాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడానికి మేధావుల సేవలను ఉపయోగించుకోవడం కూడా అవసరమే. రాజ్యసభ ఇందుకు వీలు కల్పిస్తున్నది. కానీ ఇటీవలి కాలంలో పారిశ్రామికవేత్తలు పార్లమెంటులో ప్రవేశించడానికి శాసనసభ్యులను ప్రలోభ పెడుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. అందువల్ల రాజ్యసభ ఎన్నికలలో ఓటేసే శాసనసభ్యులు పార్టీ నిర్ణయానికి కట్టుబడేందుకు 'బహిరంగ బ్యాలెట్ విధానం' ప్రవేశపెట్టారు. ఈ విధానం ప్రకారం శాసనసభ్యుడు ఓటేసిన తరువాత బ్యాలెట్ పత్రాన్ని పార్టీ నియమించిన ప్రతినిధికి చూపించవలసి ఉంటుంది. నిజానికి ఇటువంటి నిబంధన ఉండటం బాధాకరమే. శాసనసభ్యుని స్వేచ్ఛకు భంగం కలుగకూడదు. ప్రజాస్వామ్యానికి, ఎన్నికల వ్యవస్థకు ప్రాణప్రదమైన రహస్య బ్యాలెట్ విధానం చెక్కుచెదరకూడదనేది ప్రజాస్వామ్య ప్రియుల ఆకాంక్ష. కానీ ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారే ప్రమాదాన్ని అరికట్టడానికి చేసిన మినహాయింపు ఇది. గుజరాత్ రాజ్యసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా బీజేపీకి ఓటేయడమే కాకుండా, బ్యాలెట్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్‌షాకు చూపించారు. దీనిపై కాంగ్రెస్ అభ్యంతరం చెప్పింది. రాజ్యసభలో బహిరంగ విధానాన్ని అమలు చేస్తున్నందువల్ల బ్యాలెట్‌ను చూపించడంలో తప్పులేదనేది బీజేపీ వాదన. ఈ వివాదాన్ని కూలంకషంగా విచారించిన ఎన్నికల కమిషన్ ఆ ఇద్దరు కాంగ్రెస్ శాసనసభ్యుల ఓట్లు చెల్లవని ప్రకటించింది. కొత్త విధానం ప్రకారం– ఓటరు తన బ్యాలెట్ పత్రాన్ని తమ పార్టీ నియమించిన ప్రతినిధికి చూపించాలే తప్ప ఇతరులకు కాదు. పార్టీ ప్రతినిధికి చూపించే నిబంధన ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్యానికి కీలకమైన 'రహస్య ఓటు' విధానం తొలిగిపోయినట్టు కాదు.

> **రాజకీయాలను భ్రష్టు పట్టించడంలో రెండు పక్షాలూ పోటాపోటీగా సాగుతున్నాయి. రాజకీయ పక్షాలు ప్రజాసేవాకాంక్ష గల ఉత్తమైన నాయకులకు టికెట్లు ఇచ్చి గెలిపించుకున్నట్టయితే వారు ప్రలోభాలకు గురికారు. క్యాంపు రాజకీయాలు, బహిరంగ ఓటింగ్ విధానాల అవసరం ఉండదు. ఇప్పటికైనా రాజకీయ పక్షాలు విలువలతో కూడిన రాజకీయాలను నెలకొల్పడానికి ప్రయత్నించాలె.**

ఓటు గోప్యతను, పవిత్రను కాపాడే రీతిలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన స్పష్టత ప్రజాస్వామ్యవాదులకు సంతృప్తినిచ్చేదిగా ఉన్నది. ప్రజా ప్రతినిధులు ప్రలోభాలకు గురవుతున్న నేపథ్యంలో, పార్టీ నాయకత్వానికి జవాబుదారీగా ఉండటానికి మాత్రమే రహస్య బ్యాలెట్ విధానంలో ఒక మినహాయింపును చేర్చారు. అయినంత మాత్రాన అంత బహిరంగంగా బ్యాలెట్ పత్రాన్ని ప్రదర్శించడం నిబంధనలకు విరుద్ధమే. రాజ్యసభ ఎన్నికలలో ప్రవేశ పెట్టిన బహిరంగ బ్యాలెట్ విధానం క్రమంగా ఇతర ఎన్నికలకు విస్తరించి రహస్య బ్యాలట్ స్ఫూర్తి నిర్వీర్యమవుతుందనే భయం ఇప్పటికే ఉన్నది. అటువంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి కూడా. గుజరాత్ వివాదంలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన స్పష్టత దీర్ఘకాలికంగా రహస్య ఓటింగ్ విధాన పరిరక్షణకు దోహదపడుతుంది. గుజరాత్ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికలు ప్రజలకు రాజకీయ పక్షాల పట్ల ఏవగింపును కలిగించాయి. ఇంతకాలం అధికారాన్ని పొందడానికి, కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఎటువంటి నీతిబాహ్యమైన విధానాలను అనుసరించిందో ప్రజలు గమనించారు. ఇప్పుడు బీజేపీ కూడా అదే బాటలో నడుస్తున్నది. గుజరాత్‌లో నాటకీయ పరిణామాలలో బీజేపీ భంగపడ్డంత మాత్రాన కాంగ్రెస్ పార్టీ ఉత్తమ రాజకీయాలకు ప్రతీక అని భావించ లేము. రాజకీయాలను భ్రష్టు పట్టించడంలో రెండుపక్షాలూ పోటాపోటీగా సాగుతున్నాయి. రాజకీయ పక్షాలు ప్రజాసేవాకాంక్ష గల ఉత్తమైన నాయకులకు టికెట్లు ఇచ్చి గెలిపించుకున్నట్టయితే వారు ప్రలోభాలకు గురికారు. క్యాంపు రాజకీయాలు, బహిరంగ ఓటింగ్ విధానాల అవసరం ఉండదు. ఇప్పటికైనా రాజకీయపక్షాలు విలువలతో కూడిన రాజకీయాలను నెలకొల్పడానికి ప్రయత్నించాలె.

జనగళం

ఆదర్శ తెలంగాణ

రాష్ట్ర ప్రభుత్వం ఏటా హరితహారాన్ని చేపడుతున్నది. దీంట్లో భాగంగా అసంఖ్యాకంగా మొక్కలు నాటించడం, వాటి సంరక్షణ కోసం చర్యలు తీసుకోవడం హర్షణీయం. ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రజలు కూడా తమ సహకారం అందించాలి. ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క నాటి, వాటి సంరక్షణకు పూనుకోవాలి. తద్వారా హరిత తెలంగాణ ఆవిష్కృతమవుతుంది. దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్రం ఆదర్శప్రాయమవుతుంది. దీంతో పాటు రాష్ట్రంలోని ప్రజలు కాలుష్యానికి దూరంగా ఆరోగ్యంగా జీవిస్తారు.

- సరికొండ శ్రీనివాసరాజు, హైదరాబాద్

'భూ సర్వే' బృహత్తర కార్యక్రమం

సీఎం కేసీఆర్ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారు. రైతు శ్రేయస్సుపై ప్రత్యేక దృష్టిపెడుతున్నారు. రుణ మాఫీ నుంచి మొదలు గోదాముల నిర్మాణం, మార్కెట్ల ఆధునీకరణ, ఈ–నామ్ అమలు, నిరంతర విద్యుత్ లాంటి ప్రయోజనకరమైన పథకాలను చేపడుతూ రైతుకు అండగా నిలుస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య భూమి యాజమాన్యం హక్కులు. ఈ సమస్య కారణంగా పల్లెల్లో వివాదాలు, ఆస్తి తగాదాలు, సరిహద్దు పంచాయితీలు, కోర్టు వివాదాలతో రైతులు విసిగిపోతున్నారు. ఆర్థికంగా బలహీనులవుతున్నారు. మానసికంగా కుంగిపోతున్నారు. వీటన్నింటిని గమనించి ప్రభుత్వం సమగ్ర 'భూ సర్వే' చేపడుతున్నది. ఇది రైతులకు వరం. రైతులను సమస్యల సుడిగుండం నుంచి తప్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం. దీంతో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల్లో సగం కేసులు పరిష్కారమవుతాయి. 'ఈ–పాసు పుస్తకాల' ముద్రణ లాంటి చర్యలతో రైతు సమస్యలన్నింటికీ దూరమవుతాడు.

- ఎస్.వినోద్‌కుమార్, రీసెర్చ్ స్కాలర్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

ఆత్మరక్షణలో ప్రతిపక్షాలు

ప్రతిపక్షాలు ఇంతటి ఆత్మరక్షణ స్థితిలో ఎందుకున్నాయి? సీఎం కేసీఆర్ కొంతకాలం పాటు మౌనంగా అన్నీ గమనిస్తూ ఉన్నట్లుండి ఘాటుగా విమర్శించినప్పుడల్లా తత్తరపాటుకు గురికావటం ఎందువల్ల? వారు 2014తో పాటు తర్వాత కాలపు పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకుని, ప్రజల మూడ్‌ను గ్రహించి, తగు విజ్ఞతతో వ్యవహరిస్తే ఇటువంటి ఆత్మరక్షణ స్థితి ఎదురయ్యేది కాదు. ఈ విషయాన్ని తమ మేలుకోసమే ఎవరెంత ఎత్తిచూపుతున్నా వారు అర్థం చేసుకోలేకపోవటం ఆశ్చర్యకరం.

విషయాన్ని జనరల్ రూపంలో చర్చించే ముందు ఒక నిర్దిష్టమైన ఉదాహరణను చెప్పుకుందాం. అందువల్ల, వారు ఓటమి నుంచి నేర్చుకోవలసింది ఎట్లా నేర్చుకోలేదో, తర్వాత ఎట్లా విజ్ఞతతో వ్యవహరించలేదో మనకు అర్థమవుతుంది. అటువంటి వ్యవహరణల ప్రభావాలు వారిని ఏ విధంగా ఆత్మరక్షణ స్థితిలోకి నెట్టుతూ వస్తున్నాయో తెలుస్తుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఒక కీలకమైన పని మహారాష్ట్రతో నీటి ఒప్పందాలు చేసుకోవటం. అది తమ ఘనత అని ప్రభుత్వం పెద్ద ఎత్తున చాటి చెప్పుకుంది. అందుకు తగిన కారణాలున్నాయి. అవే ఒప్పందాల కోసం ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ముప్పయ్యేళ్ల కిందట చొరవ అయితే తీసుకున్నాయి గాని తర్వాత కొన్ని దశాబ్దాల పాటు ఒప్పందమేమీ జరుగలేదు. కేసీఆర్ నాయకత్వాన టీఆర్‌ఎస్ ప్రభుత్వం అందుకోసం ముమ్మరమైన ప్రయత్నాలు చేసి త్వరితగతిన ఒప్పందం చేసుకుంది. కాని ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పలువురు ఇతర ముఖ్యులు, ఆ 'ఒప్పందాలు' తమ కాలంలోనే జరిగాయని, ఆ ఖ్యాతిని టీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకుంటున్నదని అన్నారు. ఆ మాట ఒకటి రెండు సార్లు గాక వారాల తరబడి వాదిస్తూ పోయారు. చివరికి ముఖ్యమంత్రి ముంబై నుంచి వచ్చి బేగంపేట విమానాశ్రయంలో వాహనంపైన నిలుచొని, 'ఒప్పందాలు' నిజంగా జరిగి ఉంటే ఆ కాగితాలు తెచ్చి చూపాలని, అప్పుడు తాను అటునుంచి అటే వెళ్లి గవర్నర్‌కు తన రాజీనామా ఇవ్వగలనని సవాలు చేశారు. ముంబైలో తను 'ఒప్పందం' కుదుర్చుకొని తెచ్చిన పత్రాలను గాలిలోకి చెయ్యెత్తి లేపి చూపుతూ అది తమ సవాలన్నారు. ఆ దృశ్యాలను రాష్ట్ర ప్రజలు ఛానళ్ల ప్రత్యక్షపు ప్రసారాలలో చూశారు. కేసీఆర్ సవాలుకు కాంగ్రెస్ నాయకత్వం సమాధానమివ్వలేకపోయింది.

అందరికీ తెలిసిన విషయాన్ని ఇక్కడ మళ్లీ ఇంతగా చెప్పుకోవటం ఎందుకంటే, పైన అనుకున్నట్లు 2014 ఓటమితో కాంగ్రెస్ కుంగుబాటు, ఆ ఓటమి నుంచి ఏమీ నేర్చుకోకపోవటం, విజ్ఞతతో వ్యవహరించకపోవటం, ఆత్మరక్షణలో పడటం వంటివన్నీ కూడా ఆ ఒక్క ఉదంతంలో కొట్టొచ్చినట్లు కన్పించాయి. అదే ఉదంతం సందర్భంగా తర్వాత కొద్దిరోజులకు కాంగ్రెస్ శాసనసభాపక్షనేత కె.జానారెడ్డి, తమ హయాంలో చర్చలు జరిగాయి తప్ప ఒప్పందాలు కాదని ప్రకటించటంతో ఉత్తమ్‌కుమార్‌కు తల కొట్టివేసినంత పనయ్యింది. విషయమేమంటే, గతంలో జరిగింది చర్చలే తప్ప 'ఒప్పందాలు' కాదని అప్పటికి ఆయనకు తెలియదా? తెలిసి కూడా అవి 'ఒప్పందాలే'నని వారాల తరబడి వాదిస్తూ స్టేక్స్ పెంచటం వల్ల చివరికి విషయం ఎదురు తిరుగుతుందని గ్రహించలేని మనిషా ఆయన? ఇరుపక్షాల మధ్య వాదోపవాదాలను ప్రజలు ఉత్కంఠగా గమనిస్తూ వస్తున్నారని, చివరికి తన వాదన అసత్యమని తేలితే తన విశ్వసనీయత దారుణంగా దెబ్బతింటుందని ఆయన అర్థం చేసుకోలేకపోవటం ఇన్నాళ్లు గడిచిన తర్వాత కూడా ఆశ్చర్యకరంగా తోస్తుంది. ఇటువంటి ప్రతిపక్షాలను ఆత్మరక్షణలోకి తోయటం అధికార పక్షాలకు తేలికైన ఎత్తుగడ అవుతుంది.

రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం 2014 ఎన్నికల ఓటమి నుంచే కాదు, ఇటువంటి ఉదంతాల నుంచి సైతం ఏమీ నేర్చుకోలేదు. ఇటువంటి ఉదాహరణలు తర్వాత కాలంలో మరెన్నో ఉన్నాయి. ఈ రోజువరకు కూడా తాము నేర్చుకున్నది లేదు, విజ్ఞతతో వ్యవహరించింది లేదు. ఇటువంటి వైఖరులే వారిని ఆత్మరక్షణ స్థితిలోకి నెట్టుతూ వస్తున్నాయి. గత మూడేళ్ల పరిస్థితిని, వారు ఇప్పటికీ వ్యవహరిస్తున్న తీరును గమనించగా, రాగల ఎన్నికలలోగా వీరికి విజ్ఞత కలుగటం అనుమానాస్పదంగా తోస్తున్నది. ఇదే పద్ధతిలో సాధారణ ప్రజలకు ప్రతిపక్షాల గురించి విస్మయకరంగా మారిన విషయాలు ఈ మూడేళ్లలో అనేకం ఉండగా మరికొద్ది ఉదాహరణలను చూద్దాం. నీటి పారుదల పథకాలపై కేసీఆర్ శాసనసభలో ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చాలా ముఖ్యమైనది, ప్రయోగాత్మకమైనదని అందరూ గ్రహించి దానిని ఆసక్తిగా చూడగా, కాంగ్రెస్ వారు సభను బహిష్కరించటం ఎందుకో ఎవరికీ అర్థం కాలేదు. అందుకు నేటికీ కూడా ఆ పార్టీ వివరణ ఇవ్వలేకపోతున్నది. ప్రభుత్వం విద్యుత్ సమస్యను పరిష్కరించటం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ సహా పలు కార్యక్రమాలు చేపట్టగా ప్రతిఒక్క దానిని విమర్శించటమే పనిగా పెట్టుకోవటం ప్రజల దృష్టిలో తమ విశ్వసనీయతను ఎంతగా దెబ్బతీస్తున్నదో గ్రహించక, విజ్ఞతతో వ్యవహరించక కాంగ్రెస్ నాయకత్వం ఆ ప్రభావంతో అనివార్యమైన రీతిలో ఆత్మరక్షణలో పడుతున్నది. ఇవి చాలవన్నట్లు, వివిధ పథకాలపై డజన్ల కొద్దిగా దాఖలవుతున్న కేసులన్నీ సామాన్య ప్రజల దృష్టిలో కాంగ్రెస్ ఖాతాలోకే పోతున్నాయి. ఆ విధంగా విశ్వాస రాహిత్యం, ఆత్మరక్షణ మరింత పెరుగుతున్నాయి. ఈ స్థితి టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఆయాచిత వరమవుతున్నాయి.

> రాష్ట్రంలో, దేశంలో రాగల కాలంలో, ప్రతిపక్ష రాజకీయ శూన్యత విస్తరించవచ్చుననే సందేహం దీనిని బట్టి కలుగుతున్నది. వర్తమానంలో ప్రజలకు 'అభివృద్ధి' 'స్వీయ పురోగతి' మినహా తక్కినవి లెక్కించదగినవిగా తోచటం లేదు గనుక, పైన చర్చించిన విషయాలను ఆ దృష్టి నుంచి ఏ విధంగా తీసుకుంటున్నారో మనకు ప్రత్యక్ష సమాచారం లేదు గాని, తార్కికంగా ఆలోచించినపుడు మాత్రం ఆ ప్రజల దృష్టి ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉండే అవకాశం కనిపించటం లేదు.

ఇందులో అర్థం కానిది మరొకటి ఉంది. తమ రాష్ట్ర కమిటీలకు సరైన దిశానిర్దేశనం చేయవలసిన ఢిల్లీ కాంగ్రెస్ నాయకత్వం, ఇక్కడి గాంధీభవన్ పెద్దలను కాస్తా విజ్ఞతతో వ్యవహరించేట్లు ఎందువల్ల చేయలేకపోతున్నది? విజ్ఞత చూపటమే సరైన పద్ధతిని గట్టిగా నమ్మే రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు చెప్తున్న దానిని బట్టి, అట్లా చేయగల వారెవరూ ఈ రోజున ఢిల్లీలో కన్పించటం లేదు. ఇక్కడి వారి గ్రూపు బలాలు, ధన బలాలు, నోటి బలాలు మాత్రమే ఢిల్లీ నాయకత్వం వద్ద పని చేస్తున్నాయి. సోనియాగాంధీ క్రమంగా వానప్రస్థంలోకి వెళుతున్నారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడకపోవటం మంచిది. పర్యవేక్షకులనే వారు స్వప్రయోజనాల కోసం పరిస్థితిని ఇంకా చెడగొడుతున్నారు. ఇటువంటి పరిస్థితులలో 2014 ఓటమి నుంచి పాఠాలు నేర్వటం, విజ్ఞతతో వ్యవహరించటం అన్నవి ఇక్కడి వారు చేసేది ఎలా? ఢిల్లీ వారు నేర్పించేది ఎలా? కాంగ్రెస్‌కు సంబంధించి అంతా శూన్యంగా కన్పిస్తున్నది. ఇందువల్ల ఇంతకాలం ఏర్పడిన ఆత్మరక్షణ స్థితి మునుముందు కూడా కొనసాగటం ఖాయంగా తోస్తున్నది. గమనించదగిన ఒక అతి ముఖ్యమైన విషయం ఏమంటే, ఇటువంటిస్థితికి లోనైన కాంగ్రెస్ పార్టీ, ఒకవేళ ప్రభుత్వం నిజంగానే ఏవైనా తప్పులు చేసినా వాటిని ఉపయోగించుకుంటూ తన విశ్వసనీయతను ప్రజల దృష్టిలో పెంచుకోలేని దుర్దశలో ఉంది. ఎప్పుడైనా సరే ప్రతిపక్షం అటువంటి స్థితికి బలహీనపడితే, ఇక రైటయినా, తప్పయినా కూడా ప్రభుత్వ నాయకత్వపు దాడికి నిస్సహాయంగా గురవుతుంది. ఇది పూర్తిగా వారి స్వయంకృతం. కొద్ది తేడాలతో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతిపక్షాలు అన్నీ ఇదే పద్ధతిలో 2014 నుంచి పాఠాలు నేర్వని, విజ్ఞతతో వ్యవహరించని, ఆత్మరక్షణ స్థితిలో ఉండిపోతున్నాయి. ప్రజల విశ్వాసాన్ని సంపాదించేందుకు ఏమి చేయాలో తెలియక 'ఏదో ఒకటి' చేస్తున్నాయి.

జాతీయస్థాయిలో ప్రతిపక్షాల పరిస్థితి కూడా ఇంతే అయోమయంగా ఉంది. ఇక్కడి వలెనే అక్కడ కూడా, ప్రతిరోజూ 'ఏదో ఒక ధ్వనిని సృష్టించటం', అది ప్రజలను మెప్పిస్తున్నదని భ్రమపడటం మినహా, వారికి విశ్వాసాన్ని కల్పిస్తున్నదేమీ కనిపించటం లేదు. మానసికంగా ఆలోచించినట్లయితే, ఇటువంటివి తీవ్రమైన ఒత్తిడులకులోనై, ఆత్మరక్షణకు గురై, ఏమి చేయాలో తోచనివారి పలవరింతలు, చేష్టలు. ఇవి వారిని మరింత బలహీనపరిచి, అధికారపక్షాలను ఇంకా శక్తిమంతం చేస్తాయి. ఈ ధోరణులు కనిపిస్తున్నాయి కూడా. రాష్ట్రంలో, దేశంలో రాగల కాలంలో, ప్రతిపక్ష రాజకీయ శూన్యత విస్తరించవచ్చుననే సందేహం దీనిని బట్టి కలుగుతున్నది. వర్తమానంలో ప్రజలకు 'అభివృద్ధి' 'స్వీయ పురోగతి' మినహా తక్కినవి లెక్కించదగినవిగా తోచటం లేదు గనుక, పైన చర్చించిన విషయాలను ఆ దృష్టి నుంచి ఏ విధంగా తీసుకుంటున్నారో మనకు ప్రత్యక్ష సమాచారం లేదు గాని, తార్కికంగా ఆలోచించినపుడు మాత్రం ఆ ప్రజల దృష్టి ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉండే అవకాశం కనిపించటం లేదు.

ఎంబీసీల అభివృద్ధికి అధ్యయనం

విశ్లేషణ



డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

రాష్ట్రంలో దశాబ్దాలుగా ఎలాంటి గుర్తింపునకు నోచుకోక అభివృద్ధికి దూరంగా నెట్టివేయబడ్డ వెనుకబడిన కులాలు ఎన్నో ఉన్నాయి. ఈ కులాలు ఇప్పటికీ ఆందోళనకరమైన జీవితాలను గడుపుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో మరీ ముఖ్యంగా తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన సంచార, అత్యంత వెనుకబడిన కులాలను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇవాళ ఈ వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే బాధ్యత తెలంగాణ సమాజంపై పడింది. పద్నాలుగేండ్లు అలుపెరుగకుండా పోరాటం చేసి సాధించిన ఉద్యమ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు నేడు ముఖ్యమంత్రిగా తెలంగాణ సమాజ పునర్నిర్మాణం కోసం నిరంతరం కృషిచేస్తున్నారు. రాష్ట్రంలో 52 శాతం జనాభా కలిగిన బీసీల జీవితాల్లో మార్పు తీసుకురాకుండా, ఆ వర్గాలు అభివృద్ధి చెందకుండా సమసమాజ నిర్మాణం సాధ్యం కాదు. అందుకే శాస్త్రీయంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావించింది. సామాజిక న్యాయస్ఫూర్తితో ముందుకువచ్చింది.

ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి తెలంగాణ తొలి బీసీ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. ఈ కమిషన్ నేడు యావత్ బీసీ వర్గాల వాస్తవ జీవన స్థితిగతులను అధ్యయనం చేయాల్సి ఉన్నది. ఇన్నాళ్లుగా సాగిన నిర్లక్ష్యం, ఉదాసీన వైఖరికి భిన్నంగా వారి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి అవకాశాల్లో మెరుగుదలతో కూడిన జీవన ప్రమాణాలను కల్పించడానికి తన సిఫార్సులను, నివేదికలను సమర్పించే ఒక బృహత్తరమైన చారిత్రక బాధ్యతను నిర్వర్తించా ల్సి ఉన్నది.

మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా నేడు అన్నివర్గాలకు సమాన అవకాశాలను రాజ్యాంగబద్ధంగా కల్పించాల్సి ఉన్నది. అందుకే ప్రస్తుతం తెలంగాణ సమాజాన్ని నూతన జవసత్వాలతో పునర్నిర్మాణం చేసే బృహత్తర కార్యాచరణను ప్రభుత్వం అమలు చేస్తున్నది. మన రాష్ట్రంలో అత్యధికులు బహుజనులు. ఈ వర్గాల అభివృద్ధిని సంపూర్ణంగా సాధించకుండా రాష్ట్రం అన్నిరంగాల్లో ఆశించిన ప్రగతిని ఊహించలేం. అభివృద్ధిలో వీరికి భాగస్వామ్యం కల్పించకుండా బంగారు తెలంగాణ సాధ్యం కాదని ముఖ్యమంత్రి ఎప్పుడూ అంటుంటా రు. రాష్ట్రంలోని 85 శాతం జనాభాకు సముచిత న్యాయం చేయడం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని భావిస్తున్నారు. అందువల్లనే 45 వేల కోట్ల నిధులు కేటాయించి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నారు. దేశంలోనే 'నంబర్ వన్ సంక్షేమ రాష్ట్రం'గా తెలంగాణను నిలబెట్టారు.

ఈ కృషిలో భాగంగా 'తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి నమూనా' ముందుకు వచ్చింది. గ్రామీణ ఉత్పత్తులను, ఉపాధి అవకాశాలను పెంచడానికి సూక్ష్మ పరిశీలనతో ప్రణాళికలు రచించడం జరుగుతున్నది. చరిత్రలో జాతీయోద్యమ కాలం నుంచి దశాబ్దాలుగా జరిగిన నష్టాన్ని గమనించి గ్రామీణ నైపుణ్యాలను, ఉపాధి అవకాశాలను పెంచి సంపద సృష్టిని వేగవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నది.

ఎంతో నైపుణ్యం కలిగినప్పటికీ ఆయా కులవృత్తులు గిట్టుబాటు కావడం లేదు. దీనిని గమనించిన తెలంగాణ ప్రభుత్వం కులవృత్తులకు పెద్ద ఎత్తున సబ్సిడీలను, రాయితీలను అందిస్తున్నది. రజక, నాయీబ్రాహ్మణ, విశ్వకర్మ మొదలగు వృత్తులకు అధునాతన యంత్ర పరికరాలను సమకూర్చడానికి నడుం బిగించింది. కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ అభివృద్ధి, గొర్రెలు, మేకలు, చేపల పంపిణీ ద్వారా గ్రామం, కుటుంబం స్వయంపోషకంగా ఎదగడానికి కృషిచేస్తున్నది. సమాజ పునర్నిర్మాణంలో సామాజిక న్యాయం అందించడంలో విప్లవాత్మకమైన చర్యలతో వడివడిగా అడుగులు వేస్తున్నది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కుటీర పరిశ్రమలను, ఉపాధి కల్పన ను, సంపద సృష్టిని వికేంద్రీకరించాలని గాంధీజీ, రామ్‌మనోహర్‌లోహియా వంటి జాతీయోద్యమ నాయకులు బలంగా ప్రచారం చేశారు. చేనేత రాట్నం చేబూని గాంధీజీ చేనేత వస్త్రాలకు బహుళ ప్రచారం తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా చేస్తున్న ప్రయత్నం తెలియంది కాదు.

తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. యావత్ తెలంగాణ సమాజంలో అసమానతలను, వివక్షలను రూపుమాపి బంగారు తెలంగాణను నిర్మించాలని పరితపిస్తున్నారు. అన్నివర్గాలకు వారి జనాభా దామాషా ప్రకారం సామాజిక న్యాయం జరుగాలని కోరుకుంటున్నారు. కలలు కనాలి ఆ కలలను సాకారం చేసుకోవాలన్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటలను నిజం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తన కలలను సాకారం చేసుకోవడానికి అంకితభావంతో ప్రయత్నిస్తున్నది.

ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'జి.ఓ. ఎం.ఎస్.నెం.9' ను విడుదల చేస్తూ నిర్దిష్టమైన 'టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్'ను సూచిస్తూ బీసీ కమిషన్‌కు ఒక బృహత్తరమైన కార్యాచరణను అప్పగించింది. ఈ దిశగా గడిచిన మూడు నెలలుగా బీసీ కమిషన్ ఒక పవిత్ర యజ్ఞంలా తన కార్యాచరణను మొదలుపెట్టింది. మొదటిదశలో 80 వివిధ ప్రభుత్వ శాఖలను సమీక్షించింది. సామాజికవేత్తలు, ఆంత్రోపాలజిస్టులు, వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, న్యాయనిపుణులు, నిష్ణాతులు, మేధావులు, ఉద్యమకారులతో దశల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నది. తన అధ్యయనాన్ని వివిధ క్యాటగిరీలుగా విభజించుకొని కొనసాగిస్తున్నది. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగస్తుల వివరాలను బీసీలలోని కులాల వారీగా సేకరిస్తున్నది. విద్యార్థుల వివరాలను, సమాచారాన్ని తెలుసుకుంటున్నది. గిట్టుబాటులేని వృత్తులను నవీకరించడానికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను సూచించడానికి ప్రయత్నాలను మొదలుపెట్టింది. సమాజంలోని అన్ని సామాజిక వర్గాలకు, బీసీలకు మధ్య ఉన్న అంతరాలను తులనాత్మకంగా పరిశీలిస్తున్నది. ఇప్పటివరకు ఎలాంటి రిజర్వేషన్లకు నోచుకోని సంచార కులాల అంశంలో కూడా కమిషన్ తన దృష్టిని సారించింది. ఇన్నాళ్లయినా దామాషా ప్రకారం అభివృద్ధికి నోచుకోని కులాలను అత్యంత వెనుకబడిన వర్గాలను (ఎంబీసీ) ప్రత్యేకంగా గుర్తించి వారిని ఏ విధంగా ప్రగతిపథంలోకి తీసుకురావాలనే అంశంలో కమిషన్ సమగ్ర అధ్యయనంతో ముందుకు సాగుతున్నది.

> **సమాజంలోని అన్ని సామాజిక వర్గాలకు, బీసీలకు మధ్య ఉన్న అంతరాలను తులనాత్మకంగా పరిశీలిస్తున్నది. ఇప్పటివరకు ఎలాంటి రిజర్వేషన్లకు నోచుకోని సంచార కులాల అంశంలో కూడా కమిషన్ తన దృష్టిని సారించింది. ఇన్నాళ్లయినా దామాషా ప్రకారం అభివృద్ధికి నోచుకోని కులాలను అత్యంత వెనుకబడిన వర్గాలను (ఎంబీసీ) ప్రత్యేకంగా గుర్తించి వారిని ఏ విధంగా ప్రగతిపథంలోకి తీసుకురావాలనే అంశంలో కమిషన్ సమగ్ర అధ్యయనంతో ముందుకు సాగుతున్నది.**

(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



చదువుల 'సుందరి'

చదువుకునే వాళ్లకు మోడలింగ్ కష్టం. మోడలింగ్ చేసేవాళ్లకు చదువు కష్టం. ఈ రెండింటినీ ఎంచుకుని ఏ రంగంలోనూ రాణించలేని వాళ్లు చాలామందే ఉన్నారు. కానీ ఈమె మాత్రం అలా కాదు..

అహ్మదాబాద్ ఐఐఎంలో చదువుతున్న ఆకాంక్ష చౌదరి.. అటు చదువులోనూ, ఇటు మోడలింగ్‌లోనూ రాణిస్తున్నది. 2016లో నిర్వహించిన మిస్ ఇండియా ఎలైట్‌లో పోటీల్లో విజేతగా నిలిచి కిరీటం సొంతం చేసుకున్నది. అదే ఏడాది నిర్వహించిన క్యాట్ ఎగ్జామ్‌లో 98.12 శాతం మార్కులు తెచ్చుకుని అహ్మదాబాద్ ఐఐఎంలో సీటు సంపాదించింది. ఆ తర్వాత మోడల్‌గా షోకేస్, బ్లెండర్స్ ప్రైడ్ ఈవెంట్లలో పాల్గొన్నది. ఇలా ఎన్నో ర్యాంపులపై క్యాట్‌వాక్ చేసింది ఆకాంక్ష. ఈ రెండు రంగాల్లో రాణించడానికి కారణం.. దేని సమయం దానికి కేటాయించడమేనని అంటుంది. సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగే 'మిస్ ఫేస్ ఆఫ్ బ్యూటీ ఇంటర్నేషనల్' పోటీల్లో పాల్గొననున్నది. సల్మాన్‌ఖాన్, మలైకా అరోరతో కలసి పనిచేసింది. ఈ ఏడాది నిర్వహించిన ఎస్ఆర్‌సీసీ అకడమిక్ సెషన్(2014-17)లో ఐదవ ర్యాంకు సాధించింది.

సామాజిక బాధ్యత...

ఒక మంచి పనికి కొత్త ఆలోచన తోడైంది. ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ పేద, బడుగు, బలహీన వర్గాల చిన్నారులకు జీవితాల్లో వెలుగులు నింపారు వాళ్లు. రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా, అధికారులు అడ్డంకులు సృష్టించినా వెనకడుగు వేయలేదు. ఇంతకీ వారు ఏం చేశారంటే..?

ఢిల్లీకి చెందిన స్వాతి జాను, నిధి సోహానే అనే ఈ ఇద్దరు ఆర్కిటెక్ట్‌లు ఢిల్లీలోని యుమున ఖదర్ ప్రాంతంలో చిన్నారుల జీవితాల్లో చదువుతో చిరుదివ్వెలు వెలగించారు. చదువుకోవాలని ఉన్నా స్థానికంగా పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో స్వాతి, నిధి.. స్థానికుడైన నరేష్‌తో కలిసి వెదురు కర్రలతో ఓ పాఠశాలను ఏర్పాటు చేశారు. దీనికి మూడ్‌స్కూల్ అనే పేరుపెట్టి.. స్థానికంగా ఉన్న చిన్నారులకు విద్యను అందిస్తున్నారు. దీనికి అధికారులు అనుమతి ఇవ్వకపోగా.. కూల్చివేశారు. అయితే దీంతో స్వాతి, నిధి, నరేష్‌లు హైకోర్టుకు వెళ్లడంతో.. బాధితులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. వెంటనే సోషల్ మీడియాలో ఫండ్ రైజింగ్ క్యాంపెయిన్ ద్వారా నిధులు సమకూర్చారు. మళ్లీ ఆ పాఠశాలను పునర్‌నిర్మించి చదువు కొనసాగిస్తున్నారు.



జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



మనీ మ్యాటర్స్ for women

**ఎంత పనైనా ఆయనా, పిల్లలు వెళ్లేవరకే హడావుడి.. ఆ తర్వాత టైమంతా ఖాళీయే..
బోర్ కొడుతుంది.. ఆదాయం తెచ్చిపెట్టేలా ఏదైనా చిన్న వ్యాపకం ఉంటే బాగుండు!
ఆర్థికంగా కుటుంబానికీ ఆసరా లభిస్తుంది.. సాధారణంగా గృహిణుల మదిలో మెదిలే ఆలోచనలివి..
ఆలోచిస్తూ కూర్చుంటే ఆదాయానికి మార్గం దొరుకదు..ఆలోచనలను ఆచరణలో పెడితేనే ఫలితం ఉంటుంది..
అదెలాగో చెప్పడానికే ఈ వారం మరికొన్ని మనీ మ్యాటర్స్.**

ఐశ్వర్యం ఇచ్చే ఐస్‌క్రీమ్ కప్పులు

ఐస్‌క్రీమ్‌లు అందరికీ ఇష్టమే. ఎన్నిచ్చినా కాదనకుండా, మొహమాటపడకుండా తీసుకుని తింటారు. వాటి టేస్ట్ అలాంటిది మరి. కాకపోతే హైదరాబాద్‌కు చెందిన హేమలతకు మాత్రం ఐస్‌క్రీమ్ కప్పుల గురించి ఆలోచించింది. వాటినెలా తయారు చేస్తారో తెలుసుకుని.. తానే ఒక వ్యాపారాన్ని ప్రారంభించి నలుగురికీ మార్గదర్శిగా నిలుస్తున్నారు.

ఎంత ఇష్టమైన ఐస్‌క్రీమ్ అయినా, డైరెక్టుగా అరచేతిలో వేసుకుని తినలేరు కదా. ఒక కప్పులో తీసుకుని, ఉడెన్ స్పూన్‌తో తినాల్సిందే. అందుకే ఐస్‌క్రీమ్ కన్నా ముందు, దాన్ని ఉంచే కప్పుల మీదే హేమలత దృష్టి పెట్టింది. ఆర్థికంగా ఇబ్బందుల్లో తన ఫ్యామిలీకి సాయంగా ఉండాలంటే తానూ ఏదో ఒక వ్యాపారం చేయాలనుకున్నది. అందుకే పేపర్ అండ్ ప్లాస్టిక్ కప్స్‌ను తయారు చేసే సంస్థను ప్రారంభించింది. హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఒక చిన్న గదిని అద్దెకు తీసుకుని యూజ్ అండ్ త్రో కప్పులను తయారు చేయడం మొదలు పెట్టింది.

ఆరంభం చిన్నగానే: ఈ వ్యాపారంలో మెషీన్లకు, ముడిసరుకుకు మాత్రమే డబ్బు ఖర్చవుతుంది. అందుకే స్తోమతకు తగ్గట్టు ప్రారంభించుకోవడం ప్రధానం. ప్రారంభంలో తక్కువ పెట్టుబడి పెట్టుకోవాలి. తక్కువ ప్రొడక్ట్‌ను నాణ్యతతో తయారుచేసి మార్కెట్‌లోకి విడుదల చేయాలి. డిమాండ్ పెరిగిన తర్వాత ఆర్డర్లను బట్టి తయారు చేసుకోవచ్చు. హేమలత ఇదే విధానాన్ని అనుసరించి విజయం సాధించింది. కొద్దిపాటి పెట్టుబడితో సరుకును తయారుచేసి మార్కెట్‌లోకి తన ప్రొడక్ట్స్‌ను విడుదల చేసింది. నాణ్యత బాగుండడంతో ఆమె దగ్గర తయారయ్యే ఐస్‌క్రీమ్ కప్పులకు, పేపర్ కప్పులకు మంచి డిమాండ్ వచ్చింది. ఆర్డర్లూ పెరిగాయి. ఆ తర్వాత ఆమె వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు.

మంచి ఉపాధి మార్గం : గృహిణులకు ఇది సులువైన వ్యాపారం. తక్కువ సంఖ్యలో తయారు చేయాలనుకుంటే, ఇంట్లోనే ఒక పక్కన మెషీన్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రత్యేకంగా గదిని కిరాయికి తీసుకోవాల్సిన అవసరం ఉండదు. కానీ ఎక్కువ సంఖ్యలో తయారు చేయాలనుకుంటే మాత్రం ఎక్కువ స్థలాన్నీ కేటాయించాల్సి ఉంటుంది. అప్పుడు ఒంటరిగా పనిచేయడం కూడా సాధ్యం కాదు. కాబట్టి సహాయకుల అవసరం ఉంటుంది. అలా హెల్పర్లను నియమించుకోవడం ద్వారా మరో నలుగురికి ఉపాధి చూపించవచ్చు. కుటుంబసభ్యులు కూడా తలా ఒక చెయ్యి వేస్తే మాత్రం.. పనివాళ్లకు చెల్లించాల్సిన వేతనం కూడా మిగిలిపోతుంది. ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

నిత్యావసరంగా మారింది : ఇటీవల యూజ్ అండ్ త్రో కల్చర్ బాగా ఎక్కువైంది. టీ స్టాల్ నుంచి ఐస్‌క్రీమ్ పార్లర్ వరకు అన్నింటా ఈ పేపర్ కప్స్, పేపర్ గ్లాసుల వినియోగం పెరిగింది. కాబట్టి గిరాకీ ఉండదనే బెంగ అవసరం లేదు. మార్కెట్‌ను పెంచుకోవడమన్నది నాణ్యత, పబ్లిసిటీపైనే ఆధారపడి ఉంటుంది.

శుభకార్యాలకు ఫుల్ గిరాకీ : ఏ శుభకార్యానికి వెళ్లినా ఆఖరున స్పెషల్‌గా స్వీట్సో, ఐస్‌క్రీమ్సో పెట్టడం ఆనవాయితీ. ఇప్పుడు షరా మామూలైపోయిన బఫింగ్ సిస్టమ్‌లో.. వీటి కోసం ఈ యూజ్ అండ్ త్రో కప్స్‌నే ఉపయోగిస్తున్నారు. ఏ ఫంక్షన్‌కు వెళ్లినా, పెళ్లికి వెళ్లినా ఇదే విషయాన్ని గమనించేది హేమలత. వేల సంఖ్యలో పేపర్ కప్పులను, ప్లాస్టిక్ కప్పులను వాడడం చూసి, వాటిని తయారు చేసే కంపెనీనే ప్రారంభించింది. రెగ్యులర్‌గా ఉండే రిటైల్‌షాపుల గిరాకీ ఎలాగో ఉంటుంది. శుభకార్యాల సీజన్‌లో ఈ గిరాకీ డబుల్ అవుతుంది.

వెరైటీ డిజైన్లతో : ఈ పేపర్ కప్స్‌లో చాలా రకాలు ఉంటాయి. ఆర్డినరీ, మీడియం, హై క్వాలిటీ.. ఇలా మూడు క్వాలిటీల్లో లభిస్తాయి. అందుకే వీటి తయారీలోనూ తేడా ఉంటుంది. దానికి తగ్గట్టే ఖర్చూ ఉంటుంది. కాకపోతే స్పెషల్ కనిపించేలా, మార్కెట్‌లో పోటీని తట్టుకునేలా వెరైటీ డిజైన్లలో తయారు చేయగలిగితే మరిన్ని ఆర్డర్లు పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నది హేమలత. ముడిసరుకు విషయంలో జాగ్రత్తగా ఉంటే సరిపోతుందంటున్నది.

కష్టపడితేనే ఫలితం : ఇంటిపట్టున ఉండే మహిళలు ఈజీగా చేసుకోగలిగిన వర్క్ ఇది. కాకపోతే ప్రొడక్ట్‌కు కాస్త పబ్లిసిటీ వచ్చే వరకు ఇబ్బందులెదురైనా తట్టుకోవాలి. వాహనాన్ని ఏర్పాటు చేసుకుని మార్కెట్‌కు తరలించవచ్చు. లేదంటే కస్టమర్లే వచ్చి తీసుకు వెళ్లేలా ఔట్‌లెట్‌నూ ఏర్పాటు చేసుకోవచ్చు. ఆ విషయంలో కొంచెం కష్టపడితే తప్పక విజయం సాధించవచ్చు.

గర్వంగా ఉంది..

ఏదైనా ఫంక్షన్‌కు వెళ్లినా, పెళ్లికి వెళ్లినా అక్కడ ఉపయోగించే వెరైటీ ఐస్‌క్రీమ్ కప్స్‌ను పరిశీలించేదాన్ని. వాటిని నేనే ఎందుకు తయారు చేయకూడదనుకున్నా. మావారితో చెబితే సరే అన్నారు. పదేళ్ల క్రితం ఈ వ్యాపారం ప్రారంభించా. మొదట్లో కాస్త కంగారుగా అనిపించినా.. కష్టపడి విజయం సాధించాను. నేను ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా, మరికొందరికి ఉపాధి కల్పిస్తుండడం గర్వంగా ఉంది.

హేమలత

మీరూ ప్రారంభించొచ్చు..

స్థిర వ్యయాలు..

- ఇంట్లో తయారు చేసుకోవచ్చు. కానీ ఎక్కువ సంఖ్యలో తయారు చేయాలంటే కార్ఖానా ఏర్పాటుకు ఒక పెద్ద గది అవసరం.
- రూమ్‌కు అడ్వాన్స్ : రూ. 50,000 (ఏరియాను బట్టి మారొచ్చు)
- యంత్రాలు : రూ. 1,00, 000
- ప్రాథమిక + ప్రారంభ వ్యయాలు : రూ. 1,00,000
- మొత్తం : రూ. 2,50,000

నెలవారీ ఖర్చు

- యాభై కప్స్‌ను కలిపి ఒక ప్యాక్‌గా అనుకుందాం. ఒక్కరోజులో అలాంటి ప్యాక్‌లను 250 తయారు చేయగలరనుకుందాం. కప్స్‌లో చాలా వెరైటీలు, క్వాలిటీలు ఉంటాయి కాబట్టి..
- సరాసరి ఒక ప్యాక్ కప్స్ తయారీకి అయ్యే ఖర్చు రూ. 25 అనుకుందాం.
- నెలకు 25 రోజులు పనిచేస్తే 6250 ప్యాక్‌ల కప్స్‌ను తయారుచేయవచ్చు.
- అంటే నెలకు 6250x 25= రూ. 1,56,250
- కరెంట్, ఫోన్, ఇతర బిల్లులు: రూ. 5,000
- రూమ్ రెంటు: రూ. 5000 (ఏరియాను బట్టి మారొచ్చు)
- ఇన్‌స్టాల్‌మెంట్‌లో ఒక వాహనం కొనుక్కుంటే నెలవాయిదా: రూ.5,000
- ఇద్దరు పనివాళ్లను పెట్టుకున్నా, వేతనాలకు, పెట్రోలు: రూ. 20,000
- మొత్తం : రూ. 1,91,250
- పెట్టుబడి : రూ. 4,41,250

ఏడాది అమ్మితే వచ్చేది..

- రోజుకు 250 ప్యాకెట్ల కప్పులను అమ్మగలుగుతాం.
- ఏడాదికి 300 రోజులు పనిదినాలుగా లెక్కేస్తే..
- 250x 300 = 75000 ప్యాకెట్ల కప్పులను అమ్మవచ్చు.
- సగటున ఒక్కో ప్యాకెట్‌ను రూ.40కి అమ్ముదామనుకుందాం.
- 75000 x 40= రూ. 30,00,000 ఆదాయం వస్తుంది.

ఏడాదికి అయ్యే ఖర్చు..

- నెలవారీ ఉత్పాదక వ్యయాన్ని ఏడాదికి లెక్కగడితే..
- 1,91,250 x 12 = రూ. 22,95,000
- ప్రారంభ వ్యయాలు రూ. 2,50,000
- మొత్తం ఏడాదికి అయ్యే ఖర్చు : రూ. 25,45,000

లాభం అంచనా..

- ఏడాది మొత్తం వచ్చిన ఆదాయం రూ. 30,00,000
- సంవత్సరంలో అయిన ఖర్చు : రూ. 25,45,000
- తీసేస్తే వచ్చే లాభం : రూ. 4,45,000
- అంటే నెలకు వచ్చే లాభం : సుమారుగా రూ. 38,000

గమనిక :
ఈ లెక్కలు కేవలం అంచనా ప్రకారం వేసినవే. మరిన్ని వెరైటీస్‌ను తయారు చేయగలిగితే ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

టాకీస్



హను రాఘవపూడి

ఆ లెక్కలు నాకు తెలియవు!

'సినిమాల్లో సులభం, కష్టం అనేది ఏది ఉండదు. కొన్ని సార్లు క్లోజప్ షాట్స్‌లో నటీనటుల హావభావాల్ని చూపించడం కష్టంగా ఉంటుంది. మరికొన్ని సందర్భాల్లో పెద్ద పోరాట ఘట్టాలను సులభంగా చేస్తుంటాం. ఏదైనా మన స్థాయికి తగినట్లుగా ఉంటుంది' అని అన్నారు హను రాఘవపూడి. అందాల రాక్షసి, కృష్ణగాడి వీర ప్రేమ గాథ సినిమాలతో సృజనాత్మక దర్శకుడిగా గుర్తింపును సొంతం చేసుకున్నారు. ఆయన దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'లై'. నితిన్ కథానాయకుడు. ఈ నెల 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో హను రాఘవపూడి పాత్రికేయులతో పంచుకున్న ముచ్చట్లివి.

ప్రేమలేని కథలు ఉండవు. వాటిని తెరపై చూపించే విధానాలు, సంఘర్షణలు మాత్రం ప్రతి సినిమాలో భిన్నంగా ఉంటాయి. యాక్షన్ అంశాలకు అందమైన ప్రేమకథను మిళితం చేసి 'లై' సినిమాను తెరకెక్కించాం. అబద్ధాల వల్ల ఓ యువకుడు ఎలా చిక్కుల్లో పడతాడన్నది ఈ చిత్ర ఇతివృత్తం. ప్రతినాయకుడి కోణం నుంచి ఈ కథ సాగుతుంది. కథ అనుకున్న రోజునే ఇందులో విలన్‌గా అర్జున్ అయితే బాగుంటుందనిపించింది. కానీ ఆయన దగ్గరకు వెళ్లి కథ వినిపించే ధైర్యం నాకు లేదు. ఓ స్నేహితుడి ద్వారా ఆయన్ని కలిసి భయపడుతూనే కథ చెప్పాను. అర్జున్ అంగీకరించడంతో సినిమా హిట్టవుతుందని ఆ రోజే నిశ్చయానికి వచ్చాను.

హారర్ సినిమాలు చేయను

యాక్షన్, ప్రేమకథలనే తేడాలేవి నాకు లేవు. ఒక్క హారర్ తప్ప ఏ జోనర్‌లోనైనా సినిమాలు చేస్తాను. నా దృష్టిలో హారర్ సినిమాలు చేయడం చాలా కష్టం. సాధారణంగా అన్ని కథలు పాత్రల చుట్టూ తిరిగితే హారర్ సినిమాలు మాత్రం ప్రతిక్షణం ప్రేక్షకుల ఆలోచనల్ని చదువుతూ చేయాల్సి ఉంటుంది. ఒక్కరి ఆలోచనల్ని అందుకోవడమే శ్రమతో కూడుకున్నది అలాంటిది చాలా మంది అభిరుచులను దృష్టిలో పెట్టుకొని ఓ సినిమా చేయడం అంత సులభం కాదు. అందుకే హారర్ సినిమాలు చేయను.

ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో

జయాపజయాలను నేను పట్టించుకోను. వాటి గురించి ఆలోచిస్తే సృజనాత్మకతకు దూరమైపోతాం. ఆ లెక్కలు నాకు తెలియవు. వాటి వెంట పరిగెత్తను. 'అందాల రాక్షసి' ఫలితం చూసి నిరాశపడలేదు. 'కృష్ణగాడి వీరప్రేమగాథ'సక్సెస్‌ను చూసి పొంగిపోలేదు. నా మనసుకు నచ్చిన సినిమాలు చేయాలన్నదే నా అభిమతం. సక్సెసుల్లో ఉన్నప్పుడు మనం చెబుతున్నది వినేవాళ్లు చాలా మంది ఉంటారు. కానీ ఏం చెబుతున్నామనే దానిపై స్పష్టత ఉండాలి. లేదంటే మనం చేసే తప్పుల్ని సరిదిద్దుకునే అవకాశం ఎప్పటికీ రాదు. ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో నానితో ఓ సినిమా చేయబోతున్నారు. వచ్చే ఏడాది మేలో ఈ సినిమా ప్రారంభం కానుంది.



సాయిధరమ్‌తేజ్‌పై క్లాప్‌నిస్తున్న పరుచూరి వెంకటేశ్వరరావు

సాయిధరమ్‌తేజ్ కొత్త సినిమా షురూ!

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా వి.వి. వినాయక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న నూతన చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి. కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. లావణ్య త్రిపాఠి కథానాయిక. పూజా కార్యక్రమాల అనంతరం సాయిధరమ్‌తేజ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు క్లాప్‌నివ్వగా, సత్యానంద్ కెమెరా స్విఛాన్ చేశారు. ఆకుల శివ గౌరవ దర్శకత్వం వహించారు. సాయిధరమ్‌తేజ్ తల్లి విజయదుర్గ స్క్రిప్ట్‌ను అందజేశారు. చిరంజీవి చిత్ర యూనిట్‌కు ఆశీస్సులు తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'వి.వి.వినాయక్ శైలిలోనే పవర్‌ఫుల్ కథ, కథనాలతో తెరకెక్కుతున్న చిత్రమిది. సాయిధరమ్‌తేజ్ పాత్ర కొత్త పంథాలో ఉంటుంది. నటీనటుల, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతున్నది. సెప్టెంబర్ మొదటివారంలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి కథ, మాటలు: ఆకుల శివ, సినిమాటోగ్రఫీ: విశ్వేశ్వర్, ఎడిటింగ్: గౌతంరాజు, ఆర్ట్: బ్రహ్మకడలి, సహనిర్మాతలు: సి.వి.రావు, పత్స నాగరాజా.

చరిత్ర చెప్పే కథ

పూర్ణ, సాక్షిచౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సువర్ణ సుందరి'. 'చరిత్ర ఎప్పుడూ భవిష్యత్‌ను వెంటాడుతుంది' చిత్ర ఉపశీర్షిక. ఎస్ టీమ్ పిక్చర్స్ పతాకంపై ఎం.ఎల్ లక్ష్మి నిర్మిస్తున్నారు. సూర్య దర్శకుడు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శకుడు మాట్లాడుతూ



పూర్ణ

'1509వ సంవత్సరం నుంచి 2017 వరకు ఐదు శతాబ్దాలతో ముడిపడి ఉన్న కథ ఇది. సూపర్ నాచురల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నాం. చరిత్ర మాటున వెలుగులోకి రాని ఎన్నో చీకటి కోణాలు దాగి ఉంటాయి. అలాంటి వాటిలో ఓ సంఘటనకు వెండితెరరూపమే ఈ సినిమా. గ్రాఫిక్స్‌కు ప్రాధాన్యముంటుంది. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది. త్వరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. సాయికుమార్, ఇంద్ర, నాగినీడు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎల్లు మహంతి, సంగీతం: సాయికార్తీక్.

వాట్సప్!

ట్వీట్

రవీంద్ర జడేజా
@SirJadejaaaa



జడేజాను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
76,426

note to self:
stop expecting

ఆశించడం మానండి. ప్రస్తుతాన్ని ఎంజాయ్ చేయండి. కష్టపడి పనిచేయండి. అప్పుడు మీ కలలు నేరవేరుతాయి. ప్రతిక్షణం కొత్త విషయాలను తెలుసుకోవడానికి ప్రయత్నించండి.

సమ్‌థింగ్ స్పెషల్



గాలి లేని లేస్ ప్యాకెట్ దొరికిపోయిందోచ్!

కామన్‌మ్యాన్ వాయిస్

విష్ణుమూర్తి ప్రత్యక్షమై ఓ పోరన్కి.. ఏం కావాలో కోరుకో బిడ్డా అన్నడట. అంకుల్..మీ చేతిలో ఉన్న ఫిడ్జెట్ స్పిన్నర్ ఓపారి య్యరా తిప్పిస్తా అన్నడట గడుసుగా.

–Raj Kotte

జీఎస్టీ సరిగ్గా అమలయితే వచ్చే లాభాల గురించి ముఖ్య మంత్రి మాట్లాడారు. రాష్ట్రానికి వస్తున్న నష్టం, ప్రాజెక్టులకు కావాల్సిన వెసులుబాటు గురించి ఆయన ప్రశ్నిస్తున్నారు. దీనికి గుడ్డలు ఎందుకు చించుకుంటున్నారు?

–SandeepReddy Kothapally

'గిఫ్ట్ హెల్మెట్ టు బ్రదర్' కాన్సెప్ట్ జనాల్లోకి బాగానే పోతుంది. ఇప్పుడేం చేద్దాం? సింపుల్, తనకు హెల్మెట్ల కంపెనీ ఉంది. వాటి అమ్మకాల కోసమే, ఈ పిలుపు అని ప్రచారం చేద్దాం.. ఎలా ఉంది? మీరు సూపర్.

–Satya Prasad Peddapelli

వైరల్ వీడియో



మహేష్ బాబు కూతురు పాట పాడింది. అయితే ఏంటంటారా? ఏం లేదు. ఈ వీడియో యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తుంది.

Sitara Singing BOOM BOOM Song Mahesh Babu Spyder Telugu Movie #Spyder

Total views : 290,144+
Published on Aug 6, 2017

షేరింగ్

పనిష్మెంట్.. పర్‌ఫెక్షన్

విద్యార్థి తప్పు చేసినప్పుడు ఉపాధ్యాయుడు వివిధ రకాలుగా శిక్షిస్తాడు. దాని అర్థం కింది విధాలుగా ఉంటుంది.
మోకాళ్ల మీద కూర్చోబెడితే.. వినయంగా ఉండాలని..
నోటి మీద వేలేసుకోమంటే.. నీ గురించి నీవు గొప్పలు చెప్పుకోకూడదని..
చెవులు పట్టుకోమంటే.. శ్రద్ధగా వినమని..
బెంచి ఎక్కి నిలబడమంటే.. చదువులో నీవు అందరికంటే పైన ఉండాలని..
చేతులెత్తి నిలబడమంటే.. లక్ష్యం ఉన్నతంగా ఉండాలని..
గోడవైపు చూస్తూ నిలబడమంటే.. ఆత్మ పరిశీలన చేసుకోమని..
ఉపాధ్యాయుడు విద్యార్థిని బయట నిలబెడితే.. పరిసరాలను పరిశీలించి నేర్చుకోమని..
బ్లాక్ బోర్డును తుడువమంటే.. తప్పులన్నీ మరిచిపోయి, క్షమించి కొత్త పలుకలా ప్రారంభించాలని..
ఏదైనా విషయాన్ని ఎక్కువసార్లు రాయమంటే.. పర్‌ఫెక్షన్ కోసం ప్రయత్నించమని అర్థం.
విద్యార్థి అనుభవించే ఏ శిక్ష అయినా పాజిటివ్ కోసం.. పర్‌ఫెక్షన్ కోసం.

–ఓ వాట్సప్ మెసేజ్

లవర్ ఆఫ్ ఇడియట్!



అజయ్, నవీన్‌చంద్ర, రఘుబాబు

నవీన్‌చంద్ర, నివేదా థామస్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'జూలియట్ లవర్ ఆఫ్ ఇడియట్'. అజయ్ ఒదిరాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కొత్తపల్లి అనురాధ సమర్పణలో ఆర్. రఘుబాబు, కె.బి.చౌదరి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్‌ను మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నవీన్‌చంద్ర మాట్లాడుతూ 'ప్రతి లవర్ ఇడియటే. సినిమాలో నేనొక ఇడియట్ లాంటి లవర్‌గా కనిపిస్తాను. నా పాత్ర చిత్రణ చాలా కొత్తగా వుంటుంది. గిరీష్ గంగాధర్, ఆర్థర్ ఏ.విల్సన్ వంటి పేరున్న ఛాయాగ్రాహకులు ఈ చిత్రానికి పనిచేశారు. నివేదా థమస్ చాలా ప్రొఫెషనల్ ఆర్టిస్ట్. ఇందులో ఆమె పాత్ర చాలా కొత్తగా వుంటుంది. విలువలున్న ప్రేమకథగా దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసే చిత్రమిది' అన్నారు. 'నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో చిత్రాన్ని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తాం' అని కొత్తపల్లి రఘుబాబు తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'సుకుమార్ వద్ద 'ఆర్య' నుంచి '100% లవ్' వరకు పనిచేశాను. ఓ ఇడియట్‌ని జూలియట్ లాంటి అమ్మాయి ప్రేమిస్తే ఏం జరిగింది? వాళ్ల ప్రేమకథ ఎలాంటి మలుపులు తిరిగింది? అనేది ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఈ సినిమా తరువాత నవీన్ చంద్రను అంతా జూలియట్ లవర్ ఆఫ్ ఇడియట్ అని పిలుస్తారు' అని పేర్కొన్నారు. అలీ, తాగుబోతు రమేష్, దేవన్, అభిమన్యుసింగ్, కాట్రాజ్, రోహిణి తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథ: రాజ్ శివ సదాని, మాటలు: కె.వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనాథ్ బదినేని, సంగీతం: రతీస్ వేగ, ఎడిటింగ్: ఎస్.బి.ఉద్ధవ్, కళ: రాజీవ్ నాయర్, ఫైట్స్: రన్ రవి, జాషువా.

తారామణి ప్రేమాయణం



ఆండ్రియా, వసంత్‌రవి

అంజలి, ఆండ్రియా, వసంత్‌రవి ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'తారామణి'. డి.వి. సినీ క్రియేషన్స్ పతాకంపై డి.వెంకటేష్ ఈ చిత్రాన్ని అదే పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. రామ్ దర్శకుడు. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిర్మాత మాట్లాడుతూ 'ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. సాంకేతిక పరిజ్ఞానం మాయలో పడిన యువత ఏం కోల్పోతున్నారు?. ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారనే సందేశాత్మక కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. రొమాన్స్, ప్రేమ అంశాలతో పాటు భావోద్వేగాలకు ప్రాధాన్యముంటుంది. యువతరంతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకముంది. ఈ నెలలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం' అని తెలిపారు.

ప్రతిక్షణం భయం



తేజస్విని

మనీష్‌బాబు, తేజస్విని జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రతిక్షణం'. జి. మల్లిఖార్జునరెడ్డి నిర్మిస్తున్నారు. నాగేంద్రప్రసాద్ దర్శకుడు. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకను ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించారు. నిర్మాత మాట్లాడుతూ 'హారర్, లవ్, కామెడీ అంశాలతో ప్రతిక్షణం థ్రిల్‌ను కలిగించే చిత్రమిది. అడవిలోని ఓ భవంతిలో అడుగుపెట్టిన నిత్య అనే అమ్మాయికి అక్కడ ఎలాంటి భయానక సంఘటనలు ఎదురయ్యాయన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. ఈ నెల 18న సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డ్రగ్ కంట్రోలర్ డైరెక్టర్ అమృతరావు, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సాయివెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సొరియాసిస్‌కు పక్కా వైద్యం

సలహా



సొరియాసిస్ చర్మం మీద కనిపించే సమస్య అయినప్పటికీ ఇది శరీరంలోపల విస్తరించే వ్యాధి. ఈ క్రమంలో శరీరంలోని సప్తధాతువులు ఒక్కొక్కటిగా క్షీణిస్తూ వెళ్తాయి. ధాతువులు క్షీణించే కొద్దీ శరీరంలో వాత ప్రకోపం పెరుగుతుంది. ఇది నాడీ వ్యవస్థను దారుణంగా దెబ్బతీస్తుంది. గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యలకు మూలం కావడమే కాదు దేహ క్రియలన్నీ కుంటుపడేలా చేస్తుంది. సొరియాసిస్‌తో ఎముకలకు సంబంధించిన అస్థిధాతువు కూడా క్షీణించడంతో వెన్నెముక సమస్యలు, కీళ్ల సమస్యలు మొదలవుతాయి. బాహ్యంగా చేసే పంచకర్మ చికిత్సలతో పాటు అంతర చికిత్సలు కూడా ఇక్కడ ఎంతో కీలకం. అందుకే సొరియాసిస్ నుంచి శాశ్వత విముక్తి పొందాలంటే, పంచకర్మ చికిత్సలూ, ఔషధ చికిత్సలూ సమాంతరంగా సాగాలి.

మూలాల్లోకి చొచ్చుకు పోతుంది

సొరియాసిస్ సప్తధాతువలనే కాదు, సమస్త శరీర వ్యవస్థలనూ ధ్వంసం చేసే తత్వం కలిగి ఉంటుంది. ఈ ధాతువులు క్షీణిస్తూ వెళ్లే కొద్దీ శరీరంలో వాతం పెరుగుతుంది. ఒక్కవాతం సంతులనం కోల్పోతే మిగిలిన పిత్తం, కఫం కూడా సంతులనం కోల్పోతాయి. అయితే చికిత్సా విధానాలతో ఒక్క వాతాన్ని తిరిగి సాధరణ స్థితికి తెస్తే, పిత్త కఫాలు కూడా సాధారణ స్థితికి వస్తాయి. అందుకే ఆయుర్వేదం వాత నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుంది.

నాడులు దెబ్బతింటే?

మానసిక ఒత్తిడి, నిద్రలేమి వంటి కారణాలతో సొరియాసిస్ రోగుల్లో నిరోధక శక్తి చాలా తగ్గిపోతుంది. ఈ శక్తి తగ్గిపోవడం వల్ల శరీరంలోని ఇతర వ్యవస్థలన్నీ దెబ్బతింటాయి. ప్రత్యేకించి నాడీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. శరీరంలోని ప్రొటీన్ అంతా మృతకణాలుగా బయటకు వెళ్లడం మూలంగా సహజంగానే నాడులు చచ్చుబడిపోతాయి. సొరియాసిస్ కారణంగా ఒత్తిడి తీవ్రత పెరిగినపుడు హార్మోన్లలో కీలకమైన అడ్రినల్ గ్రంధి దెబ్బతింటుంది. అస్థిధాతులు క్షీణించడం వల్ల సొరియాటిక్ ఆర్థరైటిస్ మొదలవుతుంది. నాడీ వ్యవస్థను దెబ్బతీసే ఈ సొరియాసిస్ వ్యాధి సరైన వైద్య చికిత్సలు అందక దీర్ఘకాలం కొనసాగినపుడు కొన్ని రకాల మానసిక సమస్యలు కూడా మొదలు కావచ్చు. ముఖ్యంగా నైపుణ్యం, సామర్థ్యం తగ్గిపోతాయి.

ఆయుర్వేదంతో అంతా మేలే!

కేవలం బాహ్య చికిత్సలతో సొరియాసిస్‌కు పరిపూర్ణ వైద్యం అందదు. సొరియాసిస్‌కు కారణమైన విషపదార్థాలను ముందు పంచకర్మ చికిత్సల ద్వారా తొలగించాలి. ఆ తర్వాత ధాతు క్షయాన్ని నివారించే ఔషధాలు కూడా ఇవ్వాలి. వమనం, విరేచన కర్మల ద్వారా శరీరంలోని మలినాలన్నీ తొలగిస్తే వాతం నియంత్రణలోకి వస్తుంది. తర్వాత పిత్త, కఫాలు కూడా అదుపులోకి వస్తాయి. అప్పుడే సొరియాసిస్ సమూలంగా తొలగిపోతుంది. ఆయుర్వేద చికిత్సలు మొదలైన 25 రోజులకే సొరియాసిస్ మచ్చలు బాగా తగ్గిపోతాయి. ఆ తర్వాత వ్యాధిని సమూలంగా తొలగించడానికి మరో 3,4 మాసాలపాటు కడుపులోకి ఇచ్చే ఔషధాలు తీసుకోవాలి. వీటితో సొరియాసిస్ వల్ల వచ్చిన ఇతర ఆరోగ్య సమస్యలు కూడా తగ్గిపోతాయి. ఆయుర్వేదం సొరియాసిస్‌ను సమూలంగా, శాశ్వతంగా తొలగించి తీరుతుంది. వైద్య చికిత్సలు పూర్తి అయిపోయిన తర్వాత శరీరం మీద సొరియాసిస్ ఛాయలే కనిపించవు.

డా. ఎన్. రామకృష్ణారెడ్డి
ఆర్‌కే ఆయుర్వేదిక్ అండ్ సొరియాసిస్ రీసెర్చ్ సెంటర్
హైదరాబాద్, హన్మకొండ
8886 922 245
8886 922 247





బోయపాటి శ్రీను

తెలుగు తెరపై హీరోయిజాన్ని పతాక స్థాయిలో ఆవిష్కరించడంలో దర్శకుడు బోయపాటి శ్రీనుది ప్రత్యేక శైలి. అందుకే ఆయన దర్శకత్వంలో నటించాలని ప్రతీ హీరో కోరుకుంటారు. మాస్ ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా సినిమాలు తీస్తూ తనదైన ముద్రతో స్టార్ డైరెక్టర్‌గా పేరుతెచ్చుకున్న బోయపాటి శ్రీను తన పంథాకు భిన్నంగా తెరకెక్కించిన తాజా చిత్రం 'జయ జానకి నాయక'. సాయి శ్రీనివాస్ కథానాయకుడు. రకుల్‌ప్రీత్‌సింగ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలుగా నటించారు. మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో దర్శకుడు బోయపాటి శ్రీను పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.

• మీ సినిమాలో హీరో పాత్ర చిత్రణ చాలా పవర్‌పుల్‌గా సాగుతుంది. సాయిశ్రీనివాస్‌ని పవర్‌ఫుల్‌గా చూపించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

సాయి శ్రీనివాస్‌తో సినిమా అనుకున్నప్పుడు అతను నటించిన చిత్రాల్ని దాదాపు 20 సార్లు చూసి అతనిలో వున్న ప్లస్‌లు, మైనస్‌లేమిటో తెలుసుకున్నాను. ఆ తరువాత అతన్ని దాదాపు ముప్పై కేజీల బరువు పెరిగేలా చేశాం. తరువాత పదిహేడు కేజీల బరువు తగ్గేలా చేసి ఈ కథకు సాయిశ్రీనివాస్ ఎలా వుంటే బాగుంటుందో ఆషేపుకు తీసుకొచ్చి చేసిన సినిమా ఇది. అతని నటన, హావభావాలు ఎలా వుంటాయనేది రేపు తెరపైన చూస్తే మీకే అర్థమవుతుంది.

• మీ గత చిత్రాలతో పోలిస్తే ఈ సినిమాలో కుటుంబ భావోద్వేగాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్టున్నారు?

నా గత చిత్రాల్లో వుండే అంశాలతో పాటు అన్ని అంశాలు చక్కగా కుదిరిన చిత్రమిది. ముఖ్యంగా చెప్పాలంటే ఈ మధ్య కాలంలో ఎవరు టచ్ చేయని మహిళలకు సంబంధించిన ఓ అంశాన్ని తీసుకుని చేసిన చిత్రమిది. దాన్ని దృష్టిలో పెట్టుకునే సినిమాలో 'లైఫ్‌లో కష్టం వచ్చిన ప్రతిసారి లైఫ్‌ను వదలం కానీ ప్రేమను వదిలేస్తాం. నేను మాత్రం ప్రేమను వదలను. ఎందుకంటే నేను ప్రేమించాను' అనే డైలాగ్‌ని పెట్టాం. నా వాళ్లని ఎలా ప్రేమిస్తానో ప్రేమించిన అమ్మాయి ఎక్కడ వున్నా ఎలా వున్నా బాగుండాలని కోరుకుంటాను. ఎందుకంటే నేను ప్రేమించా' అనే ఓ యువకుడి కథ ఇది. కొత్తగా చెప్పేప్రయత్నం చేశాను. రేపు చూసిన ప్రేక్షకులు కూడా అదే ఫీలవుతారని భావిస్తున్నాను.

ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా మారాల్సిందే!

• 'జయ జానకి నాయక'తో మీరు పంథా మార్చారా? లేక 'జయ జానకి...' మీ పంథాలో సాగే కొత్త తరహా సినిమానా?

తెలుగు ప్రేక్షకులు కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. వాళ్లను సంతృప్తిపరచాలంటే పంథా మార్చాలిందే. ఒక వేళ పాత కథ చెప్పినా దాన్ని కొత్తగా చూపించే ప్రయత్నం చేయాలి. అలా చేసిన ప్రయత్నమే 'జయ జానకి నాయక'. 'భద్ర' తరువాత నేను చేసిన ఓ అందమైన ప్రేమకథాచిత్రమిది.

• పంథా మార్చాలనే ఆలోచనకు కారణం?

ప్రేక్షకుల ఆలోచనలు మారుతున్నకొద్ది అందుకు అనుగుణంగా మనం కూడా మారాల్సిందే. అలా మారని రోజు వెనకబడిపోతాం. దాన్ని దృష్టిలో పెట్టుకుని నన్ను నేను మార్చుకుని నా పంథాకు భిన్నంగా కొత్త కథతో చేసిన సినిమా ఇది.

• మీ పంథాకు భిన్నంగా తొలిసారి ప్రయత్నించానని చెప్పారు. కొత్తగా ఏం చెప్పడానికి ప్రయత్నించారు?

నా గత చిత్రాలకు భిన్నంగా నేను చేసిన ప్రయత్నం ఏంటనేదే ఈ చిత్ర కథ. అది రేపు థియేటర్‌లో చూస్తేనే అర్థమవుతుంది. సమాజానికి మంచి చేయకపోయినా ఫరవాలేదు కానీ చెడు మాత్రం చేయకూడదనేది నేను నమ్మిన సిద్ధాంతం. నేను చేసిన ప్రతి చిత్రంలోనూ సమాజానికి ఉపయుక్తమయ్యే సందేశాన్ని అంతర్లీనంగా అందిస్తూనే వున్నాను. అదే తరహాలో తాజా చిత్రం ద్వారా కూడా సమాజంలో నేటి యువతి ఎదుర్కొంటున్న ఓ బలమైన సమస్యలను చూపించే ప్రయత్నం చేశాను.

• 'సరైనోడు' లాంటి భారీ హిట్ తరువాత స్టార్ హీరోలు మీ కోసం ఎదురు చూస్తున్న తరుణంలో సాయి శ్రీనివాస్‌తో సినిమా చేయడానికి ప్రత్యేకమైన కారణం ఏమైనా వుందా?

'సరైనోడు' సక్సెస్ తరువాత నాతో సినిమాలు చేయాలని చాలా మంది స్టార్ హీరోలు ముందుకొచ్చారు. అయితే అంతకు ముందే సాయి శ్రీనివాస్‌తో సినిమా చేస్తానని మాటిచ్చాను. ఆ విషయం పరిశ్రమలో అందరికి తెలుసు. ఇచ్చిన మాటను నేను ఎప్పుడూ తప్పలేదు. నేను కొన్ని విలువల్ని పాటిస్తాను. మన మాటకు విలువుండాలి. మనకంటూ ఓ క్యారెక్టర్ వుండాలి. దాని కోసం నేను ఎంత దూరమైనా వెళ్లడానికి వెనుకాడను. క్యారెక్టర్ లేకపోతే మనం లేనట్లే. ఇది నేను నమ్మిన సిద్ధాంతం. ఆ సిద్ధాంతం కోసమే ఈ సినిమా చేశాను. అయితే మాటిచ్చాం కదా ఏదో ఒకటి చేసేద్దాం అని మాత్రం చేసిన సినిమా కాదిది. ఈ సినిమా ఇంత బాగా రావడానికి ప్రధాన కారకులు నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి గారే. ఆయనే ఈ సినిమాకు ప్రధాన ఎస్సెట్. నేను చెప్పుకునే సినిమా కావాలి. నా బ్యానర్ నిలబడాలనే లక్ష్యంతో ఎక్కడా రాజీపడకుండా ఆయన ఈ చిత్రాన్ని చాలా గ్రాండ్‌గా నిర్మించారు.

• 'జయ జానకి...' సాయిశ్రీనివాస్ కోసమే అనుకున్నారా?

చాలా ఏళ్ల క్రితం చేసుకున్న కథ ఇది. సాయి శ్రీనివాస్‌ని అనుకున్న తరువాత అతనికి తగ్గట్లుగా మార్పులు చేర్పులు చేశాం.

• ఇప్పటి వరకు స్టార్ హీరోలతో సినిమాలు చేశారు. తొలిసారి కొత్త హీరోతో పనిచేయడం ఎలా ఉంది?

సాయిశ్రీనివాస్‌తో చేయడం చాలా సులువు అయింది. కొత్త హీరో అంటే నా దృష్టిలో ఓ రా మెటీరియల్. దాన్ని ఎలా మలుచుకోవాలో నాకు బాగా తెలుసు. ఇమేజ్ అంటూ ఏమీ ఉండదు కాబట్టి కొత్త వాళ్లను అనుకున్నట్టుగా మలుచుకోవడమే చాలా సులభమవుతుంది.

• మీ గత చిత్రాలకు ఈ సినిమాకు వున్న తేడా?


నేను చెబుతున్న పాయింటే ప్రేక్షకులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అన్ని వర్గాల తెలుగు ప్రేక్షకుల్ని దృష్టిలోపెట్టుకుని తీసిన ఓ మంచి సినిమా. ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకే చిత్రమిది. మంచి సినిమా తీస్తే ప్రేక్షకులు గుండెల్లో పెట్టుకుంటారని చాలా సార్లు నిరూపించారు. ఈ సినిమా విషయంలోనూ అదే జరుగుతుందన్న నమ్మకముంది.

• మీ దుపరి చిత్రాల గురించి?

చిరంజీవితో సినిమా వుంటుంది. ఆయనకు తగ్గ కథ ఇప్పటికే సిద్ధమైంది. మరో రెండు నెలల వర్క్ చేయాలి. అది సెట్స్‌పైకి రావడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. మహేష్‌బాబు కోసం కూడా ఓ కథ రెడీ చేశాను. కొత్త జోనర్‌లో వుంటుంది. దీన్ని తెరకెక్కించడానికి మహేష్ ఎక్కువ డేట్స్ ఇవ్వాల్సి వుంటుంది. ఇవే కాకుండా బాలకృష్ణతో వచ్చే ఏడాది మే లేదా జూన్‌లో ఓ సినిమా మొదలుపెడతాను. దీనికీ కథ సిద్ధంగా వుంది. అఖిల్ కోసం రెండు లైన్‌లు సిద్ధం చేసి వుంచాను. వీటన్నింటికి మధ్యలో ఓ సినిమా చేసే అవకాశం వుంది. అది ఏ హీరోతో వుంటుందనేది ఇప్పుడే చెప్పలేను.

బైపాస్ సర్జరీలో జాగ్రత్తలు

సలహా



గుండె సంబంధిత వ్యాధులు ఈ రోజుల్లో చాలా ఎక్కువగా కనిపిస్తున్నాయి. అందుకు తగిన చికిత్సలు కూడా చాలా అందుబాటులోకి వచ్చాయి. గుండె సంబంధిత రక్తనాళల సమస్య కరోనరీ ఆర్టరీ డసీజ్. ఈ సమస్యకు సాధారణంగా బైపాస్ సర్జరీ లేదా యాంజియోప్లాస్టీ చేసి స్టెంట్ అమర్చడం ద్వారా చికిత్స అందిస్తారు. ఇలాంటి చికిత్స తీసుకున్న వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయం గురించిన అవగాహన చాలా అవసరం.

ఇదో మేజర్ సర్జరీ

కరోనరీ బైపాస్ సర్జరీ నిజానికి చాలా పెద్ద సర్జరీ. ఈ సర్జరీ ద్వారా గుండెకు రక్త ప్రసరణ జరుగడానికి ఒక కొత్త దారిని ఏర్పాటు చేస్తారు. ఈసర్జరీ చెయ్యడానికి పూర్తిస్థాయిలో అనస్థీషియా అవసరం అవుతుంది. అంతేకాకుండా చాలా రకాలుగా ఇతర సపోర్ట్ సిస్టంలను కూడా ఉపయోగించాల్సిన అవసరం ఉంటుంది. ఈ సర్జరీకి దాదాపుగా 3 గంటల సమయం పడుతుంది. ఈ సర్జరీకి సంబంధించిన గాయం, దాని తాలూకు అసౌకర్యం పూర్తిగా తగ్గిపోవడానికి 2–19 నెలల కాలం పట్టవచ్చు. చాలామంది ఈ సర్జరీ తర్వాత 1,2 నెలల్లో తమ పనులు మామూలుగా నిర్వర్తించుకునే అవకాశం ఉంటుంది. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేసిన రక్తప్రసరణ మార్గంలో తిరిగి అడ్డంకులు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. మూడు ముఖ్య విషయాలు ఎప్పుడూ గుర్తుంచుకుని ఆచరించాలి.

- ప్రమాదానికి కారణమయ్యే బీపి, డయాబెటిస్ వంటి వాటిని అదుపులో ఉంచుకోవడం
- రక్తం పలుచబరిచే బ్లడ్ థిన్నర్స్, స్టాటిన్స్ అనే మందులను జీవిత పర్యంతం వాడడం
- ఇతర అనారోగ్య సమస్యలు కలుగకుండా నివారించుకోవడం
- క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ ఉండడం

ఇవి చెయ్యకూడదు

- సర్జరీకి సంబంధించిన గాయం, దాని చుట్టూ ఉండే అసౌకర్యం గురించి ఎక్కువ బెంగ పడకూడదు.
- కడుపునిండా భోంచేసి నడువ కూడదు
- డాక్టర్ సలహా లేకుండా ఎవరికి వారే వృత్తి సంబంధిత బాధ్యతల్లో చేరిపోవడం
- వంగడం, బరువైన పనులు చెయ్యడం, యాత్రలు చెయ్యడం, ఈత వంటి వ్యాయామాలు చెయ్యడం, ఉపన్యాసాలు ఇవ్వడం, శృంగారం వంటివి డాక్టర్ సలహా లేకుండా చెయ్యకూడదు.
- ఆల్కహాల్, ఫాస్ట్‌ఫుడ్ వంటి వంటి వాటికి దూరంగా ఉండాలి.

డాక్టర్ ఎ.ఎన్. పట్నాయక్
సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్
07097 060 006



గోండ్వానా శిలల్లో లభించే ఖనిజం?

- రాష్ట్రం గోండ్వానా భూభాగం నుంచి ఏర్పడిన భారత ద్వీపకల్ప భూభాగంలోని దక్కన్ పీఠభూమిలో అంతర్భాగం.
- ఇది అతిపురాతనమైన గ్రానైట్‌లాంటి అగ్ని, నీస్, సిస్ట్ రూపాంతర శిలలతో ఏర్పడింది.
- పడమటి పీఠభూమిగా పిలుస్తున్న రాష్ట్ర భూభాగం సమద్విబాహు త్రిభుజాకృతిలో ఉంది.
- మెసోజాయిక్ కాలానికిచెందిన అగ్నిమయ ఉదరవిద్భేదనాల వల్ల లావా పెల్లుబికి చల్లారి ఘనీబవించడంవల్ల కొండలు, గుట్టలు, పీఠభూమి లక్షణాలతో రాష్ట్ర భూ ఉపరితల స్థలాకృతి ఏర్పడింది. సముద్ర మట్టానికి 150-600 మీటర్ల ఎత్తులో ఉంది.
- రాష్ట్ర భూభాగాన్ని మూడు ప్రధాన నైసర్గిక భాగాలుగా విభజించవచ్చు. అవి.. 1) పడమటి పీఠభూమి 2) పశ్చిమ కనుమలు 3) తూర్పుకనుమలు.
- **పడమటి పీఠభూమి:** ప్రస్తుతమున్న రాష్ట్ర భూభాగం ఏపీలోని అనంతపూర్, నంద్యాలప్రాంత భూభాగాన్ని కలిపి పడమటి పీఠభూమిగా పిలుస్తారు.
- పీఠభూమి మధ్యలో హైదరాబాద్ నగర ప్రాంత భూభాగం సముద్రమట్టం నుంచి 600 మీటర్ల ఎత్తులో, కృష్ణా-తుంగభద్ర నదీలోయల మధ్య భాగం 350-450 మీటర్ల ఎత్తులో, భీమ-గోదావరి నదుల మధ్య భాగం దాదాపు 730 మీటర్ల ఎత్తుతో, మెదక్-మహబూబ్‌నగర్‌ల మధ్య 600-900 మీటర్ల ఎత్తుతో విస్తరించి ఉంది.
- ఈ పీఠభూమి ఉపరితల దృశ్యవాలు వాయవ్యం నుంచి ఆగ్నేయం వైపు ఉన్నందున ఇక్కడ ప్రవహించే, జన్మించే నదులన్నీ వాయవ్యం నుంచి ఆగ్నేయానికి ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి.
- పీఠభూమి ప్రాంతంలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో విస్తరించి ఉన్న గోదావరి నదీలోయ ప్రాంతమంతా ప్రధానంగా గోండ్వానా శిలలతో ఏర్పడి ఉంది. ఈ శిలల్లో లభించే ఖనిజం బొగ్గు.
- హైదరాబాద్ నగర ప్రాంత భూభాగం సముద్ర మట్టం నుంచి దాదాపు 600 మీటర్ల ఎత్తులో ఉన్నందున ఇక్కడ పరిసర ప్రాంతాలతో పోలిస్తే వాతావరణం చల్లగా ఉంటుంది.
- **పశ్చిమ కనుమలు:** పీఠభూమికి ఉత్తర, వాయవ్య దిశల్లో పశ్చిమకనుమలు లేదా సహ్యాద్రి పర్వతాలు అజంతాశ్రేణి నుంచి విడిపోయి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి.
- ఈ పశ్చిమకనుమలను వివిధ జిల్లాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు. అవి..
- **ఆదిలాబాద్** – నిర్మల్ గుట్టలు, సాత్మల కొండలు



- **కరీంనగర్** – గోలికొండలు, రాఖీగుట్టలు, జగిత్యాల కొండలు
- **వరంగల్** – కందికల్ కొండలు లేదా కంగల్ కొండలు
- **ఖమ్మం** – కందికల్ కొండలు......
- **నిజామాబాద్** – సిర్నాపల్లి కొండలు
- **పశ్చిమకనుమల్లోని అత్యంత ఎత్తయిన ప్రాంతం**– నిర్మల్ గుట్టల్లోని మహబూబాఘాట్.
- **తూర్పుకనుమలు:** రాష్ట్రానికి తూర్పుకనుమలు ఈశాన్య, ఆగ్నేయ సరిహద్దుగా నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. ఇవి అగ్నిమయ, క్వార్ట్జ్ శిలలతో ఏర్పడి ఉన్నాయి. వీటిని వివిధ జిల్లాల్లో కింది విధంగా పిలుస్తారు. అవి..
- **మహబూబ్‌నగర్** – నల్లమలకొండలు, అమ్రాబాద్ గుట్టలు, షాబాద్ గుట్టలు
- **రంగారెడ్డి** – అనంతగిరి గుట్టలు
- **నల్లగొండ** – రాచకొండలు, నందికొండలు
- **ఖమ్మం** – పాపికొండలు, రాజుగుట్టలు, యల్లండ్లపాడు గుట్టలు

శీతోష్ణస్థితి

- రాష్ట్ర శీతోష్ణస్థితిని అయనరేఖా రుతుపవన రకపు శీతోష్ణస్థితిగా పేర్కొనవచ్చు. అంటే ఇక్కడి వాతావరణం వేడిగా, పొడిగా ఉంటుంది. దీన్నే అర్ధ శుష్క శీతోష్ణస్థితి అంటారు.
- రాష్ట్ర భూభాగంలో శీతోష్ణస్థితిని సమరీతిగాలేకుండా కొంత వైవిధ్యాలతో కూడి ఉంది. ఉత్తర ప్రాంతంలో ఉప ఆర్ద్రశీతోష్ణస్థితి నుంచి దక్షిణ తెలంగాణలో అర్ధశుష్క శీతోష్ణస్థితి కలిగి ఉంది.
- రాష్ట్రంలో ఏడాదిని నాలుగు శీతోష్ణస్థితి రుతువులుగా విభజించారు.
- **శీతాకాలం – జనవరి నుంచి ఫిబ్రవరి:** ఈ కాలంలో అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పొడి వాతావరణం నెలకొని ఉంటుంది.
- **వేసవికాలం – మార్చి నుంచి జూన్:** ఈ రుతువులో సంవహన ప్రక్రియ అధికంగా జరగడంవల్ల వాతావరణంలో క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన సంవహన వర్షపు జల్లులు సంభవిస్తాయి. వీటినే తొలకరి జల్లులు అంటారు. మేలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదుతోపాటు వడగాల్పులు వీస్తాయి.
- **నైరుతి రుతుపవన లేదా వర్షాకాలం – జూన్ నుంచి సెప్టెంబర్:** జూన్‌లో ఈ రుతుపవనాలు ప్రవేశించడంతో వర్షాలు పడటం ప్రారంభమవుతుంది.
- **ఈశాన్య రుతుపవనకాలం – సెప్టెంబర్ నుంచి డిసెంబర్:** ఈ రుతువులో బంగాళాఖాతంతో ఏర్పడే చక్రవాతాల వల్ల రాష్ట్రంలో వర్షం పడుతుంది.

హైదరాబాద్
గురువారం, 10 ఆగస్టు 2017
నమస్తే తెలంగాణ
WWW.NTNEWS.COM

రాజ్యాంగ సవరణలు

రాజ్యాంగాన్ని అప్పటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రూపొందించారు. కాలానుగుణంగా వచ్చే సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను పరిష్కరించే విధంగా రాజ్యాంగం మార్పులకు లోనుకావాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఎలాంటి సంక్షోభం తలెత్తకుండా ఉండడం కోసం రాజ్యాంగ సవరణకు రాజ్యాంగ నిర్మాతలు అవకాశం కల్పించారు. ఈ విధానాన్ని దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి గ్రహించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి జరిగిన రాజ్యాంగ సవరణల గురించి నిపుణ పాఠకుల కోసం..



- **1వ రాజ్యాంగం సవరణ(1951):** 15, 19, 85, 87, 174, 341, 342, 373, 376 ప్రకరణలను సవరించారు. 31A, 31B ప్రకరణలు కొత్తగా చేర్చారు. IXవ షెడ్యూల్‌ను కూడా చేర్చారు. ప్రకరణ 15కు క్లాజు (4)ను చేర్చడం ద్వారా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం కొన్ని కొత్త అధికారాలను ప్రభుత్వం పొందింది. వాక్ స్వాతంత్ర్యంపై, వృత్తి వ్యాపార నిర్వహణ హక్కుపై (ప్రకరణ-19) కొన్ని నియంత్రణలను ప్రవేశ పెట్టింది. ఈ సవరణ నియంత్రణకు 'సహేతుక' అనే పదం చేర్చడం ద్వారా నియంత్రణను న్యాయబద్ధం చేసింది. ఈ సవరణ ప్రకరణ 19(6)కు వివరణ ఇస్తూ రాజ్యపర వాణిజ్యం, జాతీయీకరణపై ప్రభుత్వానికి గల హక్కును ధ్రువీకరించింది. ప్రకరణలు 31A, 31B అనే రెండు కొత్త అంశాలను IXవ షెడ్యూలుకు చేర్చి, భూసంస్కరణలకు స్థిరమైన రూపాన్ని ఇచ్చి వ్యక్తిగత హక్కుల పరిధి నుంచి తొలగించడం ద్వారా న్యాయసమీక్ష పరిధిలోకి రాకుండా చేసింది. పార్లమెంట్ సమావేశాలను వాయిదా వేయడం, రద్దు చేయడం(85), పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం(87). షెడ్యూల్డ్ కులాలు (341), షెడ్యూల్డ్ తెగలు (342) అమల్లో ఉన్న శాసనాల కొనసాగింపు (372), హైకోర్టు జడ్జీల నియామకాలకు సంబంధించిన అంశాలను సవరించారు.
- **2వ సవరణ (1952):** 81వ ప్రకరణ. లోక్‌సభ ప్రతినిధుల సంఖ్యను పెంచింది. 1951 జనాభా లెక్కలకు అనుగుణంగా, సగటున ఒక సభ్యుడు 7,50,000 మందికి పైగా ప్రాతినిధ్యం వహించేలా సవరించారు.
- **3వ సవరణ (1955):** VIIవ షెడ్యూల్ 3వ జాబితాలోని 33వ అంశాన్ని సవరించారు. ప్రజాప్రయోజనాల కోసం వస్తువుల ఉత్పత్తి సరఫరాను చేపట్టే అధికారాన్ని ఈ సవరణ కేంద్రప్రభుత్వానికిచ్చింది. ఉపయోగానికి వచ్చే ఆహారపదార్థాలు పశువులు, పచ్చిదాణా, పత్తి, జనపనార అనే అంశాలు అదనంగా 3వ జాబితాలో చేరాయి.
- **4వ సవరణ(1955):** 31, 31A, 305 ప్రకరణలను, IXవ షెడ్యూలుకూ సవరణలు జరిగాయి. ప్రజాప్రయోజనం కోసం తప్పనిసరిగా ప్రభుత్వం ప్రైవేటు ఆస్తులను స్వాధీనం చేసుకున్నప్పటికీ వాటికిచ్చే నష్టపరిహారానికి సంబంధించిన అంశాలను కోర్టులో సవాల్ చేయరాదు.
- **5వ సవరణ(1955):** రాష్ట్రాలు, సరిహద్దులను మార్చడానికి సంబంధించి, కేంద్రం చేసే చట్టాలకు రాష్ట్రపతి విధించే నిర్ణీత గడువులోగా రాష్ట్ర శాసనసభలు తమ అభిప్రాయాన్ని వ్యక్తీకరించాలి. లేకపోతే కేంద్రానికి ఆ చట్టాన్ని పార్లమెంటులో ప్రకటించే అధికారాన్ని ఇచ్చింది.
- **6వ సవరణ(1956):** 269, 286 ప్రకరణలను సవరించారు. VIIవ షెడ్యూల్‌లోని 1వ జాబితాకు 54వ అంశాన్ని, 2వ జాబితాకు 92వ అంశాన్ని చేర్చారు. కేంద్ర జాబితాకు అంతర్రాష్ట్ర వ్యాపార, వాణిజ్య వ్యవహారాల్లో వస్తువుల అమ్మకం, కొనుగోళ్ల మీద వేసే పన్నులకు సంబంధించిన ఒక కొత్త అంశాన్ని ఈ సవరణ కలిపింది.
- **7వ సవరణ(1956):** 49, 80, 81, 82, 131, 153, 158, 168, 170, 171, 216, 217, 220, 231, 232, 239, 240, 253, 298, 371 ప్రకరణలను సవరించారు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ సిఫారసు ఆధారంగా రాష్ట్రాల A, B, C వర్గీకరణను తొలగించి A, B రాష్ట్రాలను కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పాటు చేశారు. లోక్‌సభ నిర్మాణాన్ని ప్రతి జనాభా లెక్కల సేకరణ తర్వాత సవరించే నిబంధనను రాజ్యాంగంలో చేర్చారు. పదవీ విరమణ చేసిన హైకోర్టు జడ్జికి సుప్రీంకోర్టులో ప్రాక్టీసు చేసుకొనే వీలును కల్పించారు. తాత్కాలిక, అదనపు జడ్జీల నియామకానికి అనుమతి ఇచ్చారు. రెండు కంటే ఎక్కువ రాష్ట్రాలకు ఒకే హైకోర్టు ఏర్పాటు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వల్ల ఆయా రాష్ట్రాల్లో ఉన్న భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలకు రాజ్యాంగ రక్షణలకు సంబంధించి రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సంఘాలు చేసిన సిఫారసులను అమలు జరిపే చర్యలను అనుమతించింది. కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన అంశాలపై కూడా మార్పులు జరిగాయి. ఆంధ్రప్రదేశ్, పంజాబ్, బొంబాయి రాష్ట్రాలకు సంబంధించి కొన్ని ప్రత్యేకాంశాలను చేర్చారు.
- **8వ సవరణ (1959):** ప్రకరణ 334ను సవరించి 10 ఏండ్లు అనే స్థానంలో 20 ఏండ్లు అనే మాటను పొందుపర్చారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సంబంధించిన ప్రత్యేక రాజ్యాంగ సదుపాయాల కాలపరిమితిని, లోక్‌సభకు, రాష్ట్ర విధానసభలకు ఆంగ్లోఇండియన్ ప్రతినిధులను నియమించే విధాన కాలపరిమితిని 10 ఏండ్ల నుంచి 20 ఏండ్ల వరకు ఈ సవరణ ద్వారా పొడిగించారు.
- **9వ సవరణ (1960):** 1వ షెడ్యూల్. సుప్రీంకోర్టు బెరుబారి కేసులో తీర్పునకు అనుగుణంగా బెరుబారి ప్రాంతాన్ని ఇండో-పాక్ ఒప్పందం (1958) ప్రకారం పాకిస్థాన్(ప్రస్తుతం బంగ్లాదేశ్)కు అప్పగిస్తూ పశ్చిమబెంగాల్ సరిహద్దుల్లో మార్పులు చేయడానికి షెడ్యూల్-1ను సవరించారు.
- **10వ సవరణ (1961):** 240వ ప్రకరణ, 1వ షెడ్యూల్. పోర్చుగీసు ఆధీనంలోని దాద్రా, నగర్ హవేలీలకు ఈ సవరణ వల్ల కేంద్రపాలిత ప్రాంత హోదా లభించింది. వాటి పాలన కోసం నిబంధనలు జారీ చేసే అధికారం రాష్ట్రపతికి సంక్రమించింది.
- **11వ సవరణ (1961):** 66, 71లను సవరించారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం పార్లమెంట్ ఉభయసభల సంయుక్త సమావేశం అనే కఠిన విధానాన్ని తొలిగించి రెండు సభలు విడివిడిగా ఎన్నికల్లో పాల్గొనడానికి అవకాశం కల్పించారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతుల ఎలక్టోరల్ కాలేజిల్లో ఖాళీలు ఉన్నాయనే కారణం వల్ల వారి ఎన్నికకు న్యాయస్థానాల్లో సవాల్ చేయరాదు.
- **12వ సవరణ (1962):** 240వ ప్రకరణ, షెడ్యూల్-I. గోవా, డయ్యూ, డామన్‌లకు భారత దేశంలో విలీనం చేసి కేంద్రపాలిత ప్రాంత హోదా కల్పించారు.
- **13వ సవరణ (1962):** 371A ప్రకరణను చేర్చారు. XXIవ భాగాన్ని కూడా సవరించారు. 16వ రాష్ట్రంగా నాగాలాండ్‌కు రాష్ట్ర హోదాను కల్పించడమే కాకుండా దానికి కొన్ని ప్రత్యేకతలను కల్పించారు.
- **14వ వసరణ (1962):** 81, 240 ప్రకరణలను సవరించారు. ప్రకరణ 239కు 239A చేర్చారు. I, IV షెడ్యూళ్లను సవరించారు. ప్రకరణ 81ని సవరించి కేంద్రపాలిత ప్రాంతాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం 20 నుంచి 25కు పెంచారు. ఫ్రెంచ్ కాలనీల నుంచి భారత భూభాగంలోకి 1962 ఆగస్టు 16న చేరిన పుదుచ్చేరి, కరైకల్, యానం, మహేలను కేంద్ర పాలిత ప్రాంతం 'పుదుచ్చేరి'గా మార్చారు. హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, త్రిపుర, గోవా, డామన్‌డయ్యూ, పుదుచ్చేరిలకు శాసనసభలు, మంత్రివర్గాలను ఈ సవరణ ద్వారా ఏర్పాటు చేశారు.
- **16వ సవరణ (1963):** 19, 84, 173వ ప్రకరణలను, IIIవ షెడ్యూల్‌ను సవరించారు. భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రతల సంరక్షణ కోసం, భావప్రకటనా స్వాతంత్ర్యాన్ని నియంత్రించే చట్టాలను చేసే అధికారాన్ని ఈ సవరణ ద్వారా పార్లమెంట్‌కు కల్పించారు. భారతదేశ సార్వభౌమాధికారాన్ని సమగ్రతను కాపాడుతామన్న మాటలను పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు చేయాల్సిన ప్రమాణ పత్రాన్ని ఈ సవరణ ద్వారా పొందు పర్చారు.
- **17వ సవరణ(1964):** 31A ప్రకరణను సవరించారు. IXవ షెడ్యూలుకు 21 నుంచి 64 వరకు 44 చట్టాలను చేర్చారు. భూగరిష్ఠ పరిమితి లోపల ఉన్న వ్యక్తుల సొంత వ్యవసాయ భూమిని, దాని మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించకుండా ఏ చట్టం ద్వారానైనా అలాంటి భూమిని రాష్ట్రాలు స్వాధీనం చేసుకోవడానికి వీల్లేదు. ఎస్టేట్ నిర్వచన పరిధిని పెంచారు.

> - **15వ సవరణ (1963):**124, 128, 217, 222, 224, 226, 276, 297, 311, 316 ప్రకరణలను సవరించారు. 224A ప్రకరణను చేర్చారు. VIIవ షెడ్యూల్‌ను కూడా సవరించారు. హైకోర్టు న్యాయమూర్తుల పదవీవిరమణ వయస్సు 60 నుంచి 62 ఏండ్లకు పెంచారు. హైకోర్టుకు ప్రకరణ 226 కింద ఉన్న రిట్ల (అత్యవసరాజ్ఞలు)ను జారీచేసే అధికార పరిధిని విస్తృత పరిచారు. దీని ప్రకారం ఆ న్యాయస్థానం పరిధికి వెలుపల ఉన్న ప్రభుత్వానికైనా, అధికారికైనా వాటి పరిధి (క్లాజ్ ఆఫ్ యాక్షన్)కి, చర్యకు సంబంధించినప్పుడు కూడా రిట్లను జారీచేసే అధికారాన్ని హైకోర్టుకు సంక్రమించింది. ఒక హైకోర్టు నుంచి మరో హైకోర్టుకు జడ్జీలు బదిలీ అయినప్పుడు, ఖర్చుల నిమిత్తం వారికి పరిహారం కల్పించాలి. పదవీ విరమణ చేసిన హైకోర్టు జడ్జీలను అదే కోర్టులో న్యాయమూర్తులుగా నియమించే అధికారం రాష్ట్రపతికి ఇచ్చారు. ప్రకరణ 128ని సవరించి పదవీవిరమణ చేసిన జడ్జీలను సుప్రీంకోర్టు తాత్కాలిక జడ్జీలుగా నియామకానికి అవకాశం కల్పించారు. ప్రకరణ 297కు 'కాంటినెంటల్ షెల్ఫ్' అనే పదం చేర్చారు. ప్రకరణ 311 ప్రకారం సివిల్ సర్వీసు ఉద్యోగిని రాష్ట్రపతి లేదా గవర్నర్ తమ ఇష్ట ప్రకారం బర్తరఫ్ చేయవచ్చు అన్న ప్రక్రియను ఈ సవరణ మార్చింది. దీనిప్రకారం ఉద్యోగిపై వచ్చిన ఆరోపణను సదరు ఉద్యోగికి తెలిపి, అవి నిజమో కాదో నిరూపించుకొనే అవకాశం ఇచ్చి నిజానిజాలను తెలుసుకున్న తర్వాతనే చర్య తీసుకోవాలి.

- **18వ సవరణ (1966):** 3వ ప్రకరణను సవరించారు. 3వ ప్రకరణలో రాష్ట్రం అనే మాటను పునర్ నిర్వచించారు. కొత్త రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతాన్ని ఇతర రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కొంత భాగం లేదా మొత్తం భాగానైనా చేర్చి ఏర్పాటు చేయవచ్చు. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, కేంద్రపాలిత ప్రాంతాల పునర్ నిర్మాణం కోసం ఈ సవరణ చేశారు.
- **19వ సవరణ(1966):** 324వ ప్రకరణను సవరించారు. ఈ సవరణ ద్వారా ఎన్నికల ట్రిబ్యునళ్లను రద్దు చేసి ఎన్నికల ఫిర్యాదులను పరిష్కరించే అధికారాన్ని హైకోర్టులకు అప్పగించారు.
- **20వ సవరణ (1966):** ప్రకరణ 233Aను చేర్చారు. ఈ ప్రకరణను చేర్చకముందు నియామకం పొందిన జడ్జీల తీర్పుల, నియామకం చెల్లుబాటు అవుతాయని ఈ సవరణ ద్వారా చేర్చిన 233A పేర్కొంటుంది.
- **21వ సవరణ (1967):** VIIIవ షెడ్యూల్‌ను మార్చారు. అధికార భాషల జాబితాలో 15వ భాషగా సింధీని చేర్చారు.
- **22వ సవరణ (1969):** ప్రకరణ 275ను సవరించారు. 244A, 371Bలను చేర్చారు. VIవ షెడ్యూల్ భాగం-Aలో పేర్కొన్న అస్సాం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలతో మేఘాలయ రాష్ట్రం ఏర్పరిచి, దానికి శాసనసభ, మంత్రిమండలిని ఏర్పాటు చేశారు.
- **23వ సరవణ(1969):** 330, 332, 333, 334 ప్రకరణలను సవరించారు. నాగాలాండ్‌లో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు ఎస్టీ రిజర్వేషన్లను తొలగించారు. పార్లమెంట్‌లోనూ రాష్ట్రశాసనసభల్లోనూ ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లోఇండియన్లకు సభ్యత్వ రిజర్వేషన్లను 1980 వరకు పొడిగించారు. రాష్ట్ర శాసనసభలకు ఒక ఆంగ్లో ఇండియన్‌ను మాత్రమే గవర్నర్ నామినేట్ చేయాలి.
- **24వ సవరణ (1971):** 13, 368 ప్రకరణలను సవరించారు. ప్రకరణ 13కు క్లాజు 4ను చేర్చారు. ఈ సవరణ ద్వారా రాజ్యాంగంలోని ఏ భాగానైనా సవరించే హక్కు పార్లమెంట్‌కు కల్పించారు. రాష్ట్రపతి రాజ్యాంగ సవరణ బిల్లును తప్పక ఆమోదించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా రాజ్యాంగం మీద పార్లమెంట్‌కు ఆధిక్యత లభించింది.
- **25 సవరణ (1971):** ప్రకరణ 31ని సవరించి 31Cని చేర్చారు. నష్టపరిహారం చాలినంత లేదన్న కారణంగా ఆస్తి సొంతదారుడు న్యాయస్థానానికి వెళ్లే హక్కును తొలిగించి, ప్రజాప్రయోజనం కోసం ప్రైవేటు ఆస్తిని సంక్రమింపజేసుకొనే అధికారాన్ని ప్రభుత్వానికి ఈ సవరణ ఇచ్చింది. ఆదేశసూత్రాల అమలు కోసం పార్లమెంట్ చేసే చట్టాలను వ్యక్తులు న్యాయస్థానాల్లో సవాల్ చేయకుండా ఈ సవరణ నిరోధించింది. తప్పనిసరిగా ప్రభుత్వం సంక్రమింపజేసుకొనే ప్రైవేటు ఆస్తి మీద, నష్టపరిహార నిర్ణయం మీద చట్టాలను చేసుకొనే అధికారాన్ని రాష్ట్ర శాసనసభలకు అనుమతించింది. అయితే, వాటిని రాష్ట్రపతి ఆమోదించాలి.

భారత క్షిపణి వ్యవస్థ



- క్షిపణులను నిర్దేశిత లక్ష్యాలను ఛేదించడానికి ఉపయోగిస్తారు.
- **క్షిపణి పనిచేయడంలో ఇమిడి ఉన్న సూత్రం:** న్యూటన్ మూడో గమన సూత్రం
- **న్యూటన్ మూడో గమన నియమం:** ప్రతి చర్యకు సమానమైన వ్యతిరేక చర్య ఉంటుంది.
- క్షిపణుల్లో ఉపయోగించే విస్ఫోటన పదార్థాలను వార్‌హెడ్ అంటారు. హైడ్రోజన్ బాంబులు, అణు బాంబులు, జీవ రసాయనిక బాంబులను వార్‌హెడ్లుగా ఉపయోగిస్తారు.
- **భారత క్షిపణి పితామహుడు :** ఏపీజే అబ్దుల్ కలాం
- **మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా:** ఏపీజే అబ్దుల్ కలాం
- **మిసైల్ ఉమెన్ ఆఫ్ ఇండియా:** టెస్సీ థామస్
- **దేశంలో మొదటిసారిగా ఏర్పాటు చేసిన క్షిపణి ప్రయోగ కేంద్రం:** Interim Test Range (బాలసోర్, ఒడిశా)
- **శాశ్వత క్షిపణి పరీక్ష కేంద్రం :** Intigrated Test Range (వీలార్ దీవి, ఒడిశా)

క్షిపణుల- రకాలు

- లక్ష్యాన్ని ఛేదించే విధానాన్ని బట్టి క్షిపణులు రెండు రకాలు
- 1. బాలిస్టిక్ క్షిపణి 2. క్రూయిజ్ క్షిపణి

బాలిస్టిక్ క్షిపణి

- మొదట స్వయం చోదక శక్తిని ఉపయోగించుకుని అంతరిక్షంలోకి చేరి తర్వాత భూ వాతావరణంలోకి చేరి అధిక వేగంతో లక్ష్యాలను ఛేదించే క్షిపణులు.
- బాలిస్టిక్ క్షిపణులను అవి ప్రయాణించగల పరిధిని బట్టి మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.
- హ్రస్వ శ్రేణి క్షిపణులు: ఇవి కొన్ని వందల కి.మీ.ల దూరం మాత్రమే ప్రయాణించగలవు.
- మధ్యంతర శ్రేణి క్షిపణులు: ఇవి కొన్ని వేల కి.మీ.ల దూరం ప్రయాణిస్తాయి.
- ఖండాంతర క్షిపణులు: ఇవి ఖండాలను దాటి ప్రయాణిస్తాయి.

క్రూయిజ్ క్షిపణి

- భూమికి సమాంతరంగా ప్రయాణిస్తూ, రాడార్లు గుర్తించకుండా లక్ష్యాన్ని ఛేదించే క్షిపణులు.
- క్షిపణులను ప్రయోగించే విధానాన్ని బట్టి నాలుగు రకాలుగా వర్గీకరిస్తారు.
  1. ఉపరితలం నుంచి ఉపరితలం పైకి
  2. ఉపరితలం నుంచి గగనతలంలోకి
  3. గగనతలం నుంచి గగనతలంలోకి
  4. నీటిలో నుంచి నీటిపైకి

IGMDP

- 1983లో క్షిపణుల రూపకల్పన కోసం Integrated Guided Missile Development Programme (IGMDP)ను ప్రారంభించారు. దీనికి ఏపీజే అబ్దుల్ కలాం నేతృత్వం వహించారు. 2008లో ఈ ప్రాజెక్టును పూర్తి చేశారు.
- IGMDPలో భాగంగా ఆరు క్షిపణులను రూపొందించారు.

1. అగ్ని	4. అస్త్ర
2. పృథ్వి	5. ఆకాశ్
3. త్రిశూల్	6. నాగ్

అగ్ని (ఉపరితలం నుంచి ఉపరితలం)

- అగ్ని-1 బాలిస్టిక్ క్షిపణి 700 నుంచి 1250 కి.మీ.ల లక్ష్యాన్ని ఛేదించగలదు.
- అగ్ని-2 బాలిస్టిక్ క్షిపణి 2000 నుంచి 3000 కి.మీ.ల లక్ష్యాన్ని ఛేదించగలదు.
- అగ్ని-3 బాలిస్టిక్ క్షిపణి 3500 నుంచి 5000 కి.మీ.ల లక్ష్యాన్ని ఛేదించగలదు.
- అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణి 3000 నుంచి 4000 కి.మీ.ల లక్ష్యాన్ని ఛేదించగలదు.
- అగ్ని-5 బాలిస్టిక్ క్షిపణి 5000 నుంచి 8000 కి.మీ.ల లక్ష్యాన్ని ఛేదించగలదు.
- అగ్ని-6 బాలిస్టిక్ క్షిపణి 8000 నుంచి 10000 కి.మీ.ల లక్ష్యాన్ని ఛేదించగలదు. ఇంకా అభివృద్ధి దశలో ఉంది.
- డీఆర్‌డీవో, బీడీఎల్‌లు అగ్ని క్షిపణులను తయారు చేస్తున్నాయి.
- జీపీఎస్ వ్యవస్థ గల తొలి క్షిపణి అగ్ని-2
- 2016 డిసెంబర్ 25న అగ్ని-5 క్షిపణిని ఒడిశాలోని అబ్దుల్ కలాం దీవి నుంచి పరీక్షించారు.

నాగ్ (ఉపరితలం నుంచి ఉపరితలం)

- **యుద్ధ ట్యాంకుల** విధ్వంసక క్షిపణి. దీని పరిధి 3-7 కి.మీ.లు
- **దీనిని మొదటిసారి**గా థార్ ఎడారిలో పరీక్షించారు.
- **లేజర్ కిరణాలను** ప్రసరింపజేసే శత్రు దూరాలను గుర్తించగలదు.
- **హెలికాప్టర్** నుంచి ప్రయోగించే నాగ్ క్షిపణిని HELINA (Helicopter Launched NAG) అంటారు.
- వాతావరణం సరిగ్గా లేనప్పుడు కూడా ప్రయోగించవచ్చు.

త్రిశూల్ (ఉపరితలం నుంచి గగనతలం)

- స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన క్షిపణి. దీని పరిధి 9కి.మీ.లు
- గగనతలంలో తక్కువ ఎత్తులో ఉండే లక్ష్యాలను ఛేదిస్తుంది.
- ఇది 15 కేజీల వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు.
- త్రివిధ దళాల అవసరాల కోసం నిర్దేశించింది.
- దీనిని ఎలక్ట్రానిక్ డిటోనేటర్ సహాయంతో పేలుస్తారు.

అస్త్ర (గగనతలం నుంచి గగనతలం)

- పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన మొదటి క్షిపణి. దీని పరిధి 100కి.మీ.లు
- ఇది దేశ మొదటి BVRAAM (Beyond Visual Range Air to Air Missile)
- దీని ఉపరితలంపై బక్‌మినిస్టర్ పుల్లరిన్ అనే పదార్థంతో పూత పూస్తారు. దీంతో రాడార్ల నుంచి వెలువడే రేడియో తరంగాలు వీటిని గుర్తించలేవు.
- ఈ క్షిపణులను సుఖోయ్, తేజస్ యుద్ధ విమానాల ద్వారా ప్రయోగిస్తారు.

ఆకాశ్ (ఉపరితలం నుంచి గగనతలం)

- **దీని పరిధి :** 25 నుంచి 30 కి.మీ.లు
- **దీనికి అమర్చిన రాడార్:** రాజేంద్ర
- రాజేంద్ర అనే రాడార్‌ను 'ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్' రూపొందించింది.
- **దీనిలో ఉపయోగించే సాంకేతికత:** రాంజెట్ టెక్నాలజీ

పృథ్వి (ఉపరితలం నుంచి ఉపరితలం)

- పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన మొదటి భారత క్షిపణి పృథ్వి.
- 2016 మే 18న ఒడిశాలోని చాందీపూర్ నుంచి పృథ్వి-2ను పరీక్షించారు. దీని పరిధి 250 నుంచి 350 కి.మీ.లు.
- పృథ్వి-3 పరిధి 350 నుంచి 600 కి.మీ.లు.
- **అగ్ని, పృథ్వి క్షిపణులను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తీసుకెళ్లడానికి రూపొందించిన వాహనం:** TATRA
- పృథ్వి క్షిపణులను డీఆర్‌డీవో, బీడీఎల్ సంస్థలు అభివృద్ధి చేశాయి.
- **స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన యుద్ధ ట్యాంకుల విధ్వసంక క్షిపణి :** అమోఘ-1
- **భారతదేశ తొలి ఖండాంతర క్షిపణి** సూర్య
- **జలంతర్గామి నుంచి ప్రయోగించగల మొదటి భారతీయ క్షిపణి:** శౌర్య

నిర్భయ్

- స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన మొదటి సబ్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి.
- ఈ క్షిపణిని భూఉపరితలం, గగనతలం, నీటిపై నుంచి ప్రయోగించవచ్చు. దీనిని సైనిక, వాయు, నావికా దళాల్లో ఉపయోగిస్తారు.
- ఈ క్షిపణిని డీఆర్‌డీవోకు చెందిన ఏరోనాటిక్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ సంస్థ రూపొందించింది. ఈ ప్రాజెక్ట్ డైరెక్టర్ వసంతశాస్త్రి.
- 2014 అక్టోబరు 17న ఒడిశాలోని వీలర్ దీవి నుంచి పరీక్షించారు.

బ్రహ్మోస్

- ఇది ఒక క్రూయిజ్ క్షిపణి. దీని పరిధి 290 కి.మీ.లు.
- ఈ క్షిపణిని భారత్, రష్యాలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి.
- ప్రపంచంలోనే ఏకైక స్వల్పశ్రేణి రాంజెట్ క్రూయిజ్ క్షిపణి.
- **ఈ క్షిపణులను తయారు చేసిన సంస్థ :** బ్రహ్మోస్ ఏరోస్పేస్ లిమిటెడ్ (బీఏఎల్).
- **బ్రహ్మోస్ క్షిపణి పితామహుడు :** శివథాను పిళ్లై

ప్రతిభకు పరీక్ష

1. ప్రపంచంలో తొలి ఏటీఎంను ఎప్పుడు ప్రారంభించారు?
   1) 1967, జూన్ 27
   2) 1957, జూలై 27
   3) 1967, జూలై 27
   4) 1987, జూన్ 27
2. కేవలం పురుషులకు మాత్రమే ప్రవేశానుమతి ఉన్న దీవి ఏ దేశంలో ఉంది?
   1) అమెరికా 2) జపాన్
   3) చైనా 4) సింగపూర్
3. ఇటీవల దేశంలోని ఏ నగరానికి ప్రపంచ వారసత్వ నగరంగా యునెస్కో గుర్తించింది?
   1) అహ్మదాబాద్ 2) చండీగఢ్
   3) ఢిల్లీ 4) హైదరాబాద్
4. సౌరశక్తిని ఉపయోగించుకొని నడిచే తొలి (డీజిల్, ఎలక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్) రైలును జూలై 14న రైల్వే మంత్రి సురేష్ ప్రభు ఎక్కడ ప్రారంభించారు?
   1) ఢిల్లీ 2) ముంబై
   3) బెంగళూరు 4) లక్నో
5. భారత అటార్నీ జనరల్‌గా కేకే వేణుగోపాల్ జూలై 3న బాధ్యతలను స్వీకరించారు. ఈయన ఏ రాష్ట్రానికి చెందినవారు?
   1) కర్ణాటక 2) కేరళ
   3) తమిళనాడు 4) తెలంగాణ
6. రాజ్యసభలో సభ్యుడిగా ఉండటానికి కనీస వయసు ఎంత?
   1) 25 ఏండ్లు 2) 30 ఏండ్లు
   3) 35 ఏండ్లు 4) 21 ఏండ్లు

సమాధానాలు శుక్రవారం నిపుణలో...

గత వారం ప్రశ్నలకు సమాధానాలు
1-4, 2-4, 3-2, 4-3, 5-3, 6-4


రేపే బ్రహ్మాండమైన విడుదల
VENKAT BOYANAPALLI PRESENTS
14 REELS
HANU RAGHAVAPUDI
LOVE INTELLIGENCE ENMITY
RAM ACHANTA GOPI ACHANTA ANIL SUNKARA


DR. D.RAMANAIDU PRESENTS
నేనే రాజు నేనే మంత్రి
TEJA
రేపే విడుదల
SURESH BABU KIRAN REDDY BHARATH CHOWDARY
A SURESH PRODUCTIONS (P) LTD AND BLUE PLANET ENTERTAINMENTS LLP PRODUCTION



SMT.ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
A 'DIL' RAJU PRODUCTION
SEKHAR KAMMULA'S
ఫిదా
RAJU SHIRISH
HARSHITH REDDY
VIJAY C KUMAR SHAKTHIKANTH KARTHICK MARTHAND K VENKATESH
RAJEEV NAIR BANDI RATNA KUMAR
నిజామాబాద్ జిల్లాలో చిత్రీకరణ జరుపుకొని ఘన విజయం
సాధించిన సందర్భంగా ఆగస్ట్ 13న చిత్రం యూనిట్‌తో నిజామాబాద్
పట్టణం కలెక్టర్ గ్రౌండ్స్‌లో సా॥ 6 గం॥ లకు ఫిదా సంబురాలు


కమాన్ కమాన్ కమాన్ కమాన్ కంట్రీ సిలకా
నీకూ నాకూ ఎందుకింక సిగ్గుల తడిక...
CINEMAS
BIGGEST MUSICAL HIT
From The Director of
వైశాఖం
జయ బి.
బి.ఎ. రాజు
21 వ రోజు


MIRYALA SATHYANARAYANA REDDY PRESENTS
DWARAKA CREATIONS
A BOYAPATI SREENU FILM
రేపే విడుదల
జయ జానకి నాయక
MIRYALA RAVINDER REDDY BOYAPATI SREENU
DEVI SRI PRASAD
CHITYALA SAIKUMAR REDDY
M.RATHNAM RISHI PUNJABI SAHI SURESH KOTAGIRI VENKATESWARA RAO RAM-LAXMAN PREM RAKSHITH VAMSI SHEKAR

చివరివారంలో రెండు రాష్ట్రాల సీఎస్‌ల భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధానకార్యదర్శులు ఈ నెల చివరివారంలో భేటీ కానున్నారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్న తెలంగాణ ప్రభుత్వం చొరవతో ఈ సమావేశం జరుగుతున్నట్టు సమాచారం. ఏపీలో ఉన్న తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు అక్కడ ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారిని సొంత రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చాలా కాలంగా ప్రయత్నాలు చేస్తున్నది. నాలుగోతరగతి ఉద్యోగులను సొంతరాష్ట్రానికి తీసుకురావడం, తొమ్మిది, పదోషెడ్యూల్ సంస్థల్లోని ఆస్తులు, అప్పులు ఉద్యోగుల విభజన అంశాలు, స్వచ్ఛంద బదిలీల అంశం తదితర విషయాలన్నింటినీ ఇద్దరు సీఎస్‌లు చర్చించనున్నట్టు సమాచారం. వీరిద్దరి సమావేశానికి ఏపీ పునర్వ్యవస్థీకరణ అధికారులు ఎజెండాను సిద్ధం చేస్తున్నారు.



భూ కేటాయింపు జీవోను నిర్వాహకులకు అందజేస్తున్న హోంమంత్రి నాయిని

రెడ్డి హాస్టల్‌కు పదెకరాల ప్రభుత్వ భూమి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజాబహద్దూర్ వెంకట్రామిరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న రెడ్డి హాస్టల్, పాఠశాల, వృద్ధాశ్రమం కోసం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని బుద్వేల్ సమీపంలో పదెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఇందుకు సీఎం కేసీఆర్‌కు హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. దీనికి సంబంధించిన జీవో కాపీని సొసైటీ నిర్వాహకులు డాక్టర్ వి రఘుపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్ ఇంద్రసేనారెడ్డిలకు బుధవారం నాయిని అందజేశారు.

మంత్రి హరీశ్ లేఖకు కర్ణాటక సానుకూల స్పందన

- నేడు కర్ణాటక అధికారులతో సాగర్ సీఈ భేటీ!



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణానీటి విషయంపై రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాసిన లేఖకు కర్ణాటక నుంచి సానుకూల స్పందన లభించింది. నారాయణ్‌పూర్ నుంచి దిగువ జూరాలకు కృష్ణానది నీటిని వదలాలని రాసిన లేఖ బుధవారం కర్ణాటక జలవనరుల శాఖమంత్రి ఎంబీ పాటిల్‌కు చేరింది. నల్లగొండ జిల్లాల్లో ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని నాగార్జునసాగర్‌కు కనీసం 15టీఎంసీల నీటిని వదలాలని హరీశ్‌రావు లేఖ రాసిన విషయం తెలిసిందే. నాగార్జునసాగర్ చీఫ్ ఇంజినీర్ సిరిపోరు సునీల్.. హరీశ్‌రావు రాసిన లేఖను తీసుకెళ్లి కర్ణాటక మంత్రి పాటిల్‌ను కలిశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. కర్ణాటక కృష్ణ భాగ్య జల నిగమ్ లిమిటెడ్ ఎండీ అంజుమ్ పర్వేజ్‌ను కలువాల్సిందిగా సూచించారు. సాయంత్రం పర్వేజ్‌తో సునీల్ చర్చలు జరిపారు. లేఖను ప్రభుత్వానికి పంపుతానని, ఈ దిశలో చేతనైన సాయం చేస్తామని పర్వేజ్ తెలిపారు. దీనిపై గురువారం కర్ణాటక అధికారులతో మరోసారి చర్చలు జరిపే అవకాశముంది.

మరుగుదొడ్ల నిర్మాణంలో కరీంనగర్ టాప్

- జాతీయస్థాయిలో 20వ ర్యాంకు.. కేంద్ర మంత్రిత్వశాఖ సర్వేలో వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో కరీంనగర్ జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయస్థాయిలో 20వ ర్యాంకు కైవసం చేసుకున్నది. ఇటీవల కేంద్ర ప్రభుత్వ తాగునీరు, పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ.. దేశవ్యాప్తంగా వివిధ జిల్లాలతోపాటు ఉమ్మడి కరీంనగర్‌లోని గ్రామీణ ప్రాంతాల్లోనూ సర్వే నిర్వహించింది. సర్వేలో పంచాయతీ వారీగా మరుగుదొడ్లు నిర్మించారా? నిర్మించిన వాటిని వినియోగించుకుంటున్నారా? నిధుల వినియోగంలో పారదర్శకత తదితర అంశాలపై వివరాలు సేకరించింది. కరీంనగర్ జిల్లా జాతీయస్థాయిలో 20వ ర్యాంకు పొందగా, రాజన్న సిరిసిల్ల 24, జగిత్యాల 131, పెద్దపల్లి జిల్లా 143వ ర్యాంకుల్లో నిలిచాయి. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయా జిల్లాల కలెక్టర్లను, వారి బృందాన్ని.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ అభినందించారు. కరీంనగర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో వినియోగించుకొనేలా చైతన్యపర్చేందుకు బుధవారం నుంచి 15వ తేదీ వరకు బహిరంగ మల, మూత్రవిసర్జన రహిత వారోత్సవాలు నిర్వహించనున్నట్టు కరీంనగర్ జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు.

ఆదివాసుల్ని విస్మరిస్తున్న కేంద్రం

- ఎంపీ సీతారాంనాయక్



న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఏటా ఆగస్టు 9వ తేదీన ఆదివాసీ దినోత్సవాన్ని జరుపాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించినా కేంద్ర ప్రభుత్వం మాత్రం దాన్ని విస్మరిస్తున్నదని ఎంపీ ప్రొఫెసర్ సీతారాంనాయక్ విమర్శించారు. ఐక్యరాజ్యసమితి ఆదివాసీ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించడంతో పాటు పదేండ్ల తర్వాత ఆదివాసుల అంశంపై సమీక్ష చేయాలన్న ప్రతిపాదనలపై భారతదేశం సంతకం కూడా చేసిందని ఆయన బుధవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పది కోట్ల మంది ఆదివాసులు జీవిస్తున్నారని, ఆదివాసుల భాషను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ఇన్‌స్టిట్యూట్స్‌ను, సంస్కృతి కోసం కల్చర్ అకాడమీ, సంప్రదాయ క్రీడగా ఉన్న విలువిద్య అకాడమీని స్థాపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల విద్యావసరాలకు తగిన తీరులో విద్యాసంస్థలను నెలకొల్పలేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజన భవన్ ఏర్పాటుకు ముందుకొచ్చిందని, ఎస్టీల కోసం 22 గురుకుల డిగ్రీ కళాశాలలను, 50 గురుకుల పాఠశాలలను నెలకొల్పిందని తెలిపారు.

ట్రైకార్ ద్వారా రూ.224 కోట్ల ఉపాధి రుణాలు

- సంస్థ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం గిరిజన యువత ఆర్థికప్రగతికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రభుత్వం గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడంతోపాటు ఉపాధి రుణాలను అందజేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టిందని బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాకు తెలిపారు. ట్రైకార్ ద్వారా రుణాలను అందించేందుకు రూ.224.20 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. గిరిజన తండాలు, గూడేల్లో నివాసం ఉంటున్న గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ట్రైకార్ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గుడుంబా బారిన పడకుండా గిరిజనులకు పునరావాసం కల్పించేందుకు, ప్రభుత్వం ఆర్థిక సహకార కార్యక్రమాలను అమలు చేస్తున్నదని వివరించారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను జిల్లాలవారీగా లబ్ధిదారుల ఎంపిక, పథకాల మంజూరు కోసం సెప్టెంబర్ 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం తగిన చర్యలు చేపట్టాలని ఆయా జిల్లాల కలెక్టర్లను కోరామని, అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై దృష్టిపెడుతామని వెంకటేశ్వర్లు వెల్లడించారు.

గిరిజన సంక్షేమానికి సర్కారు కృషి

- జీసీసీ చైర్మన్ మోహన్‌గాంధీ నాయక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్ మోహన్ గాంధీనాయక్ చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమశాఖ కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ఆరుశాతం ఉన్న గిరిజనుల రిజర్వేషన్లను, తొమ్మిది శాతానికి పెంచుతూ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తుచేశారు. గిరిజన సంక్షేమంపై ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చాటారని చెప్పారు. గిరిజనుల కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్ లక్ష్మణ్, ఏడీ సర్వేశ్వర్‌రెడ్డి, జీసీసీ ఆర్‌ఎం సీతారాం, గిరిజన మ్యూజియం ఇన్‌చార్జ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ వెబ్‌సైట్ ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర బార్ కౌన్సిల్ వెబ్‌సైట్‌ను ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ బుధవారం ప్రారంభించారు. న్యాయవాద వృత్తి ప్రాక్టీస్ కోసం బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న న్యాయవాదులు తమకు కావాల్సిన సమాచారం కోసం వెబ్‌సైట్ నుంచి తెలుసుకునే అవకాశం కల్పించేలా రూపకల్పన చేశారు. బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఏ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ సీ ప్రవీణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు, ఎమ్మెల్సీ ఎన్ రామచంద్రరావు, బార్‌కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

దంపతులు ఒకే దగ్గర పనిచేసేలా చర్యలు తీసుకోండి

హైదరాబాద్/ సుల్తాన్‌బజార్, నమస్తే తెలంగాణ: ఉద్యోగులైన భార్యాభర్తలు ఒకే చోట పనిచేసేలా బదిలీ చేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి రాజేశ్‌తివారీని బుధవారం కలిసి విజ్ఞప్తిచేశారు. దీనికి స్పందించిన రాజేశ్ తివారీ దంపతులకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీచేశామని చెప్పారు. అన్ని పాత జిల్లా కేంద్రాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి, ఈహెచ్‌ఎస్ సేవలను విస్తృతపరుచాలని చేసిన విజ్ఞప్తికి రాజేశ్ తివారీ సానుకూలంగా స్పందించారని రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్, కార్యనిర్వాహక కార్యదర్శి రామినేని శ్రీనివాస్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐఎల్ కార్మికులకు పథకాలు అమలు చేయాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హెచ్‌ఐఎల్ కంపెనీలోని కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను అమలుచేయాలని ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. అలాగే వారికి బీమా చేయాలని కోరారు. పటాన్‌చెరు వద్ద ఉన్న కంపెనీని ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలను ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌కు వివరించారు. ఎమ్మెల్యే వెంట జీఎం వెంకటనారాయణ ఉన్నారు.

పిల్లల ఎదుగుదలకు వినూత్న కార్యక్రమం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంపూర్ణ ఎదుగుదల కోసం మహిళా శిశు సంక్షేమశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పూర్వ ప్రాథమిక విద్యా (ప్రీస్కూల్) విధానంలో భాగంగా 3 నుంచి 5 ఏండ్ల చిన్నారుల మానసిక ఎదుగుదలను గుర్తించేందుకు 'అభివృద్ధి పుస్తకాలు' అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. దీంతో పిల్లల అభివృద్ధి ఎలాగుందనే విషయాన్ని పరిశీలించనున్నట్లు మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ తెలిపారు. ఏడాదిలో మూడు సార్లు.. జూలై చివరి వారం, డిసెంబర్, ఏప్రిల్ 2వ వారంలో పిల్లల అభివృద్ధిని పరిశీలించి కార్డులలో పొందుపరుస్తారు. పిల్లల అభివృద్ధిని పరిశీలించిన తర్వాత చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి, వారి ఎదుగుదలను తల్లిదండ్రులకు వివరిస్తారు.

సింగిల్‌గానే వస్తాం

మూడోపేజీ తరువాయి...

అనుమానం లేదు. నేను రెండుసార్లు ఉత్తంకు చాలెంజ్ చేసిన. జీహెచ్‌ఎంసీలో గెలువకపోతే రాజీనామా చేస్తాను.. నీవు చేస్తావా అని సవాలు చేశాను. నేను మంత్రిని.. ఆయన పీసీసీ ప్రెసిడెంట్. కుయ్‌లేదు.. కయ్‌లేదు. కేసీఆర్ చెప్పాల.. నువ్వేంది? అంటాడు. పాలేరు ఉప ఎన్నికల్లో నేను ఇన్‌చార్జిని. ఓడిపోతే రాజీనామా చేస్తాను.. మీరు ఓడిపోతే నువ్వు చేస్తావా? అని అక్కడకూడా చెప్పాను. టీఆర్‌ఎస్ పతనం ఇక్కడి నుంచే ప్రారంభం.. డిపాజిట్ గల్లంతుచేస్తాం.. అది చేస్తాం.. ఇదిచేస్తామని ప్రగల్బాలుపలికారు. కనీసం చాలెంజ్ కూడా స్వీకరించలేని పరిస్థితిలో ఆయనున్నాడు. నిజంగా సమర్థత ఉంటే.. బయట అనేది నిజమైతే.. నా సవాల్‌ను ఎందుకు స్వీకరించరు? ఆఖరుకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ కూడా చెప్పారు. కేసీఆర్ ఉన్నంతవరకు ఎవరూ ఏమీ చేయలేరని, ఎవరూ గెలువరని చెప్పారు. ఇంతకంటే ఏం కావాలి? టీఆర్‌ఎస్‌పై నమ్మకంతో నాయకులు వస్తుంటారు. ఫ్యామిలీ అన్న తరువాత చిన్న చిన్న గొడవలు, అభిప్రాయ భేదాలు ఉంటాయి. వాటి ప్రభావం ఏమీ ఉండదు.

బీజేపీకి అంత సీన్ లేదు..

రాష్ట్రంలో బీజేపీకి అంత సీన్ లేదు. అమిత్‌షా వచ్చి మాట్లాడితే.. ఇట్ల ఉన్న ప్రజలు ఒక్కసారిగా అట్ల అయిపోతరా! రాజకీయ పార్టీ ఎదుగాలె.. బలపడాలంటే అల్లాటప్పా కాదు. వాళ్ల సొంత ఐదు సీట్లు వాళ్లు మళ్లీ గెలిస్తే గొప్ప. వాళ్ల ప్రయత్నం వాళ్లుచేస్తారు.. మా ప్రయత్నం మేంచేస్తాం. ఫైనల్‌గా ప్రజలు నిర్ణయిస్తారు. కేంద్రం బయ్యారం, హైకోర్టు, ఐటీఐఆర్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, జీఎస్టీ, ఎయిమ్స్.. ఇలా అనేక విషయాల్లో రాష్ట్రానికి సహకరించడం లేదు. అదనంగా ఇచ్చిన పైసా లేదు. రాష్ట్రంలో ఎట్ల బలపడతారని అనుకుంటున్నారో వారికే తెలియాలి. జావదేకర్‌ను ఐఐఎం అడిగాం.. సహకరించారా? ఇక్కడ ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌ను అక్కడికి తీసుకుపోయారు. ఏడు మండలాలు తీసుకుపోయారు. ఇంకా బలపడే విషయం ఎక్కడ. సాక్ష్యం ఏది?

జీఎస్టీపై కోర్టుకెళుతాం..

పెద్ద నోట్ల రద్దు దేశానికి మంచిదంటే.. కేంద్రానికి సహకరించాం. 'ఒకే దేశం ఒకే పన్ను' విధానాన్ని ప్రధాని ప్రారంభించినప్పుడు.. ప్రప్రథమంగా తెలంగాణ రాష్ట్రమే ఆమోదం తెలిపింది. జీఎస్టీ కౌన్సిల్‌లో క్షుణ్ణంగా చర్చించి.. ప్రజాస్వామ్యబద్ధంగా నిర్ణయాలు తీసుకుంటామని మోదీ చెప్పడంతో అప్పట్లో జీఎస్టీపై అంగీకారం తెలిపాం. గ్రానైట్ అంటే సాధారణంగా భారీ పరిశ్రమలుంటాయని జీఎస్టీ కౌన్సిల్ భావించింది. మన రాష్ట్రంలో రూ.50 లక్షలనుంచి రూ.కోటి టర్నోవరుగల సంస్థలు చాలా ఉన్నాయి. ఇవి పెద్ద సంఖ్యలో స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ విషయం తెలియక గ్రానైట్ మీద 28% జీఎస్టీ విధిస్తే మేం ఒప్పుకోలేదు. బీడీలు, లిక్కర్ వంటి వాటిని అధిక జీఎస్టీ పరిధిలోకి చేర్చారు. వాస్తవానికి మన వద్ద లక్షలమంది దీనిపై ఆధారపడ్డారు. వారి మీద తీవ్ర ప్రభావం పడుతుంది. దేశంలోనే భారీస్థాయిలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపడుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రభాగాన ఉంది. తాగునీరు, సాగునీరు, రహదారుల విస్తరణ, డబుల్ బెడ్రూం ఇండ్లు వంటి ప్రాజెక్టుల్లో రూ.2 లక్షల కోట్లపైచిలుకు పనులు జరుగుతున్నాయి. వీటిపై 18% జీఎస్టీ విధిస్తే ఎలా? ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల మీద 18% విధిస్తే.. ప్రభుత్వంపై దాదాపు 19,200 కోట్ల భారం పడుతుంది. ఇప్పటికే 5% పన్ను చొప్పున ఈ పనులను అప్పగించాం. వాటిపై 18% జీఎస్టీ అంటే ఆ భారాన్ని రాష్ట్రమే భరించాల్సి ఉంటుంది. దీనిపై కాంట్రాక్టర్లు ఎవరు కోర్టుకెళ్లినా.. వారికి అనుకూలంగా తీర్పు వస్తుంది. అందుకే, ఈ విషయంలో జీఎస్టీ కౌన్సిల్



సిరిసిల్ల నుంచే పోటీ..

> రాజకీయాల్లో ఉన్నంతకాలం సిరిసిల్లనుంచే పోటీచేస్తా. విపక్షాలు అక్కడికి వెళ్లాయి. సభ పెడుతమన్నరు. అందుకోసం డబ్బు కావాలి. కానీ, కాంగ్రెస్ నాయకులకు డబ్బు తీసుకోవడంతప్ప ఖర్చుపెట్టే అలవాటు లేదు. రాజకీయ పర్యాటకులు అక్కడికి 30, 40 కార్లలో వచ్చి వెళ్లిపోయారు. ఆ తర్వాత ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది.

ముందు మన వాదనలను సమర్థంగా వినిపించాం. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్‌వంటి రాష్ట్రాలు మద్దతు పలికాయి. దీంతో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులపై జీఎస్టీని 12% చేస్తామన్నారు. అయితే, ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులపై 5% కొనసాగించాలని పట్టుబట్టాం. మన వాదనలపై సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం వెలువడుతుందని ఆశిస్తున్నా. వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేసే కార్యక్రమానికి సీఎం ఢిల్లీ వెళ్లినప్పుడు మోదీతో చర్చించే అవకాశముంది. కేంద్రం జీఎస్టీపై మెట్టు దిగకపోతే, దీనిపై కోర్టుకెళ్లే మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుంది. జీఎస్టీ ప్రభావంపై ప్రధాన కార్యదర్శి వరుసగా రెండ్రోజులు సమావేశాలు నిర్వహించారు. జీఎస్టీ ప్రభావం ప్రతి శాఖపై ఎంత? అనేది లెక్కించి నివేదిక ఇవ్వాలని ఆయా శాఖాధిపతులను సీఎస్ ఆదేశించారు. జౌళి శాఖపై 5% జీఎస్టీగా లెక్కించారు. ఒకే పన్ను ఒకే విధానం వల్ల దేశానికే రాబడి అన్నారు. కానీ.. చాలా రాష్ట్రాలు ఇబ్బంది పడుతున్నాయని తేలింది. రాజస్థాన్‌లో మార్బుల్ అతిపెద్ద పరిశ్రమ, కశ్మీర్‌లో వాల్నట్, ఆల్మండ్స్ వంటి వాటి మీద జీఎస్టీతో ప్రతికూల ప్రభావం పడుతున్నది. కేంద్రంకూడా ఆయా రాష్ట్రాల ఇబ్బందులను పరిశీలించాలి. రాజస్థాన్‌లో మార్బుల్‌పై ప్రభావం ఉంటే.. తెలంగాణలో గ్రానైట్‌పై ప్రభావం ఉంటుంది. ఎవరి బాధ వారికుంటుంది. సెప్టెంబర్ సమావేశంలోపు దీనిపై మరింత ఒత్తిడి పెంచుతాం. ప్రధాని, ఆర్థిక మంత్రితో సీఎం మాట్లాడుతారు. మిగతా రాష్ట్రాలపైనా జీఎస్టీలో కొన్ని అంశాల ప్రభావం ఉంటుంది. 'మా ఒక్కరికే ఉంటుందని అనుకుంటున్నారేమో.. మీకు కూడా దెబ్బ పడుతుంది' అని వారందరికీ అర్థమయ్యేలా చెప్పాం. 'మేముకూడా లోతుగా పరిశీలిస్తాం. అందరిపై ప్రభావం ఉంటుందని తెలంగాణ అంటున్నది. అది నిజమైతే కేంద్రం కచ్చితంగా ఆలోచించాలి' అని బీహార్ డిప్యూటీ సీఎం సుశీల్‌కుమార్ మోదీ కూడా అన్నారు. మనతో ఏకీభవించేవారు పెరిగితే.. కేంద్రం ఆలోచించక తప్పదు. కౌన్సిల్‌లో సమస్య పరిష్కారం కాకపోతే.. కోర్టుకు పోతాం. కేంద్రం అమలుచేస్తున్న అమృత్ పథకంపైనా ప్రభావం ఉంటుంది. అది కేంద్రం ఆలోచించుకోవాలి.

కేంద్రంతో దోస్తీ లేదు.. దుష్మనీ లేదు..

కేంద్రానికి మేము మిత్రులం కాదు.. శత్రువులం కాదు. తెలుగు వ్యక్తి వెంకయ్యనాయుడుకు మంచి పదవి వచ్చింది. దానికి మద్దతిచ్చాం. సీఎం కేసీఆర్ దళితుడిని రాష్ట్రపతి చేయాలన్నారు. సీఎం సూచనతో రాష్ట్రపతి అభ్యర్థిని ప్రకటించారు. అదే విషయాన్ని ప్రధాని ఫోనులో చెప్పారు. దానికి మద్దతు ప్రకటించాం. మాకు ప్రత్యేకంగా దోస్తీ లేదు.. దుష్మనీ లేదు. ప్రజలకు, దేశానికి మంచి జరుగుతుందనే అన్ని రాష్ట్రాలకంటే ముందుగా జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దుకు మద్దతిచ్చాం. మనం అన్నింట్లో నంబర్ వన్ కదా! అంశాల వారీగా చర్చించినప్పుడు లోటుపాట్లను బట్టి వ్యతిరేకించడంలోనూ, నిలదీయడంలోనూ ముందు ఉన్నాం. బీజేపీ ఎడ్డెం అంటే.. కాంగ్రెస్ తెడ్డెం అంటున్నది. మేము అలా కాదు.

పోలీసులదే బాధ్యతని తేలితే కఠిన చర్యలు

'నేరెళ్ల బాధితులను పరామర్శించాను. వాళ్లను గమనిస్తే దెబ్బలు తగిలినట్టు అనిపించింది. ఈ విషయమై డీఐజీ విచారణ చేస్తున్నారు. ఘటనలో పోలీసులదే బాధ్యత అని తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే యశోద, కేర్‌వంటి కార్పొరేట్ హాస్పిటల్స్‌లో బాధితులకు చికిత్సచేయిస్తాం. ఇందులో వెనుకడుగు లేదు. కొందరు తాత్కాలిక రాజకీయ పర్యాటకులు చెప్తున్నట్టు ఇందులో దళితకోణం, ఇసుక మాఫియా కోణం లేనే లేదు. మిడ్ మానేరులో దాదాపు రెండు కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలున్నాయి. అందులో నీరు నిండితే ఇసుక తీయడానికి కుదరదు. ఆ ఇసుక తీస్తే.. ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం వస్తుంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెండు పడక గదుల ఇండ్లు, మిషన్ భగీరథ, ఇతర నిర్మాణ కార్యకలాపాలకు ఇసుక తప్పనిసరి. మిడ్‌మానేరులో ఇసుక ఎక్కువుంది. దాన్ని తీసే క్రమంలో లారీల సంఖ్య పెరిగింది. ఒక లారీ ఢీకొట్టడంతో భూమయ్య అనే వ్యక్తి మరణించాడు. ప్రమాదానికి కారణమైన లారీ వెనుక ఐదారు లారీలు నిలిచిపోవడంతో ప్రజలంతా క్షణికావేశంలో వాటిని దహనంచేశారు. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు చిన్న జిల్లాలు కావడంతో ఎస్పీ, డీఎస్పీవంటివారంతా ఘటన స్థలానికి వెంటనే చేరుకున్నారు. తోపులాట జరిగింది. అంతవరకైతే నాకు తెలుసు. అరెస్టులు, పోలీసులు అతిగా ప్రవర్తించడంవంటివి తెలియదు. అయినా, నా నియోజకవర్గ ప్రజల మీద పోలీసులు దాడి చేస్తే నాకు వచ్చేదేంటి? నాకు నా నియోజకవర్గ ప్రజలే ముఖ్యం. అసలు అక్కడ జరిగిన సంఘటనలు స్థానిక నాయకత్వం నాకు చెప్పలేదు. ఎవరైనా చెప్పి ఉంటే, వెంటనే స్పందించేవాణ్ణి. ఆ బాధితులను జైలులోకి జైలర్ అనుమతించకపోవడంవల్ల విషయం బయటికి వచ్చింది. ఇది జరిగిన వాస్తవం. మిలియన్ మార్చ్ సందర్భంగా పోలీసులు సీఎం కేసీఆర్ మీద, నా మీద కూడా 307 సెక్షన్ కింద కేసులు పెట్టారు. ఎక్కడైనా ఘటన జరిగితే పోలీసులు స్పందించడం సహజమే. కాకపోతే, నేరెళ్లలో పోలీసులు అతిగా ప్రవర్తించారా? లేదా? అనేది డీఐజీ నివేదికద్వారా తెలుస్తుంది. పోలీసులదే తప్పు అని తేలితే, తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇసుక ఆదాయం మీద దృష్టి పెట్టామనడం సరికాదు. ప్రజల ప్రాణాలతో పోల్చితే ఈ ఇసుక ఆదాయం పెద్ద లెక్క కాదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీఎండీసీని పూర్తిస్థాయిలో ప్రక్షాళనచేశాం. అందుకే, ఇసుకద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది. ఇసుక లారీలపై జరిమానాల ద్వారానే రూ.20 కోట్లు వసూలు చేశాం. అంటే, గత పాలకులు చూపెట్టిన రూ.10.84 కోట్ల ఆదాయం కంటే.. జరిమానాల వసూళ్ల ద్వారానే అధిక రాబడి మా ప్రభుత్వానికి లభించింది.

బద్నాం చేయడానికే..

నేరెళ్లఘటనలో దళిత కోణం లేనేలేదు. అందులో ఇసుక మాఫియా హస్తమూ లేదు. అనుకోకుండా, దురదృష్టవశాత్తు జరిగిన ఈ ఘటనను కొందరు తాత్కాలిక రాజకీయ పర్యాటకులు తమ స్వార్థరాజకీయ ప్రయోజనాలకోసం వివాదం చేస్తున్నారు. నేరెళ్ల ఘటనలో నిజంగా ఇసుక మాఫియా హస్తముంటే.. ఇసుక రవాణాద్వారా మూడేండ్ల క్రితం ఉన్న రూ.10.84 కోట్ల ఆదాయం రూ.వెయ్యి కోట్లకు ఎలా పెరుగుతుంది? అసలీ రెండు విషయాల్లో ఎక్కడైనా పొంతన ఉన్నదా? ప్రభుత్వాన్ని బద్నాంచేయడానికే కొందరు రాజకీయ పర్యాటకులు ప్రయత్నించారు. ఇందులో పోలీసులను వెనకేసుకొచ్చే ఉద్దేశమేలేదు. విపక్షాలకు ప్రభుత్వంతో పోరాటం చేయడానికి ఏ అంశాలూ లేవు. పెద్దగా విషయం లేనిదాన్ని ఇష్యూగా చిత్రీకరించారు. ఇందులో దళితకోణంలేనప్పటికీ మీరాకుమార్‌ను తీసుకురావాల్సిన అవసరమేముంది? దళితులను కొట్టండని ప్రభుత్వం ప్రేరేపించిందా? దళిత ఘటనలంటే గుర్తుకొచ్చేవి చుండూరు, కారంచేడు. వాటి నెత్తుటి మరకలు కాంగ్రెస్‌పై ఉన్నాయి. అవి నిజమైన దళిత కేసులు. కాంగ్రెసోళ్లకు పనిలేదు. అందుకే బోడిగుండుకు, మోకాలికి ముడిపెడుతున్నారు. అధికారుల మీద కేసులు పెట్టడం లేదనేది కరెక్టు కాదు. జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లపై చర్యలు తీసుకోలేదా? ప్రభుత్వ ఉద్యోగులపై ఏసీబీ దాడులు నిర్వహించలేదా?

మూడు ప్రధాన ఈవెంట్లున్నాయి..

హైదరాబాద్‌లో మూడు ప్రముఖమైన ఈవెంట్లున్నాయి. ఒకటి.. నవంబర్ నెలాఖరులో గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్. అదికూడా అధికారికంగా చెప్పాల్సి ఉంది. రెండోది ఇండియన్ సైన్స్ కాంగ్రెస్. దీనిపై 12న కేంద్రమంత్రి సుజనా చౌదరితో సమావేశం ఉంది. మూడోది వచ్చే మార్చిలో వరల్డ్ కాంగ్రెస్ ఐటీ. మూడింటికీ ప్రొటోకాల్ ప్రకారం ప్రధాని రావాల్సి ఉంది. వాటిని పీఎంవో ధ్రువీకరించాల్సి ఉంది.

ప్రజలే మా కార్యకర్తలు..

టీఆర్‌ఎస్‌కు 75 లక్షల కార్యకర్తలున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సభ్యత్వం తీసుకుంటున్నారు. గతంలో స్థానిక నాయకులు, ఎమ్మెల్యేలు సభ్యత్వం చందా కట్టేవారు. టీఆర్‌ఎస్ విషయంలో అలా కాదు. ఇంత స్పందనను మేం కూడా ఊహించలేదు. మరో ముఖ్యమైన విషయం.. 75 లక్షల మంది పార్టీ సభ్యుల మొత్తం సమాచారాన్ని డిజిటలైజ్‌చేశాం. దీనివల్ల ఒక ఎస్‌ఎంఎస్ పెడితే అందరికీ చేరుతుంది. డిజిటలైజేషన్ అంటే.. మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాలవారీగా ప్రతి సభ్యుడికి సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంటుంది. ఆ డాటాను ఎలా వాడుకోవాలనేది ఒకసారి సీఎంగారితో మాట్లాడిన తరువాత నిర్ణయిస్తాం.

హరీశ్ బావకు నాకు లేశ మాత్రం మిస్ అండర్‌స్టాండింగ్ లేదు..

హరీశ్ బావకు, నాకు ఎక్కడా పొరపాటునకూడా లేశ మాత్రం మిస్ అండర్‌స్టాండింగ్ లేదు. భవిష్యత్తులోకూడా ఉండబోదు. ప్రతి విషయంలో మాకు క్లారిటీ ఉంది. మాకు బాస్ కేసీఆర్. మా ఇద్దరికంటే కేసీఆర్ చాలా ఆరోగ్యంగా ఉన్నారు. 2029 లోనూ కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నా.

అందరూ మిత్రులే..

మాకు అందరూ మిత్రులే ఎవరూ శత్రువులు లేరు. కాకపోతే రాజకీయంగా వైరుధ్యం ఉంటుంది. జానారెడ్డి, ఉత్తమ్ అన్న, భట్టి అందరూ వ్యక్తిగతంగా మిత్రులే. రాజకీయంగా ప్రత్యర్థులు అంతే. విద్యార్థి విభాగాన్ని బలోపేతం చేస్తున్నాం. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర సదస్సులు జరుగుతాయి. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కొలిక్కి వచ్చాయి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి న్యాయ నిపుణులతో చర్చించాం. సింపుల్ లెక్క.. అయితే రెగ్యులరైజ్ చేసే ప్రయత్నం చేస్తాం. కాకపోతే పేస్కేల్ అమలుచేస్తాం.

నాగోల్ నుంచి మియాపూర్ వరకు..

> మెట్రో రైలును వచ్చే జనవరి 3న ప్రారంభిస్తామని ఈనాడు పేపర్ రాసిందాంట్లో నిజం లేదు. ఈ ఏడాది నవంబర్‌లో ప్రధాని మోదీ చేతుల మీదుగా మెట్రో రైలును ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఇందుకోసం ఆయనను ఆహ్వానించాం. ఈ విషయం ఇంకా కన్ఫర్మ్ కాలేదు. మెట్రో రైలును మొదటి విడుతలో నాగోలు నుంచి మియాపూర్ దాకా ప్రారంభిస్తాం. ఇది దాదాపు 29 కిలోమీటర్ల దాకా ఉంటుంది. అందుకే, యుద్ధప్రాతిపదికన పనులుచేపడుతున్నాం. ఒలిఫెంటా బ్రిడ్జి, అమీర్‌పేట మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లించాం.


హిమాన్షు మోటర్స్ కార్యకలాపాలు ఎప్పుడో నిలిచిపోయాయి

> 2004లో అమెరికానుంచి వచ్చినతర్వాత ఎస్కార్ట్స్ కంపెనీ స్టాక్‌యార్డ్ తీసుకుని 'హిమాన్షు మోటర్స్' కంపెనీని శ్రీనివాస్‌రెడ్డితో కలిసి భాగస్వామ్య పద్ధతిలో ప్రారంభించాం. అది కూడా సిద్దిపేటలో. 2007-08దాకా లాభాల్లో నడిచింది. 2009లో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వ్యాపారంపై దృష్టిపెట్టలేదు. కంపెనీ ఉంది, కాకపోతే కార్యకలాపాలు ఏడెనిమిదేండ్ల క్రితమే నిలిచిపోయాయి. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత టయోటా వాహనాలను కొనుగోలుచేయాలంటే రెండే రెండు కంపెనీల దగ్గర తీసుకోవాలి. అది కూడా ఆ సంస్థ సూచించిన డీలర్ల వద్ద తీసుకోవాలి. అలా హర్ష టయోటా వద్ద వాహనాల్ని కొన్నాం. అది కూడా గత కాంగ్రెస్ ప్రభుత్వ నిబంధనలను అనుసరించే. అంతేతప్ప, ఇందులో హిమాన్షు మోటర్స్‌కి ఏమాత్రం సంబంధం లేదు. ట్రస్టులకు, ఎన్జీవోలకు, ఉద్యోగ సంఘాలకు రాయితీలనిచ్చిన సందర్భాలున్నాయి. ఆ క్రమంలోనే స్వర్ణభారతి ట్రస్టుకు ఆస్తి పన్ను మినహాయింపు ఇచ్చాం తప్ప, ఇందులో మరో కోణం లేనే లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ ట్రస్టు ప్రారంభోత్సవానికి వెళ్లినప్పుడు.. సంస్థచేస్తున్న పనులను వివరించి మినహాయింపును అడిగారు. దాంతో సీఎం నిర్ణయం తీసుకున్నారు.

చిన్న పిల్లగాన్ని తిడుతారా..

> రాజకీయాల్లో డీసెన్సీ అనేది ఉండాలి. నా కొడుకు (హిమాన్షు)ను కూడా అంటారా? 12 ఏండ్ల పిల్లవాడు.. వాడినికూడా తిడుతారా! అదేం పద్ధతి? నన్ను అను పడతాను. నన్ను కూడా ఇష్టం ఉన్నట్టు అంటానంటే.. నేను కూడా మొదలుపెడుతా. మనం చదువుకున్నాం. పదవుల్లో ఉన్నాం. నాలుగు కోట్ల మందికి 119 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక్కొక్కరం మూడు నాలుగు లక్షల మందికి ప్రతినిధులం. నైతికత ఉండనక్కర్లేదా? చిన్న పిల్లవాణ్ని కూడా అంటారా? అంత దిగజారి మాట్లాడటం.. అదేనా వారి సంస్కారం?

నారాయణ కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్య



శ్రావ్య(ఫైల్)

హయత్‌నగర్: ప్రముఖ ప్రైవేటు విద్యాసంస్థ నారాయణ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట నగర పంచాయతీ పరిధిలోని తట్టిఅన్నారంలో ఉన్న నారాయణ కళాశాల క్యాంపస్‌లో బుధవారం ఈ దారుణం జరిగింది. చదువు విషయంలో అధ్యాపకుల ఒత్తిడి మూలంగానే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాలు కాలేజీ ఎదుట ఆందోళనకు దిగాయి. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ గ్రామానికి చెందిన పబ్బ వెంకటేశం కూతురు శ్రావ్య(16) తట్టిఅన్నారంలోని నారాయణ కళాశాల క్యాంపస్‌లో 225 నంబర్ గదిలో ఉంటూ ఇంటర్ (బైపీసీ) మొదటి సంవత్సరం చదువుతున్నది. రాఖీ పండుగ సందర్భంగా ఇంటికి వెళ్లిన శ్రావ్య తండ్రి వెంకటేశంతో కలిసి బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు కళాశాలకు చేరుకున్నది. రిసెప్షన్‌లో తండ్రి వేచిఉండగా బ్యాగ్ పెట్టివస్తానని చెప్పి తాను ఉంటున గదిలోకి వెళ్లి శ్రావ్య చున్నీతో ఉరి వేసుకున్నది. ఏదోపడిన శబ్దం విని వార్డెన్ పరుగెత్తుకొని వెళ్లి కిటికీలో నుంచి చూడగా శ్రావ్య ఉరి వేసుకొని కనిపించింది. తలుపులు విరుగగొట్టి హుటాహుటిన ఆమెను నాగోల్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా అప్పటికే శ్రావ్య మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు పెద్దఎత్తున అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. యాజమాన్యం చదువు విషయంలో విద్యార్థులను వేధిస్తున్నదని, ఆ మానసిక ఒత్తిడికి గురై శ్రావ్య ఆత్మహత్య చేసుకున్నదని వారు ఆరోపించారు. తమ కూతురి ఆత్మహత్యకు యాజమాన్యం అనుసరిస్తున్న తీరే కారణమని మృతురాలి తండ్రి వెంకటేశం, బంధువులు ఆరోపించారు. కళాశాల వద్ద మృతదేహంతో ఆందోళన చేయాలనుకున్న తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ప్రయత్నాన్ని పోలీసులు విఫలం చేసి వారిని శాంతింపజేశారు.

కళాశాలపై చర్య తీసుకోవాలి: విద్యార్థుల పట్ల కళాశాల యాజమాన్యం అవలంబిస్తున్న విధానాల కారణంగా శ్రావ్య తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నదని బాలల హక్కుల సంఘం నేతలు అచ్యుతరావు, అనురాధా రావు ఆరోపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎలాంటి విరామం లేకుండా విద్యార్థుల పట్ల ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు అనుసరిస్తున్న తీరు వల్లే పిల్లలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

మానవబాంబు దాడి కేసులో తీర్పు నేడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పన్నెండేండ్ల క్రితం బేగంపేట టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై జరిగిన మానవ బాంబుదాడి కేసులో గురువారం నాంపల్లి క్రిమినల్ కోర్టు తీర్పు వెల్లడించనున్నది. ఈ దాడి తామే చేసినట్లు అప్పట్లో హర్కత్-ఉల్-జిహద్-ఈ-ఇస్లాం (హుజీ) ప్రకటించింది. 2005 అక్టోబర్ 12వ తేదీన జరిగిన దాడిలో మానవబాంబుగా వచ్చిన బంగ్లాదేశ్‌కు చెందిన డాలిన్ అనే ఉగ్రవాది, టాస్క్‌ఫోర్స్ హోంగార్డు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటనపై తొలుత పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ప్రభుత్వ ఆదేశాలతో సీసీఎస్‌కు బదిలీ చేసి దర్యాప్తు కోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్)ను ఏర్పాటుచేశారు. 12 ఏండ్లపాటు దర్యాప్తు చేసి.. ఈ దాడిలో 20 మంది పాత్ర ఉన్నట్టు గుర్తించారు. ఇప్పటివరకు 10 మందిని అరెస్టుచేశారు.

ఈ లెర్నింగ్ శిక్షకులకు నేడు వర్క్‌షాప్

హైదరాబాద్: రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో పనిచేసే తొమ్మిది వేల మంది ఉద్యోగులకు ఈ లెర్నింగ్ ద్వారా శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ నిర్ణయించింది. ఈ లెర్నింగ్‌లో శిక్షణ ఇచ్చే శిక్షకులకు గురువారం ఎంసీహెచ్చార్డీలో వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి ప్రారంభిస్తారని ప్రణాళికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య తెలిపారు.

నగరంలో జోరు వాన



మలక్‌పేటలో రోడ్డుపై నిలిచిన వరద నీటిని తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది



ఏకధాటి వర్షానికి ఉప్పల్‌లో భారీగా నిలిచిపోయిన వాహనాలు

- ఏకధాటి వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం
- రద్దీ ప్రాంతాల్లో తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు
- సహాయక చర్యల్లో జీహెచ్ఎంసీ సిబ్బంది
- సీసీ కెమెరాల ఇన్‌పుట్స్ ఆధారంగా చర్యలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఏకధాటిగా కురిసిన జోరు వానకు బుధవారం హైదరాబాద్ నగరం తడిసి ముద్దయింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలువడంతో రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి జనం చాలావరకు ఇండ్లకే పరిమితంకాగా, స్కూళ్లు, కార్యాలయాలకు హాజరుశాతం తగ్గింది. జీహెచ్ఎంసీ అధికారులు ఉదయం నుంచే సహాయకచర్యల్లో నిమగ్నమయ్యారు. అత్యధికంగా గోల్కొండలో 5.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

సహాయక చర్యలను పర్యవేక్షించిన కమిషనర్

బుధవారం తెల్లవారుజాము సుమారు మూడు గంటలకు ప్రారంభమైన వర్షం ఎడతెరిపిలేకుండా మధ్యాహ్నం మూడు గంటలవరకు కురిసింది. దాదాపు పన్నెండు గంటలపాటు కురిసిన వర్షంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. నాలాలు పొంగిపొర్లాయి. ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేసి ప్రజలనుంచి వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా సహాయక చర్యలు చేపట్టారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లోగల సీసీ కెమెరాల ద్వారా పోలీస్ కంట్రోల్ రూంకు వచ్చే ఇన్‌పుట్స్‌ను పరిశీలిస్తూ సహాయక సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీనికోసం సర్కిళ్లవారీగా ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి ఉదయం నుంచే అంబర్‌పేటసహా పలు ముంపు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. వర్షాలవల్ల నగరంలో స్వల్ప ఇబ్బందులు మినహా పెద్దగా సమస్యలు ఎదురుకాలేదని కమిషనర్ ప్రకటించారు. 590 మంది సిబ్బందితో కూడిన 140 ప్రత్యేక మాన్‌సూన్ యాక్షన్ టీమ్స్ క్షేత్రస్థాయిలో సహాయక చర్యల్లో నిమగ్నమైనట్టు చెప్పారు. మరో 19 సెంట్రల్ ఎమర్జెన్సీ బృందాలను సైతం సిద్ధంగా ఉంచామన్నారు. పోలీస్ కంట్రోల్ రూంకు నగరంలోని 1,385 సీసీ కెమెరాల ద్వారా వచ్చే ఇన్‌పుట్స్‌ను తమ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశామన్నారు. ఆ ఇన్‌పుట్స్ ఆధారంగా సహాయక చర్యలు నిర్వహించామన్నారు.

అత్యధికంగా గోల్కొండలో 5.7 సెంటీమీటర్ల వర్షం

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. బుధవారం సాయంత్రం 5:30 గంటల వరకు అత్యధికంగా గోల్కొండలో 5.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అంబర్‌పేట 4.8, ఆసిఫ్‌నగర్ 4.2, సరూర్‌నగర్ 4.1, బహదూర్‌పురా 3.6, సైదాబాద్ 3.5, నారాయణగూడ 3.4, నాంపల్లి 3.2, ఉప్పల్, బండ్లగూడ, మేడ్చల్ 3.1, హయత్‌నగర్ 2.4, కూకట్‌పల్లి 2, మౌలాలి, మల్కాజిగిరి 1.7, కుత్బుల్లాపూర్ 1.6, ముషీరాబాద్, ఖైరతాబాద్ 1.5, బేగంపేట 1.3, సికింద్రాబాద్, శేరిలింగంపల్లి 1.2, పటాన్‌చెరు 0.8 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. రానున్న 48 గంటల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో పలు చోట్ల భారీ వర్షాలు, కొన్ని చోట్ల సాధారణం నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల తేలికపాటి జల్లులు కురువవచ్చని బేగంపేట వాతావరణశాఖ అధికారి నాగరత్న తెలిపారు.

బండి అమ్మినోళ్లదే బాధ్యత

విక్రయదారుడే ఫారం 29, 30 అప్‌డేట్ చేయాలి.. రవాణాశాఖ సరికొత్త నిర్ణయం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వాహనం అమ్మి చేతులు దులుపుకోవాలనుకునేవారు ఇకపై జాగ్రత్తగా ఉండాల్సిందే. అమ్మినవారు ఆ వాహనం ఎవరికి అమ్మారో పూర్తి వివరాలతో సహా రవాణాశాఖకు కచ్చితంగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. త్వరలో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. సెకండ్ హ్యాండ్ వాహనాల అమ్మకాలు, కొనుగోళ్లలో యాజమాన్య హక్కుల బదిలీలో జాప్యంతో రవాణాశాఖతోపాటు, ట్రాఫిక్ పోలీసులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాంకేతిక ఇబ్బందులతోపాటు భద్రతాపరమైన సమస్యలు వస్తున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు కారకులు ఒకరైతే వేరొకరికి జరిమానా పడుతున్నది. నిబంధనల ఉల్లంఘనల్లోనూ ఇవే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. యాజమాన్య హక్కులు బదిలీకాకుండా రాష్ట్రంలో లక్షకు పైగా వాహనాలు తిరుగుతున్నట్టు సమాచారం. గ్రేటర్ పరిధిలోని కొన్ని ఆటోలకు యజమాని ఎవరో, డ్రైవర్ ఎవరో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో వాహన క్రయవిక్రయాలకు ఆధార్‌ను అనుసంధానించడంతోపాటు, వాహనాన్ని అమ్మినవారే కొనుగోలుదారుడికి సంబంధిచిన పూర్తి వివరాలను రవాణాశాఖ వెబ్‌సైట్‌లో ఫారం నంబర్ 29, 30ని అప్‌డేట్ చేయాలని అధికారులు నిర్ణయించారు. లేదంటే జరిమానా వసూలు చేయాలని రవాణాశాఖ నిర్ణయించింది. ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం వాహనం ఎప్పుడు అమ్మినా హక్కుల బదిలీ కోసం రవాణాశాఖకు వచ్చినప్పుడే ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇకపై అమ్మినతేదీ నుంచి 14 రోజుల్లోగా యాజమాన్య హక్కులు బదిలీ చేయించుకోవాల్సి ఉంటుంది. లేదంటే కారుకు రూ.500, బైక్‌కు రూ.300 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఈ విషయంలో నిర్లక్ష్యానికి తావివ్వకుండా పక్కాగా జరిమానా వసూలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పాయింట్ల విధానంపై అసత్య ప్రచారం

- సీసీ కెమెరాలతో విధించే చలాన్లకు వర్తించదు
- లైసెన్స్ ఆధారంగానే జరిమానా
- ట్రాఫిక్ పోలీసుల వెల్లడి



నాంపల్లిలో వాహనదారుల లైసెన్స్‌ల తనిఖీ(ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ట్రాఫిక్ ఉల్లంఘనలపై నూతనంగా అమలులోకి వచ్చిన పాయింట్ల విధానం వాహనం నడుపుతున్న వ్యక్తి లైసెన్స్‌పైనే ఆధారపడి ఉంటుందని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఐటీసెల్ పోలీసులు స్పష్టం చేశారు. సీసీ కెమెరాలు, కెమెరాలలో చూసి విధిస్తున్న చలాన్లతో పాయింట్ల విధానానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో సోషల్‌మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని కోరారు. మరింత అవగాహన తెచ్చేందుకు పాయింట్ల విధానం, ఈ-చలాన్ల గురించి సోషల్‌మీడియా ద్వారా ప్రచారం చేయాలని నిర్ణయించారు. ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడిన వాహనదారుడిని ట్రాఫిక్ పోలీస్ ఆపినప్పుడు మాత్రమే పాయింట్ల విధానం వర్తిస్తుందని, ఆ సమయంలోనే వాహనదారుడి లైసెన్స్ నంబర్‌పై జరిమానా పాయింట్ జమ చేస్తారని ట్రాఫిక్ ఈ-చలాన్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు స్పష్టంచేశారు. వాహన యజమానికి ఎలాంటి పాయింట్లు పడవన్నారు. కెమెరాల ఆధారంగా వేసే చలాన్లలో వాహన నంబర్‌పైనే జరిమానా పడుతుందని, ఈ తేడాను గుర్తించాలని కోరారు. రోడ్లు బాగోలేవని, సైన్‌బోర్డులు లేవని, జీబ్రా క్రాసింగ్ లేవని.. తగిన ఏర్పాట్లు చేయకుండా పాయిట్ల విధానం అమలు చేస్తున్నారంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడానికి వీటన్నింటితో సంబంధం లేదన్నారు. వాహన ప్రమాదాల్లో ఎక్కువ మంది బైక్‌పై ప్రయాణించేవారే బాధితులవుతున్నారని, కార్ల ప్రమాదాలూ పెరుగుతున్నాయని చెప్పారు. కాబట్టి హెల్మెట్, సీట్‌బెల్ట్ పెట్టుకోవడం వారికి, వారి కుటుంబానికే మంచిదన్నారు. సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్ ఇవన్నీ వ్యక్తిగతమైన తప్పిదాలేనని, వీటికి వ్యవస్థలతో పనిలేదని స్పష్టం చేశారు. రాంగ్ పార్కింగ్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు లేకపోతే ఎటువంటి పెనాల్టీ పాయింట్లు లేవని చెప్పారు. గతంలో ఎన్ని విధానాలు అమలు చేసినా పెద్దగా మార్పు రాలేదని, పెనాల్టీ పాయింట్ల విధానంతో చాలామందిలో త్వరగా మార్పు వచ్చిందని చెప్పారు. హెల్మెట్ వాడకం 90 శాతానికి పెరుగడం, ఇతర ఉల్లంఘనలు చాలా వరకు తగ్గడమే ఇందుకు నిదర్శనమన్నారు.

బ్యాంకుకు 6.5 కోట్లు టోకరా

అప్పు తీసుకొని ఎగ్గొట్టిన వ్యాపారి అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కంపెనీ పేరు చెప్పి బ్యాంకు నుంచి రూ.6.5 కోట్లు అప్పుగా తీసుకొని, తిరిగి చెల్లించకుండా మోసం చేసిన ఓ వ్యాపారిని హైదరాబాద్ సీసీఎస్ సిట్ పోలీసులు అరెస్ట్ చేసినట్టు డీసీపీ అవినాశ్ మహంతి బుధవారం తెలిపారు. పంజాగుట్టలో ఉండే మనోహర్‌లాల్ కేడియా, అతడి భార్య, అతడి సోదరుడు సుభాష్ కేడియా, సుభాష్ భార్య 'కేబీ రోలింగ్ మిల్స్' కంపెనీలో డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలో ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఫ్యాక్టరీని, అందులోని యంత్రాలను హైదరాబాద్ సోమాజిగూడలోని కొటక్ మహేంద్ర బ్యాంకులో తాకట్టుపెట్టి రూ.6.5 కోట్ల రుణం తీసుకున్నారు. ఆరు నెలల తర్వాత మనోహర్‌లాల్ కేడియా, అతని భార్య కంపెనీ నుంచి డైరెక్టర్లుగా వైదొలిగారు. ఈ విషయాన్ని బ్యాంకుకు చెప్పలేదు. కంపెనీలో ఉన్న సామగ్రి, యంత్రాలన్నింటినీ విక్రయించి, కంపెనీని మూసేశారు. పథకం ప్రకారం అప్పు ఎగ్గొట్టేందుకు తాకట్టుపెట్టిన యంత్రాలను విక్రయించి, మోసం చేశారంటూ కొటక్ మహేంద్ర బ్యాంకు అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ ఇక్బాల్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ హరికుమార్‌యాదవ్ నేతృత్వంలోని సిట్ బృందం దర్యాప్తు చేపట్టింది. మనోహర్‌లాల్ కుటుంబ సభ్యులు పథకం ప్రకారం బ్యాంకును మోసం చేసినట్టు తేలింది. దీంతో మనోహర్‌లాల్ కేడియాను అరెస్ట్ చేశారు.

మూడుచింతలపల్లికి నిధులు మంజూరు

అభివృద్ధి పనులకు రూ.28.72 కోట్లు విడుదల

మేడ్చల్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ప్రజలు కోరిన నిధుల కంటే రెండు రెట్లు అదనంగా కేవలం 24 గంటల్లోపే నిధులను మంజూరు చేసి సీఎం కేసీఆర్ పల్లె ప్రజలపై తనకున్న మమకారాన్ని మరోమారు చాటుకున్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని మూడుచింతలపల్లిలో ఈ నెల 8వ తేదీన నిర్వహించిన గ్రామసభలో సీఎం పాల్గొని ఆ గ్రామ ప్రజలపై వరాల జల్లు కురిపించారు. గ్రామంలోని సమస్యల పరిష్కారానికి రూ.10 కోట్ల మేర నిధులివ్వాలంటూ సర్పంచ్ పద్మ కలెక్టర్ ఎంవీ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కు వినతి పత్రం సమర్పించారు. దీంతో మూడుచింతలపల్లిని రాష్ట్రంలోనే ఒక మోడల్ గ్రామంగా అభివృద్ధి చేయాలని, అందుకు అవసరమైన నిధులను రేపటి వరకు మంజూరు చేస్తానని మంగళవారం నిర్వహించిన సభలో సీఎం ప్రకటించారు. ఈ మేరకు మూడుచింతలపల్లి గ్రామానికి ప్రభుత్వ ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి రూ.28.72 కోట్లను విడుదల చేస్తూ అధికారులు బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కేశవరం, లక్ష్మాపూర్, మూడుచింతలపల్లిలోని గ్యాప్ వర్కుల పూర్తికి, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం జిల్లా కలెక్టర్‌కు అదనంగా రూ.5 కోట్లను మంజూరు చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఈ నిధులు వెచ్చించాలని స్పష్టంచేశారు. ఇప్పటికే ఈ నెల 5వ తేదీన లక్ష్మాపూర్‌కు రూ.15.5 కోట్లు, కేశవరానికి రూ.12.25 కోట్లను స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి విడుదల చేసిన సంగతి తెలిసిందే. నిధుల మంజూరుపై గ్రామస్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గణేష్ మండపాలకు క్యూఆర్ కోడ్

అనుమతి నుంచి నిమజ్జనం వరకు నిర్వహణ అంతా కోడ్‌తోనే

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: భాగ్యనగరంలో ఏర్పాటు చేయనున్న వినాయక మండపాలకు పోలీసులు క్యూఆర్ (క్విక్ రెస్పాన్స్ కోడ్)ను కేటాయించనున్నారు. సిటీ పోలీసులు మొట్టమొదటిసారి ఈ టెక్నాలజీని ఉపయోగించి నిర్వాహకులకు అనుమతులు, మండపాల తనిఖీలు, విగ్రహాల నిమజ్జనం వంటివన్నీ నిర్వహించనున్నారు. ముందుగా నిర్వాహకులు ఈ నెల16వ తేదీ లోగా హైదరాబాద్ పోలీస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తును నింపి అప్‌లోడ్ చేయాలి. వెంటనే క్యూఆర్ కోడ్ జనరేట్ అవుతుంది. ఈ ఫారాన్ని ప్రింట్ తీసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇస్తే పరిశీలించి, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి మండపాల ఏర్పాటుకు అనుమతులు జారీ చేస్తారు. క్యూఆర్‌తో కూడిన క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను మండపంలో అతికించాల్సి ఉంటుంది. గణేష్ మండపాల దరఖాస్తు ఫారాల వివరాలన్నింటినీ హైదరాబాద్ కాప్స్ మొబైల్ అప్లికేషన్‌కు అనుసంధానం చేస్తారు. ప్రతి రోజు సెక్టార్ పోలీస్ ఎస్సై, పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది మండపాలకు వెళ్లినప్పుడు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తారు. దీంతో సిబ్బంది ఏ సమయంలో, ఏ మండపం దగ్గరికి వెళ్లారో మొబైల్ యాప్‌లో రికార్డవుతుంది. నిమజ్జన సమయంలోనూ క్యూఆర్ కోడ్‌తోనే మండపం నుంచి విగ్రహం ఎప్పుడు తరలివెళ్లింది, ఎప్పుడు నిమజ్జనమైంది వంటి వివరాలు రికార్డవుతాయి.



హుస్సేన్‌సాగర్ తీరంలోని సంజీవయ్యపార్క్‌లో ఏర్పాటు చేసిన 290 అడుగుల ఎత్తయిన భారీ జాతీయ జెండాకు హెచ్ఎండీఏ అధికారులు సరికొత్త సొబగులను అద్దారు. రూ.48 లక్షలతో జెండా చుట్టూ 30 మీటర్ల మేర సుందరీకరణ పనులు చేపట్టారు. జెండా చుట్టూ రెయిలింగ్, ప్రత్యేక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేశారు. ల్యాండ్ స్కేపింగ్ చేసి పంచ్చందాలు అద్దారు. సుందరీకరణ పనులు 95 శాతం పూర్తయ్యాయని, రెండు రోజుల్లో పెండింగ్ పనులు పూర్తి చేసి పంద్రాగస్టున మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఇంజినీరింగ్ అధికారులు చెప్తున్నారు.

– హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ

సెన్సెక్స్
31,798
216

నిఫ్టీ
9,908
70

బంగారం ధరలు

ముంబై

24 క్యారెట్లు	28,730
22 క్యారెట్లు	28,580
వెండి (కిలో)	37,875

ముడి చమురు (బ్రెంట్)
52.41

విజయ్‌పత్‌కు ఆర్థిక కష్టాలు!



ముంబై, ఆగస్టు 9: రెండు దశాబ్దాలుగా దేశీయ వస్త్ర వ్యాపారంలో తనదైన ముద్ర వేసిన విజయ్‌పత్ సింఘానియా ప్రస్తుతం కటిక దారిద్ర్యాన్ని ఎదుర్కొంటున్నారు. దేశీయ కుబేరుల్లో ఒకడిగా వెలుగొందిన 78 ఏండ్ల రేమండ్ లిమిటెడ్ అధినేత సింఘానియా తన కుమారుడు ఇచ్చిన షాక్‌తో ప్రస్తుతం దక్షిణ ముంబైలోని కిరాయి ఇంట్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. తన కుమారుడు గౌతమ్ సింఘానియాకు కంపెనీ పగ్గాలు అప్పగించిన తర్వాత తనను పట్టించుకోవడం లేదని తొలిసారిగా బహిరంగంగా ఆయన విమర్శలు గుప్పించారు. ముంబైలోని మలబార్ హిల్స్‌లో ఉన్న 36 అంతస్థుల జేకే హౌస్‌ను తనకు స్వాధీనం చేయాలని కోరుతూ రెండు రోజుల క్రితం బాంబే హైకోర్టులో విజయ్‌పత్ పిటిషన్‌ను దాఖలు చేశారు. సింఘానియా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని అతని తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది డైనార్ మడోన్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. తనకు సంక్రమించిన దాదాపు రూ.1,000 కోట్ల విలువైన ఆస్తిని డాక్టర్ సింఘానియా.. గౌతమ్‌కు కట్టబెట్టాడని, ఇప్పుడు అతను తండ్రిని తప్పించుకుని తిరుగుతున్నాడని మడోన్ వెల్లడించారు. కారు, డ్రైవర్‌ను తీసేసి తండ్రిని బందీని చేయాలని చూస్తున్నాడని న్యాయవాది ఆరోపించారు. ఈ నేపథ్యంలో జేకే హౌస్‌లోని 27, 28వ అంతస్థు హక్కులను ఎవరికీ కట్టబెట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అలాగే తన క్లయింట్‌కు నెలకు రూ. 7 లక్షలు ఇవ్వడంతో పాటు కంపెనీ ఖర్చులతో ప్రత్యామ్నాయ వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. మరోవైపు ఈ పిటిషన్‌తో గౌతమ్‌కు సంబంధం లేదని రేమండ్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది జానక్ ద్వారకా దాస్, విరాగ్ తుల్జాపుర్కర్ చెప్పారు.

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.02	67.28
ఆస్ట్రేలియా డాలర్	45.67	52.85
బహ్రెయిన్ దినార్	157.23	180.08
యూరో	68.08	78.96
జపాన్ యెన్/100	52.81	61.23
కువైట్ దినార్	174.60	217.49
ఒమన్ రియాల్	153.85	176.06
సౌదీ రియాల్	15.43	18.29
సింగపూర్ డాలర్	42.53	50.39
స్టెర్లింగ్ పౌండ్	75.30	87.36
యూఏఈ దిర్హామ్	15.79	18.46

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్‌ఎల్‌ఎఫ్‌పి
హైదరాబాద్	330-00	330-00
రంగారెడ్డి	330-00	330-00
మెదక్	330-00	330-00
కరీంనగర్	332-00	---
వరంగల్	332-00	---
రిటైల్ ప్రైస్	3-95	3-95

చికెన్ ధరలు

ఫారం ధర	77.00
రిటైల్ లైవ్	91.00
డ్రెస్డ్	127.00
స్కిన్‌లెస్	150.00

నేటినుంచి జీఎస్టీ వే-బిల్లులు

రాష్ట్రంలో సరుకుల రవాణాకు ఇక ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు

అధికారికంగా నోటిఫికేషన్ జారీ

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రం నుంచి సరుకుల రవాణా అనుమతి కోసం బుధవారం తెలంగాణ వాణిజ్యపన్నుల శాఖ జీఎస్టీ వే-బిల్లుల నోటిఫికేషన్‌ను జారీచేసింది. రాష్ట్రంలో జీఎస్టీ కింద రిజిస్టరై ఉన్న డీలర్లు, ట్రేడర్లు ఇకపై ఆన్‌లైన్‌లో వే-బిల్లులను పొందవచ్చని అధికారులు వెల్లడించారు. జీఎస్టీ చట్టం అమలులోకి వచ్చి నెల గడిచినా కేంద్ర ప్రభుత్వం వే-బిల్లుల మార్గదర్శకాలను జారీ చేయకపోవడంతో తెలంగాణ సర్కార్ ఆన్‌లైన్‌లో వే-బిల్లులను నిక్షిప్తం చేసింది. జీఎస్టీ కింద నమోదైన డీలర్లు, ట్రేడర్లు గురువారం నుంచి వాణిజ్యపన్నుల శాఖ వెబ్‌సైట్ పోర్టల్ www.tgct.gov.in/gst way bill నుంచి వే-బిల్లు తీసుకోవచ్చు. ఒకే రాష్ట్రంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సరుకులు, వస్తువులు రవాణా చేస్తే సంబంధిత డీలర్.. సెంట్రల్ జీఎస్టీ(సీజీఎస్టీ), స్టేట్ జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) వే-బిల్లులను తీసుకోవాల్సి ఉంటుంది. ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తే ఇంటర్ స్టేట్ జీఎస్టీ (ఐజీఎస్టీ) వే-బిల్లు తీసుకోవాలి. వే-బిల్లులో ఏ సరుకును ఎంత పరిమాణంలో ఎక్కడికి తరలిస్తున్నారనే వివరాలుంటాయి. వీటిని ఆన్‌లైన్‌లో వే-బిల్లు దరఖాస్తులో పేర్కొన్న తర్వాతే అది జనరేట్ అవుతుంది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక.. గతంలో ఉన్న విలువ ఆధారిత పన్ను (వ్యాట్) వే-బిల్లులు రద్దయ్యాయి. అటు కేంద్ర ప్రభుత్వం వే-బిల్లులను డిజైన్‌చేయక, ఇటు రాష్ట్ర ప్రభుత్వం వే-బిల్లులను జారీచేయక నెలనుంచి గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఇదే అదనుగా జీఎస్టీ రేటును తగ్గించుకోవడానికి కొంతమంది వ్యాపారులు జూలైలో అమ్మిన సరుకులను జూన్‌లో అమ్మినట్టు రికార్డుల్లో చూపుతున్నట్టు సమాచారం. వీటి నివారణకు ఈ-వే బిల్లులను జారీ చేయాలని రాష్ట్ర అధికారులు నిర్ణయించారు. మార్గదర్శకాలను రెవెన్యూ (వాణిజ్యపన్నుల, ఆబ్కారీ) శాఖ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ రూపొందించారు. అక్టోబర్ వరకు కేంద్రం.. జీఎస్టీ వే-బిల్లులను జారీచేసే పరిస్థితి లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే వీటిని రూపొందించి జీఎస్టీ నెట్‌వర్క్‌కు లింక్ చేసింది. రిజిస్టర్డ్ డీలర్లు తెలంగాణ గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ యాక్ట్ 138వ నిబంధన కింద ఆన్‌లైన్ వే-బిల్లును పొందాల్సి ఉంటుంది. సహేతుకమైన కారణం చూపి 24గంటల్లోగా వే-బిల్లును రద్దు చేసుకోవచ్చు. అంతకంటే సమయం దాటితే బిల్లు రద్దుకాదు.



లెనోవో నుంచి కే8 నోట్

ప్రారంభ ధర రూ.12,999

న్యూఢిల్లీ, ఆగస్టు 9: చైనాకు చెందిన టెక్నాలజీ సంస్థ లెనోవో..దేశీయ మార్కెట్లోకి కే8 నోట్ స్మార్ట్‌ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఫోన్ ప్రారంభ ధరను రూ.12,999గా నిర్ణయించింది. ఈ నెల 18 నుంచి అమెజాన్‌లో ఈ ఫోన్లు లభించనున్నాయి. 3జీబీ ర్యామ్, 32 జీబీ మెమొరీ కలిగిన మొబైల్ ధరను రూ.12,999గాను, 4జీబీ ర్యామ్, 64జీబీ ఇంటర్నల్ మెమొరీ కలిగిన డివైజ్‌ను రూ.13,999కి లభిస్తున్నది. 5.5 అంగుళాల టచ్‌స్క్రీన్ కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్లో 2.3 గిగాహెడ్జ్ 10-కోర్ ప్రాసెసర్, 13 మెగాపిక్సెల్+5 మెగాపిక్సెల్ డ్యూయల్ రియర్ కెమెరా, ముందుభాగంలో 13 మెగాపిక్సెల్ కెమెరా, 4000 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్స్ ఉన్నాయి.

పానసోనిక్ రెండు స్మార్ట్‌ఫోన్లు

గరిష్ఠ ధర రూ.12,790

న్యూఢిల్లీ, ఆగస్టు 9: భారత్‌లోఅత్యంత వేగంగా వృద్ధిని నమోదు చేసుకుంటున్న మొబైల్ మార్కెట్‌పై జపాన్‌కు చెందిన టెక్నాలజీ సంస్థ పానసోనిక్ ప్రత్యేక దృష్టి సారించింది. దేశీయ మార్కెట్లోకి రెండు రకాల స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. వీటిలో రూ.11,290 ధర కలిగిన ఏ3, రూ.12,790 విలువైన ఏ3 ప్రోలు ఉన్నాయి. 5.2 అంగుళాల టచ్‌స్క్రీన్ కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్లో 1.25 గిగాహెడ్జ్ క్వాడ్-కోర్ మీడియా టెక్ ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 7.0 నౌగట్ ఆపరేటింగ్ సిస్టమ్, 3జీబీ ర్యామ్, 16జీబీ ఇంటర్నల్ మెమొరీ(128 జీబీ వరకు పెంచుకోవచ్చును), 4000 ఎంఏహెచ్ బ్యాటరీ, 13 మెగాపిక్సెల్ రియర్, ముందుభాగంలో 8 మెగాపిక్సెల్ కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ స్మార్ట్‌ఫోన్లకు మార్కెట్లో మరింత ప్రచారం కల్పించడానికి బాలీవుడ్ నటి తాప్సీని ప్రచారకర్తగా నియమించుకుంది. ఈ సందర్భంగా పానసోనిక్ ఇండియా బిజినెస్ హెడ్ మొబిలిటీ డివిజన్ పంకజ్ రాణా మాట్లాడుతూ..ప్రస్తుత సంవత్సరంలో దేశవ్యాప్తంగా మొబైళ్లను విక్రయించడం ద్వారా రూ.2 వేల కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గతేడాది స్మార్ట్‌ఫోన్లను విక్రయించడంతో సంస్థకు రూ.1,400 కోట్ల ఆదాయం సమకూరింది. స్మార్ట్‌ఫోన్ల పరిధిని మరింత పెంచడానికి ఈ ఏడాది రూ.6 వేల నుంచి రూ.20 వేల లోపు ధర కలిగిన 28 రకాల ఫోన్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయాలనుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. వీటిలో 20 ఆఫ్‌లైన్ మార్కెట్లో లభించనుండగా, మిగతా ఎనిమిది కేవలం ఆన్‌లైన్‌లలో లభించనున్నాయన్నారు. ప్రపంచ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో అత్యధికంగా వృద్ధిని నమోదు చేసుకుంటున్న భారత్‌లో డాటా వినిమయం భారీగా పుంజుకుందని, ఫీచర్ ఫోన్లు వాడేవారు స్మార్ట్‌ఫోన్లకు బదిలీ కావడంతో కంపెనీకి కలిసిరానున్నదన్నారు. మార్కెట్ వాటాను పెంచుకోవాలనుకోవడం లేదు..బ్రాండ్‌ను మరింత బలోపేతం చేయడానికి, కొనుగోలుదారులకు నాణ్యమైన ఉత్పత్తిని అందించాలనుకుంటున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.



పానసోనిక్ స్మార్ట్ ఫోన్లను మార్కెట్లోకి విడుదల చేస్తున్న సినీ నటి తాప్సీ

జీఎస్టీ ప్రభావమెంత?

శాఖలవారీగా సమావేశాలు పెట్టండి

అధికారులతో సమీక్షలో సీఎస్ ఎస్పీసింగ్



హైదరాబాద్,నమస్తే తెలంగాణ: జీఎస్టీ ప్రభావంతో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమానికి ఆటంకం కలుగకూడదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ అన్నారు. శాఖలవారీగా సమావేశాలు నిర్వహించాలని, ఇంజినీరింగ్ విభాగం అధిపతులతో ప్రత్యేకంగా చర్చించాలని, వర్కింగ్ ఏజెన్సీలతో సమావేశాలు పెట్టి అదనపు పన్ను విషయంలో భరోసా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో పలుశాఖల ఉన్నతాధికారులతో వివిధ పనుల మీద జీఎస్టీ ప్రభావంపై సీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సింగ్ మాట్లాడుతూ.. 'వ్యాట్ 5శాతం ఉన్నప్పుడు రాష్ట్రంలో కీలకమైన మిషన్ భగీరథ, విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, మిషన్‌కాకతీయ, డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణం, రహదారుల నిర్మాణం, మెట్రో రైల్ తదితర పనుల ప్రాజెక్టు రిపోర్టులు రూపొందించి, టెండర్లు ఫైనల్ చేయడం ద్వారా వర్కింగ్ ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. ఈ కీలకమైన పనులపై జీఎస్టీ 18శాతం విధిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా సీఎం కే చంద్రశేఖర్‌రావు చేసిన కృషి ఫలితంగా దీన్ని 12శాతానికి తగ్గించారు. ఈ పన్ను జూలై 1 నుంచి విధిస్తున్నారు. పనులు ఆగకుండా కొనసాగడానికి 5శాతం పన్నును రాష్ట్ర ప్రభుత్వం భరించాలన్న అభిప్రాయంతో ఉన్నదని, ఈ విషయాన్ని వర్కింగ్ ఏజెన్సీలకు తెలియజేసి, పనుల వేగం తగ్గకుండా చేయాలన్నారు. ప్రాజెక్టులన్నీ నిర్ణీత సమయంలోగా పూర్తి కావాల్సిందేనని సీఎస్ స్పష్టంచేశారు. సీఎం ఆదేశాల మేరకు సమావేశం నిర్వహిస్తున్నానన్నారు. నిర్మాణంలోని ముఖ్యమైన ప్రాజెక్టులపై పడే జీఎస్టీ ప్రభావం ఎంత ఉంటుందనేది అంచనా వేయాలని, జీఎస్టీశాఖ వివరణాత్మక మార్గదర్శకాలను విడుదల చేయాలని ఆదేశించారు. ప్రతినెలా 10లోగా ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖలు జీఎస్టీ ప్రభావంపై అవసరమైతే కేస్ స్టడీలు చేయాలని, ఇతర రాష్ట్రాల్లో ఎలా అమలవుతుందో పరిశీలించాలని, జీఎస్టీపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. వ్యాట్ అమలులో ఉన్నప్పుడు రూ.7.5 లక్షల టర్నోవర్ ఉన్న వ్యాపారులు, సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే నిబంధన ఉండేదని, ఇదికూడా తప్పనిసరి కాదన్నారు. కానీ జీఎస్టీలో రూ.20 లక్షల టర్నోవర్ ఉన్న సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందేనని చెప్పారు.

టాప్‌గేర్‌లో టాటామోటార్స్

క్యూ1లో 42 శాతం పెరిగిన లాభం

న్యూఢిల్లీ, ఆగస్టు 9: దేశీయ ఆటోమొబైల్ సంస్థ టాటా మోటార్స్ ఆర్థిక ఫలితాలు టాప్‌గేర్‌లో దూసుకుపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.3,199.93 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు సంస్థ ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.2,260.3 కోట్ల కన్సాలిడేటెడ్ లాభంతో పోలిస్తే 41.54 శాతం వృద్ధి నమోదైంది. టాటా మోటార్స్‌కు చెందిన లగ్జరీ కార్ల సంస్థ జేఎల్‌ఆర్ పెన్షన్ ప్రణాళికను మార్చడంతో సంస్థకు ఒకేసారి భారీ స్థాయిలో నిధుల సమకూరడం లాభాల్లో భారీ వృద్ధిని నమోదవడానికి దోహదపడినట్లు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. సమీక్ష కాలంలో కంపెనీ రూ.59,818.22 కోట్ల నిర్వహణ ఆదాయాన్ని ఆర్జించింది. 2016-17 సంవత్సరం ఇదే కాలానికి నమోదైన రూ.66,165.89 కోట్ల ఆదాయంతో పోలిస్తే 9.59 శాతం క్షీణించింది. జేఎల్‌ఆర్ పెన్షన్ ప్రణాళికను పూర్తిస్థాయిలో మార్చడంతో సంస్థకు ఒకేసారి రూ.3,609 కోట్లు (437 మిలియన్ పౌండ్లు) సమకూరినట్లు వెల్లడించింది. విక్రయాల విషయానికి వస్తే ఏడాది ప్రాతిపదికన 11.8 శాతం క్షీణించి 1,11,860 యూనిట్లకు పడిపోయాయి. దేశీయ మార్కెట్లో మధ్య, హెవీ కమర్షియల్ వాహన విక్రయాలు మందగించాయని, లైట్ కమర్షియల్, ప్యాసింజర్ వాహన విక్రయాలు వృద్ధి బాట పట్టాయని టాటా మోటార్స్ ఎండీ, సీఈవో గ్యూంటర్ బట్స్‌చెక్ తెలిపారు. తొలి త్రైమాసిక ఫలితాలు అంచనాకు చేరుకోలేకపోయామని, పనితీరును మెరుగుపరచడానికి కృషి చేస్తున్నట్లు, అలాగే కమర్షియల్, ప్యాసింజర్ సెగ్మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన చెప్పారు. ఏకీకృత విషయానికి వస్తే తొలి త్రైమాసికంలో రూ.10,375.32 కోట్ల ఆదాయంపై రూ.467.05 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకుంది. జేఎల్‌ఆర్ 560 కోట్ల పౌండ్ల ఆదాయంపై 595 మిలియన్ పౌండ్ల నికర లాభాన్ని ఆర్జించింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర 3.17 శాతం క్షీణించి రూ.416.75 వద్ద స్థిరపడింది.

ఎన్‌హెచ్‌పీసీ లాభం 862 కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: మినీ రత్నా హోదా కలిగిన ప్రభుత్వరంగ సంస్థ ఎన్‌హెచ్‌పీసీ నిరాశాజనక ఫలితాలను నమోదు చేసుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను నికర లాభం ఏడాది ప్రాతిపదికన 0.56 శాతం మాత్రమే పెరిగి రూ.862.66 కోట్లు ఆర్జించినట్లు ప్రకటించింది. 2016-17 ఏడాది ఇదే కాలానికి లాభం రూ.857.82 కోట్లుగా ఉంది. ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో రూ.2,432.77 కోట్ల ఆదాయాన్ని గడించినట్లు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. నిర్వహణ ఖర్చులు రూ.1,453.74 కోట్ల స్థాయి నుంచి రూ.1,535.72 కోట్లకు పెరిగినట్లు వెల్లడించింది. కంపెనీ వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం మేరకు 4,290 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు విద్యుత్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నది. వీటిలో 1,000 మెగావాట్ల హైడ్రో పవర్ ప్లాంట్ కూడా ఉన్నది. మరోవైపు 7,151 మెగావాట్ల కెపాసిటీ కలిగిన 10 ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి పర్యావరణ, ఇతర అనుమతులకోసం వేచి చూస్తున్నది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర 1.44 శాతం తగ్గి రూ.30.75 వద్ద స్థిరపడింది.

లాభాల్లోకి బ్యాంక్ ఆఫ్ ఇండియా

క్యూ1లో రూ.88 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: ప్రభుత్వానికి చెందిన ఆర్థిక సేవల సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో రూ.87.71 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు బ్యాంక్ ప్రకటించింది. మొండి బకాయిలు తగ్గముఖం పట్టడం వల్లనే లాభాల్లోకి రావడానికి దోహదపడినట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో బ్యాంక్ రూ.741.36 కోట్ల నష్టాన్ని చవిచూసింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలోనూ రూ.1,045.54 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ మధ్యకాలానికి బ్యాంక్ రూ.11,106.61 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. సమీక్షకాలంలో స్థూల నిరర్థక ఆస్తుల విలువ 13.05 శాతానికి తగ్గినట్లు బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. అలాగే నికర ఎన్‌పీఏ 7.78 శాతం నుంచి 6.70 శాతానికి తగ్గినట్లు పేర్కొంది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.2,245.28 కోట్ల స్థాయిలో నిధులను కేటాయించింది. 2016-17 సంవత్సరం ఇదే కాలానికి కేటాయించిన రూ.2,770.19 కోట్లతో పోలిస్తే భారీగా తగ్గాయి. నిరర్థక ఆస్తులను తగ్గించుకోవాలని రిజర్వు బ్యాంక్ సూచనలమేరకు రూ.915 కోట్ల నిధులను అదనంగా కేటాయించాల్సి వచ్చిందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. ఆశాజనక ఫలితాలు ప్రకటించడంలో కంపెనీ షేరు ధర భారీగా పుంజుకున్నది. ఇంట్రాడేలో 7 శాతానికి పైగా లాభపడిన షేరు ధర చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 3.77 శాతం లాభంతో రూ.158.45 వద్ద స్థిరపడింది.

అరబిందో లాభంలో క్షీణత

హైదరాబాద్, ఆగస్టు 9: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధాల తయారీ సంస్థ అరబిందో ఫార్మా నిరాశాజనక ఫలితాలను ప్రకటించింది. గడిచిన త్రైమాసికానికిగాను రూ.518.33 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. 2016-17 ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.584.90 కోట్లతో పోలిస్తే 11.38 శాతం క్షీణత కనబడింది. సమీక్షకాలంలో కంపెనీ విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 2.25 శాతం క్షీణించి రూ.3,621.07 కోట్లకు పరిమితమయ్యాయి. ఈ సందర్భంగా అరబిందో ఫార్మా ఎండీ ఎన్ గోవిందరాజన్ మాట్లాడుతూ..సంక్లిష్ట ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా మిశ్రమ ఔషధాలను తయారు చేయడానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. గతంలో విడుదల చేసిన ఉత్పత్తులను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గడిచిన త్రైమాసికంలో నిర్వహణ ఖర్చులు రూ.3,004.03 కోట్లుగా నమోదయ్యాయన్నారు. అమెరికాలో కంపెనీ ఔషధాలను విక్రయించడం ద్వారా సంస్థకు రూ.1,694.90 కోట్ల నిధులు సమకూరాయి. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర 5.84 శాతం క్షీణించి రూ.684.15 వద్ద స్థిరపడింది.

ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 19% వృద్ధి

న్యూఢిల్లీ, ఆగస్టు 9: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఏడాది ప్రాతిపదికన 19.1 శాతం పెరిగి రూ.1.90 లక్షల కోట్లకు చేరుకున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2017-18లో లక్ష్యంగా పెట్టుకున్న రూ.9.80 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 19.5 శాతం మేర వసూలయ్యాయి. వ్యక్తిగత ఆదాయ, కార్పొరేట్ పన్ను వసూళ్లలో నిలకడైన వృద్ధి నమోదైందని తెలిపింది. 2016-17 ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో(ఏప్రిల్-జూలై) ప్రత్యక్ష పన్ను వసూళ్లు 24.01 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

షెల్ ట్యాగ్‌పై శాట్‌ను ఆశ్రయించిన జే కుమార్, పార్శ్వనాథ్

ముంబై, ఆగస్టు 9: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి 'సెబీ'.. షెల్ కంపెనీల ట్యాగ్ విధించడానికి వ్యతిరేకంగా జేకుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, పార్శ్వనాథ్ డెవలపర్స్‌లు సెక్యూరిటీస్‌లు అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను (శాట్) ఆశ్రయించాయి. ఈ ఉత్తుత్తి 331 అనుమానిత లిస్టెడ్ షెల్ కంపెనీల జాబితాలో మిగతా సంస్థలు కూడా శాట్‌ను ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ట్రేడింగ్‌పై నిషేధం విధించడంపై స్టే విధించాలని ఆయా సంస్థలు కోరుతున్నాయి. ఎలాంటి డొల్లా కంపెనీని నిర్వహించడం లేదని జే కుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్టు స్పష్టంచేసింది. కంపెనీ ట్రాక్ రికార్డు చూసుకోవచ్చని సవాల్ విసిరింది. పార్శ్వనాథ్ డెవలపర్స్ కూడా ఇది ఊహాజనితమని వ్యాఖ్యానించింది. ఈ సంస్థలు పన్ను ఎగవేత, ఇతర అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సెబీ వీటిపై ఉక్కుపాదం మోపింది. ఆ సంస్థల షేర్ల ట్రేడింగ్ లావాదేవీలను నెలపాటు నిలిపివేయాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లను సెబీ ఆదేశించింది.

48 కంపెనీలనుంచి సమాచారం: ఎన్ఎస్ఈ

ఆ 331 అనుమానిత సంస్థల్లోని 48 కంపెనీల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్న ఎన్ఎస్ఈ ప్రకటించింది. ఈ సంస్థలు ఇప్పటికే స్టాక్ మార్కెట్లనుంచి సస్పెన్స్‌కు గురయ్యాయని ఎన్ఎస్ఈ తెలిపింది.

వాహన రిజిస్ట్రేషన్లకు ఆధార్ తప్పనిసరి

రవాణాశాఖ వెబ్‌సైట్‌లో వాహన విక్రయ సమాచారం

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

పోలీస్, రవాణా అధికారులతో మంత్రి మహేందర్‌రెడ్డి సమీక్ష


స్పెషల్ డ్రైవ్ వాహనాల విక్రయాలపై బుధవారం సచివాలయంలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్ రెడ్డి, చిత్రంలో సీ పీ మహేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ కార్యదర్శి సుశీల్‌శర్మ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వాహన రిజిస్ట్రేషన్, బదిలీలకు ఆధార్ తప్పనిసరిగా అనుసంధానం చేయాలని రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి ఆదేశించారు. వాహన యాజమాన్య హక్కుల బదిలీలు, రోడ్డు ప్రమాదాలపై రవాణా, పోలీస్‌శాఖల అధికారులతో బుధవారం సచివాలయంలో మంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో ఉన్న 95 లక్షల వాహనాల్లో అధికశాతం రెండు, మూడోసారి అమ్మకాలు జరుగుతున్న వాహనాల బదిలీల్లో ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. వాహన కొనుగోలుదారులు తమ పేరుమీదకు వాహన రిజిస్ట్రేషన్‌ను బదిలీ చేసుకోకుంటే ప్రమాద సమయంలో బీమా వర్తించదని, పైగా ప్రమాదానికి కారకులు ఒకరైతే, జరిమానాలకు బాధ్యులు మరొకరవుతున్నారని చెప్పారు. అలాగే ఆటోలు, లారీలకు ఫైనాన్స్ ఇస్తున్నవారు వాయిదాలు చెల్లించకుంటే సదరు వాహనాలను లాక్కుని ఇతరులకు ఇస్తున్నా.. అధికారికంగా బదిలీ చేయడంలేదని వెల్లడించారు. ఇలాంటి ఇబ్బందులు రాకుండా చట్టాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉన్నదని, దీంతోపాటు వాహనాల అమ్మకాలు, కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్, బదిలీల్లో ఆధార్‌ను తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. అలాగే ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. పోలీసులు అమలు పరుస్తున్న ఈ-చలాన్లలో వాహనాల పూర్తివివరాలు అందుబాటులో ఉన్నవిధంగానే రాష్ట్ర రవాణాశాఖ వెబ్‌సైట్‌లో సమాచారం నమోదు చేస్తే సమస్యలు తగ్గుతాయని మంత్రి తెలియజేశారు. రాష్ట్రంలో రవాణాశాఖ ప్రవేశపెట్టిన ఎం-వ్యాలెట్‌ను ఇప్పటివరకు 20 లక్షల మంది వినియోగిస్తున్నారని, ఇది దేశంలోనే రికార్డని తెలిపారు. పాయింట్ల విధానంలో ఉన్న లోపాలను అధిగమించాలని అధికారులకు సూచించారు.

నేడు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పంపిణీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నులిపురుగుల నివారణపై రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ దృష్టిసారించింది. గురువారం అంతర్జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు ఆయాశాఖలు చర్యలు చేపట్టాయి. 94,39,820 మంది చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. నట్టల నిర్మూలన కోసం 2016 నుంచి రాష్ట్రంలో అల్బెండజోల్ మాత్రలను ఏడాదికి రెండుసార్లు (ఫిబ్రవరి 10, ఆగస్టు 10 తేదిల్లో) పంపిణీ చేస్తున్నారు. దశలవారీగా నులిపురుగుల సమస్యను రూపుమాపాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుతం ఆగస్టు10వ తేదీని జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంగా ప్రకటించింది. గురువారం సామూహికంగా 400 ఎంజీ డోస్ కలిగిన అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తారు. ఈ మాత్రలను నమిలిన తర్వాత మింగాలి. ఇలా చేస్తేనే ఔషధ ప్రభావం పనిచేస్తుంది. రెండేండ్లలోపు వారికి సగం మాత్ర మాత్రమే వేయాలి. ప్రస్తుతం నాలుగోదశ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా 94,39,820 మందికి మందులను పంపిణీ చేసేందుకు రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఏర్పాట్లు చేసింది. ఆగస్టు 10న మందులను తీసుకోని వారికి మరో అవకాశంగా ఆగస్టు 23న పంపిణీ చేసేలా ఏర్పాట్లుచేశారు.

ఫోర్బ్స్ వినూత్న కంపెనీల జాబితాలో ఎయిర్‌టెల్

న్యూఢిల్లీ, ఆగస్టు 9: ఫోర్బ్స్ వినూత్న కంపెనీల జాబితాలో భారత్ తరఫున తొలిసారిగా టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ చోటు దక్కించుకుంది. ప్రస్తుత సంవత్సరానికిగాను ఫోర్బ్స్ రూపొందించిన టాప్-100 జాబితాలో భారత్ నుంచి హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్‌లకు కూడా చోటు లభించింది. 2016లో 31వ స్థానంలో ఉన్న హెచ్‌యూఎల్ ఈ సారి ఏడో స్థానానికి ఎగబాకగా, గతేడాది 18వ స్థానంలో ఉన్న ఏషియన్ పెయింట్స్ ఈ సారి ఎనిమిదో స్థానానికి చేరుకుంది. ఈ జాబితాలో భారతీ ఎయిర్‌టెల్‌కు 78వ స్థానం లభించింది. గతేడాది స్థానాలను దక్కించుకున్న టీసీఎస్, సన్‌ఫార్మా, లార్సెన్ అండ్ టుబ్రోలకు ఈ సారి నిరాశే ఎదురైంది. గతేడాది తొలిస్థానంలో ఉన్న టెస్లా మోటార్స్ స్థానాన్ని సేల్స్‌ఫోర్స్.కామ్ కైవసం చేసుకున్నది. పదేండ్లపాటు స్టాక్ మార్కెట్లో లిస్టై ఉండి, 1000 కోట్ల డాలర్ల నికర విలువ కలిగిన సంస్థలు పరిశోధన రంగంపై పెట్టే ఖర్చు ఆధారంగా ఈ జాబితాను రూపొందించింది.

నెట్‌లింక్స్ చేతికి శ్రీ వెంకటేశ్వర గ్రీన్ పవర్ ప్లాంట్

51 శాతం వాటా కొనుగోలు చేసిన సంస్థ

హైదరాబాద్, ఆగస్టు 9: రాష్ట్రానికి చెందిన ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలు సమకూర్చే నెట్‌లింక్స్ లిమిటెడ్..శ్రీ వెంకటేశ్వర గ్రీన్ పవర్ ప్రాజెక్టు నిర్మిస్తున్న 12 మెగావాట్ల రెన్యువబుల్ విద్యుత్ ప్లాంట్లో 51 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. ఇందుకోసం సంస్థ రూ.30.5 కోట్ల మేర పెట్టుబడి పెట్టింది. హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలో 12 మెగావాట్ల చెత్తతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసే యూనిట్‌ను నెలకొల్పుతున్నది. ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాదిన్నరలోగా అందుబాటులోకి రానున్నది. వ్యాపారాన్ని ఇతర రంగాలకు విస్తరించడంలో భాగంగా రెన్యువబుల్ ఎనర్జీలో పెట్టుబడులు పెట్టడం జరిగిందని, గతంలో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టినట్లు నెట్‌లింక్స్ చైర్మన్ మనోహర్ రెడ్డి తెలిపారు. రూ.200 కోట్ల పెట్టుబడితో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.



వికారాబాద్ జిల్లా పూడూరు మండలం సోమన్‌గుర్తి వృద్ధాశ్రమం సమీపంలోని ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటుతున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి తదితరులు



జడ్చర్లలో విలేకరులతో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య మంత్రి లక్ష్మారెడ్డి

పరిహారంపై రాజకీయాలా?

■ కాంగ్రెస్ నేతల తీరుపై మంత్రి లక్ష్మారెడ్డి ఆగ్రహం

జడ్చర్ల, నమస్తే తెలంగాణ: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణపై కాంగ్రెస్ పార్టీ నేతలు కాకమ్మ కథలు చెప్పడం సరికాదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సీ లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు ముంపు బాధితులకు పరిహారం చెల్లిస్తున్నా ప్రతిపక్ష నేతలు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులకు ప్రభుత్వం చెల్లిస్తున్న పరిహారంపై గద్వాల ఎమ్మెల్యే ఆరోపణలపై మంత్రి ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ హయాంలో ఎంజీకేఎల్ఐ, పోలేపల్లి సెజ్ భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.30 నుంచి రూ.70 వేలు మాత్రమే చెల్లించిందన్నారు.



చంద్లాపూర్‌లో సొరంగం పనుల పరిశీలనకు వచ్చిన రైతు నాయకులు, రైతులు

'కాళేశ్వరం' పనులను పరిశీలించిన రైతులు

చిన్నకోడూరు: కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో కొనసాగుతున్న 11వ ప్యాకేజీ సొరంగం, కెనాల్ పనులను ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన రైతు సంఘం నాయకులు, రైతులు బుధవారం పరిశీలించారు. కాళేశ్వరం ఎస్ఈ వేణుగోపాల్, ఈఈ ఆనంద్ ఆధ్వర్యంలో మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన సుమారు 300 మంది రైతులు మూడు బస్సుల్లో వచ్చి పనులు చూశారు. ఈ సందర్భంగా రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు, రైతులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.25 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించి ప్రాజెక్టు పనులను అత్యంత వేగంగా చేపడుతున్నదన్నారు. మంత్రి తన్నీరు హరీశ్‌రావు సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలనే గొప్ప లక్ష్యంతో అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు రైతులు పాలాభిషేకం చేశారు.



అనంతరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీఎం కేసీఆర్ సతీమణి శోభ

చిక్లీలో బంధువులను పరామర్శించిన సీఎం కేసీఆర్ సతీమణి

మాక్లూర్: సమీప బంధువైన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం చిక్లీ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు అనంతరావు కుటుంబాన్ని సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ బుధవారం పరామర్శించారు. అనంతరావు అనారోగ్యంతో ఇటీవలే మరణించారు. ఆయన ఇంటికి చేరుకున్న శోభ.. అనంతరావు భార్య, కూతురు, అల్లుడు, ఆడపడుచులను ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

చేవెళ్ల ఎమ్మెల్యేపై అనర్హత పిటిషన్ కొట్టివేత



ఎమ్మెల్యే యాదయ్యను సన్మానిస్తున్న టీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల, నమస్తే తెలంగాణ: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను చేవెళ్ల మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు కొట్టేసింది. 2014 ఎన్నికల్లో పోటీ చేసే సమయంలో తనపై ఉన్న కేసుల వివరాలు అఫిడవిట్‌లో పేర్కొనలేదని, దీంతో అతడి ఎన్నిక చెల్లదంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో అవినీతి ఆరోపణలపై, నవాబ్‌పేట్‌లో విండో ఎన్నికల్లో యాదయ్యపై కేసులు నమోదయ్యాయని కోర్టుకు విన్నవించారు. అఫిడవిట్‌లో పేర్కొనాల్సి ఉన్నా వాటిని దాచిపెట్టారంటూ అభియోగం మోపారు. యాదయ్యపై కేసులు నమోదైనా నేరం రుజువు కాలేదని, అనర్హత వేటు వేయడం చట్టవిరుద్ధమని ఎమ్మెల్యే తరపున న్యాయవాదులు వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి మోహన్‌రావు ఈ కేసు కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు. కోర్టు తీర్పు అనుకూలంగా రావడంతో ఎమ్మెల్యేను ఆయన అనుచరులు సన్మానించి మిఠాయిలు తినిపించి సంబురాలు జరుపుకొన్నారు.

నేరెళ్ల ఘటనపై డీఐజీ విచారణ



వేములవాడ, నమస్తేతెలంగాణ: వేములవాడ దవాఖానలో చికిత్స పొందుతున్న నేరెళ్ల వాసులను బుధవారం కరీంనగర్ డీఐజీ రవివర్మ విచారించారు. రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ మంగళవారం నేరెళ్ల వాసులను పరామర్శించిన సందర్భంగా ఈ ఘటనపై డీఐజీ స్థాయి అధికారితో పూర్తిస్థాయి విచారణ జరుపుతామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే కరీంనగర్ డీఐజీ వైద్యశాలకు వెళ్లి బాధితుల నుంచి సమాచారాన్ని సేకరించినట్టు తెలిసింది. మొదట ఒక్కొక్కరిని, ఆ తరువాత ఎనిమిది మందిని కలిపి విచారించారు.

నేరెళ్ల బాధితుల గాయాలపై నివేదిక ఇవ్వండి

■ తదుపరి విచారణ 16కు వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల ఘటనలో బాధితుల గాయాలను పరిశీలించి, పూర్తి వివరాలు సమర్పించాలని వరంగల్ ఎంజీఎం వైద్యులను ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. ఇందుకోసం ఇద్దరు సీనియర్ వైద్యులను వేములవాడలోని మనోరమ వైద్యశాలకు పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. అనంతరం బాధితులకు మెరుగైన చికిత్స అవసరమని వైద్యులు సూచిస్తే, తక్షణమే వారిని నిమ్స్‌కు తరలించే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. డాక్టర్ల నివేదికతో సహా పూర్తి వివరాలను ఈనెల 16వ తేదీ నాటికి తమకు సమర్పించాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శికి హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది.

విస్తారంగా వర్షాలు

ఖమ్మంలో అత్యధికంగా 9 సెంటీమీటర్ల వాన.. చెరువులకు జలకళ .. ఆరుతడి పంటలకు జీవం



యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరులో పత్తి చేనులోకి చేరిన వర్షం నీరు



ఖమ్మం-ఇల్లందురహదారిపై కురుస్తున్న వాన - ఫొటో: బండారి మహేశ్, ఖమ్మం

నమస్తే తెలంగాణ, న్యూస్ నెట్‌వర్క్:

ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ మీదుగా తమిళనాడు వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. చెరువులు, కుంటల్లోకి నీళ్లు వచ్చి చేరుతున్నాయి. పలుచోట్ల అలుగులు పారుతున్నాయి. రెండురోజులుగా పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం జిల్లా వ్యాప్తంగా 31 మి. మీటర్ల వర్షం కురిసింది. జనగామ జిల్లాలో సరాసరి వర్షపాతం 13.1 మి.మీటర్ల వర్షం కురిసింది. కొడకండ్ల మండలంలో అత్యధికంగా 60.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరుతున్నది. మూడు రోజులుగా పడుతున్న వర్షాలకు జిల్లావ్యాప్తంగా 106.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎడతెరిపిలేకుండా వర్షం పడుతున్నది. భారీ వర్షంతో కొన్ని మండలాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలిమెల, కన్నాయిగూడెం, మహముత్తారం, మహదేవ్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం రాకపోకలు నిలిచిపోయాయి. మహముత్తారం మండలం యామన్‌పల్లిలోని సుందరమ్మ చెరువు కట్టకు గండి పడింది. జిల్లాలో సగటున 37 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మహముత్తారం మండలంలో 9.9 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. నిర్మల్ జిల్లాలో కురిసిన చిరుజల్లులు పంటలకు మేలు చేకూర్చాయి. తానూరు మండలంలో అత్యధికంగా 7.1మి.మీటర్ల వర్షం పడింది. ఖానాపూర్‌లో రెండు గంటలపాటు ఏకధాటిగా వర్షం కురువడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. నిజామాబాద్ జిల్లాలోని



పలు మండలాల్లో వర్షం కురిసింది. జిల్లాకేంద్రంలో 8.8 మి.మీటర్లు, కమ్మర్‌పల్లి, మాక్లూర్ మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా 7.6 మి.మీటర్ల వర్షం కురిసింది. పెద్దకొడప్‌గల్‌లో 26.3 మి.మీటర్ల అత్యధిక వర్షం కురిసింది. ఖమ్మం జిల్లావ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. రాష్ట్రంలోనే అత్యధికంగా 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రధానంగా ఖమ్మం నగరంలో కురిసిన భారీ వర్షం కారణంగా రహదారులు తటాకాలను తలపించాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో భారీగా నీరు చేరుతున్నది. 23 మండలాల్లో మొత్తం 26.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. భద్రాచలం డివిజన్‌లోని తాలిపేరు ప్రాజెక్టులో నీటి సామర్థ్యం 0.73 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.69 టీఎంసీల నీటి మట్టం చేరింది. బుధవారం రాత్రి నాలుగు గేట్లు ఎత్తి 5,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. పాల్వంచ మండలం కిన్నెరసాని ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 407 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 405.5 అడుగులకు చేరింది. అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 21 అడుగులు కాగా ప్రస్తుతం 20 అడుగులు ఉంది.

నల్లగొండ జిల్లాలో ఎడతెరిపి లేని వర్షం కురిసింది. జిల్లా కేంద్రంతోపాటు నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి, తిప్పర్తి, కనగల్ మండలాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు దంచికొట్టింది. అక్కడక్కడా చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. నల్లగొండలోని పలు లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. మునుగోడు నియోజకవర్గంలోనూ ఓ మోస్తరు నుంచి భారీ వాన పడింది. నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో చిరుజల్లులు కురిశాయి. సూర్యాపేట జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఉదయం పది గంటలకు మొదలైన వాన మధ్యాహ్నం 2 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసింది. చెరువులు, కుంటల్లో 25 శాతం మేర నీరు చేరింది. జిల్లావ్యాప్తంగా సాధారణం నుంచి మోస్తరు వర్షం కురువడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో జోరుగా వర్షం కురిసింది. యాదగిరిగుట్టలో అత్యధికంగా 80.2 మీ.మీ. వర్షపాతం నమోదైంది. ఇటీవల కాలంలో అతి తక్కువ వర్షపాతం నమోదైన రాజాపేట మండలంలో 46.4 మీ.మీటర్ల వర్షం కురిసింది. మొక్కజొన్న, సోయా తదితర పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేసింది. పెద్దరావులపల్లి, పిలాయిపల్లి వద్ద మూసీనది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బీబీనగర్ మండలంలో మోస్తరు వర్షం కురిసింది. హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షంతో మూసీనది ప్రవాహంతో పొంగిపొర్లుతుంది. దాదాపు పక్షం రోజుల తరువాత సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో సరాసరి వర్షపాతం 21.2 మి.మీటర్లుగా నమోదైంది. పటాన్‌చెరులో అత్యధికంగా 80 మి.మీటర్ల వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. అత్యధికంగా గజ్వేల్ మండలంలో 15.4 మి.మీటర్ల వర్షం పడింది. మెదక్ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా నర్సాపూర్‌లో 85.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. నర్సాపూర్‌లో పంది వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. వికారాబాద్ జిల్లాలో 3.6 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వికారాబాద్ మండలంలో 2.1 సెం.మీటర్ల వర్షం పడింది.


మూసీలో ఒకరి గల్లంతు, కొట్టుకుపోయిన రెండు బైకులు

యాదాద్రి భువనగిరి, నమస్తే తెలంగాణ జిల్లా ప్రతినిధి: హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి మూసీ ఉప్పొంగింది. ఒక్కసారిగా వరదనీటి ప్రవాహం పెరుగడంతో పిలాయిపల్లి మూసీ వంతెనపై నుంచి వెళ్తున్న ఓ వ్యక్తి బైక్‌తో సహ వరద నీటిలో కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న మరో వ్యక్తి గ్రామస్తులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టినా.. జాడ తెలియరాలేదు. మండల పరిధిలోని కనుముక్కల గ్రామానికి చెందిన పడమటి జైపాల్‌రెడ్డి ఇదే బ్రిడ్జి వద్ద వరద నీటిలో చిక్కుకోగా గమనించిన స్థానికులు అతడిని రక్షించగా బైక్ వరదలో కొట్టుకుపోయింది.

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	3086	3086	1705	1704.72	128.72	128.19
నారాయణపూర్	1916	11444	1615	1612.96	37.646	34.82
జూరాల	8396	4947	1045	1039.83	9.66	6.623
తుంగభద్ర	16491	194	1633	1615.15	100.86	46.09
శ్రీశైలం	50	50	885	778.1	215.807	19.65
నాగార్జునసాగర్	621	621	590	500.40	312.045	115.94
పులిచింతల	826	1081	175	111.29	45.77	2.09
ప్రకాశం బ్యారేజీ	8314	8314	57.05	55.35	3.070	2.63



(జూన్1 నుంచి ఇప్పటివరకు 323.191 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	3505	3505	1522	1512.18	102.732	66.78
కడెం	0	703	700	686.85	7.6	4.644
ఎస్సారెస్పీ	0	432	1091	1055.10	90.313	9.36
సింగూరు	0	265	1717.93	1708.85	29.91	17.73
నిజాంసాగర్	0	234	1405	1380.10	17.803	1.310
ఎల్లంపల్లి	217	418	485	471.78	20.175	10.33
లోయర్‌మానేరు	0	129	920	893.55	24.07	7.354
ధవళేశ్వరం	41613	41845	45	45	2.93	2.93



నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివాసీల ర్యాలీలో పాల్గొన్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న మంత్రి జోగు రామన్న



ఆసిఫాబాద్‌లో నిర్వహించిన వేడుకలో కుమ్రంభీం విగ్రహానికి తిలకం దిద్దుతున్న ఎమ్మెల్యే కోవాలక్ష్మి

సంబురంగా ఆదివాసీ దినోత్సవం

■ పలు జిల్లాల్లో వేడుకలు
■ పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

ఆదిలాబాద్ టౌన్/నిర్మల్/కుమ్రం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఆదివాసీలు బుధవారం సంబురాలు జరుపుకొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ తదితర జిల్లాల్లో ఉత్సవాలు నిర్వహించారు. సంప్రదాయ నృత్యాలతో భారీ ర్యాలీలు తీశారు. ఈ వేడుకల్లో మంత్రులు జోగు రామన్న, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్, ఎమ్మెల్యే కోవా లక్ష్మితోపాటు కలెక్టర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆదిలాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అటవీ శాఖ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఏజెన్సీ ప్రాంతాల్లో మూడేండ్లుగా గిరిజనుల మరణాలు తగ్గాయన్నారు. నిర్మల్‌లో నిర్వహించిన వేడుకలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆదివాసీలను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నదన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీలో వేలాదిగా పాల్గొన్నారు. అనంతరం స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ.. సమైక్య పాలకుల చేతిలో వంచనకు గురైన గిరిపల్లెలు నేడు అభివృద్ధిబాట పట్టాయన్నారు.

బాసర ఉత్సవ విగ్రహం ఉన్నట్టేనా?

బాసర : సరస్వతీ అమ్మవారి ఆలయంలో ప్రధాన అర్చకుడిపై కొనసాగుతున్న విచారణ రోజురోజుకూ కీలక మలుపు తిరుగుతున్నది. నల్లగొండ జిల్లా దేవరకొండలో శ్రావణ మాసం తొలి శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి, ప్రణవ్‌శర్మలు నిబంధనలకు విరుద్ధంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్లి ప్రైవేటు పాఠశాలలో అక్షరశ్రీకారాలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆలయ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ వ్యవహారంలో సీనియర్ అసిస్టెంట్ శివరాజ్, స్వీపర్ సుశీలకు చార్జి మెమో జారీ చేశారు. తాత్కాలిక ఉద్యోగి రమేశ్‌ను విధుల నుంచి తొలగించారు. ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి మంగళవారం దేవాదాయ శాఖ కమిషనర్‌కు పూర్తి నివేదికను అందజేశారు. ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి ఆధీనంలో బీరువా తాళంచెవి ఉండడంతో దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ ఆలయ అధికారులు బాసర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాసర ఆలయంలో మొత్తం ఎనిమిది ఉత్సవ విగ్రహాలున్నాయి. ఇందులో ఏడు ఆలయ ఆధీనంలో ఉండగా ఒకటి అర్చకుల వద్ద ఉంటుంది. సంజీవ్ పూజారి ఆ విగ్రహాన్నే తీసుకెళ్లి పూజలు నిర్వహించారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై స్థానాచార్యుడు ప్రవీణ్‌మహరాజ్‌ను సంప్రదించగా తమ ఆధీనంలోనే ఎనిమిది విగ్రహాలు ఉన్నాయని చెప్తున్నారు. కేసులో కీలకమైన ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి రక్తపోటుతో అస్వస్థతకు గురై నిజామాబాద్‌లోని ప్రైవేటు దవాఖానలో చేరారు.

బాసర అర్చకుడు, వేదపండితుడిపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: బాసర వివాదంపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రధాన అర్చకుడు సంజీవ్, వేదపండితుడు ప్రణవ్‌శర్మలను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వీరిద్దరిపైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు.

బిరబిరా డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం

త్వరలో పేదోడికి సొంతింటి కల సాకారం

అంబేద్కర్ నగర్‌లో జీ ప్లస్ త్రీ.. ఎస్సార్ నగర్‌లో జీ ప్లస్ వన్ పద్ధతిన నిర్మాణం

దసరా నాటికి పూర్తయ్యేలా పనులు

వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వరంగల్ నగరంలో దశాబ్దాల తరబడి పూరి గుడిసెల్లో బిక్కుబిక్కుమంటూ గుడ్డిదీపం కింద జీవితాలను నెట్టుకొస్తున్నవారికి తెలంగాణ సర్కార్ బహుళ అంతస్థుల భవనాలు నిర్మించి ఇస్తున్నది. రెక్కాడితే కానీ డొక్కాడని వారు, రిక్షా కార్మికులు, అడ్డాకూలీలుగా బతుకులీడుస్తున్న బడుగుజీవులు మరికొద్ది రోజుల్లో తమ సొంతింటికలను సాకారం చేసుకోబోతున్నారు. వరంగల్‌లో గుడిసెల్లేని, గరీబుల్లేని బస్తీలుండాలని రెండేండ్ల క్రితం సీఎం కేసీఆర్ సంకల్పించారు. హైదరాబాద్‌లో ఐడీహెచ్ కాలనీ మాదిరిగా హన్మకొండలోని అంబేద్కర్‌నగర్,జితేందర్‌నగర్‌లో, ఏనుమాముల దగ్గర్లోని ఎస్సార్‌నగర్‌లో శరవేగంగా బహుళ అంతస్థుల నిర్మాణాలు సాగుతున్నాయి. అధికారులు సైతం యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసేందుకు రంగంలోకి దిగారు. మొదట్లో సాంకేతిక కారణాల వల్ల పనుల్లో కొంత జాప్యం జరిగింది. సీఎం కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి తన పేషీలోని అదనపు కార్యదర్శి స్మితాసబర్వాల్‌ను, ఇతర ఉన్నతాధికారులను క్షేత్రస్థాయికి పంపించి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే దసరా నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్మాణాలు పూర్తి చేయాలన్న సంకల్పంతో పనుల్లో వేగం పెంచారు.



అంబేద్కర్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న జీ ప్లస్3 సముదాయం

రెండు కాలనీలు.. 1384 మంది లబ్ధిదారులు

అంబేద్కర్‌నగర్‌లో జీ ప్లస్ త్రీ, ఎస్సార్‌నగర్‌లో జీ ప్లస్ వన్ విధానంలో నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ రెండు కాలనీల్లో గుడిసెలు వేసుకొని దశాబ్దాల తరబడి జీవనం సాగించే 1384 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు.

ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలు ఇలా..

కాలనీ	:	అంబేద్కర్ నగర్/జితేందర్‌నగర్
లబ్ధిదారులు	:	592 మంది
జీ ప్లస్ త్రీ	:	37 బ్లాకులు
బ్లాక్‌లకు స్లాబులు	:	15
సెకండ్ ఫ్లోర్ స్లాబ్	:	3 బ్లాకులు పూర్తి
ఫస్ట్ ఫ్లోర్ స్లాబ్‌లు	:	6 బ్లాకులు
గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్	:	ఒక బ్లాకు
ప్లింత్ బీమ్	:	3 బ్లాకులు
ప్లింత్ లెవల్	:	7 బ్లాకులు
మొదలు కావలసినవి	:	2 బ్లాకులు
ఎస్సార్ నగర్‌లో చేపట్టిన పనులు...		
లబ్ధిదారులు	:	792 మంది
విధానం	:	జీ ప్లస్ వన్
వివిధ దశల్లో ఉన్నవి	:	19 బ్లాకులు
ప్లింత్ బీమ్	:	4 బ్లాకులు పూర్తి
ఫూటింగ్	:	3 బ్లాకులు
స్లాబు దశ	:	8 బ్లాకులు
ఇంకా మొదలుకానివి	:	85 బ్లాకులు (త్వరలో మొదలు పెడుతారు)

కరెంట్ షాక్‌తో రెజ్లర్ మృతి




విశాల్



స్టేడియంలోని గదిలో నీళ్లను చూపుతున్న రెజ్లర్

రాంచీ: జాతీయ స్థాయి రెజ్లర్ విశాల్ కుమార్ వర్మ.. కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. జైపాల్ సింగ్ స్టేడియంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. గత రెండు వారాలుగా కురుస్తున్న భారీ వర్షాలకు స్టేడియం బిల్డింగ్ నీటితో నిండిపోయింది. దీంతో స్టేడియంలో ఉన్న జార్ఖండ్ స్టేట్ రెజ్లింగ్ కార్యాలయంలోకి కూడా నీరు చేరడంతో వాటిని బయటకు పంపేందుకు విశాల్ మోటార్ పంప్‌ను ఉపయోగించాడు. ఈ క్రమంలో షాట్ సర్క్యూట్‌కు గురయ్యాడు. దీంతో 25 ఏండ్ల రెజ్లర్ అక్కడిక్కడే ప్రాణాలు వదిలాడు. 1978లో నిర్మించిన ఈ స్టేడియం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నది. వర్షకాలం మొదలైనప్పట్నించీ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. షాక్ వల్లే విశాల్ చనిపోయాడని పోలీసులు ప్రాథమిక విచారణలో తేల్చారు. స్టేడియంలోని వైరింగ్ లోపం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని కొత్వాలి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ శామానంద్ మండల్ తెలిపారు. ఇటీవల జరిగిన సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో విశాల్ నాలుగోస్థానంలో నిలిచాడని రెజ్లింగ్ రాష్ట్ర కోచ్ బోలోనాథ్ సింగ్ వెల్లడించారు. మరోవైపు స్టేడియానికి కరెంట్ సరఫరా చేస్తున్న వైర్లలో ఎలాంటి లోపం లేదని సంఘటన స్థలాన్ని పరిశీలించిన జార్ఖండ్ బిజిలీ విత్రన్ నిగమ్ (జేబీవీఎన్‌ఎల్) జనరల్ మేనేజర్ గణేశ్ ఝా చెప్పారు. బిల్డింగ్ అంతర్గత వైరింగ్‌లో లోపాల వల్లే ఇది సంభవించిందని స్పష్టం చేశారు. విశాల్ కుటుంబానికి రాష్ట్ర రెజ్లింగ్ సంఘం లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించింది. అలాగే అతని నలుగురు సోదరిమణుల్లో ఒకరికి ఉద్యోగం వచ్చే వరకు ఆ కుటుంబానికి ప్రతి నెలా రూ. 10 వేలు పెన్షన్ ఇచ్చేందుకు అంగీకరించింది.

కైనాన్ జోడీకి కాంస్యం



న్యూఢిల్లీ: హైదరాబాద్ షూటర్ కైనాన్ చినాయ్ మళ్లీ మెరిశాడు. అస్థానా(కజకిస్థాన్) వేదికగా జరుగుతున్న ఆసియా షాట్‌గన్ చాంపియన్‌షిప్‌లో ఇప్పటికే వ్యక్తిగత విభాగంలో కాంస్యం సాధించిన కైనాన్.. మరో పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. బుధవారం జరిగిన మిక్స్‌డ్ టీమ్ ట్రాప్ ఈవెంటు కాంస్య పతక పోరులో కైనాన్ చినాయ్, శ్రేయాసి సింగ్ జోడీ 40-38 తేడాతో లెబనాన్ ద్వయంపై విజయం సాధించింది. కువైట్ జంట పసిడి పతకం గెలువగా, కొరియా జోడీకి రజతం దక్కింది.

డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సింధు

ఇరురాష్ర్టాల సీఎంలకు కృతజ్ఞతలు

హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ: బాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించింది. విజయవాడ శివారు గొల్లపూడి సీసీఎల్‌ఏ కార్యాలయంలో కమిషనర్ కార్యాలయానికి వచ్చిన ఆమె ఉద్యోగంలో చేరుతున్నట్టు సీసీఎల్‌ఏ ప్రధాన కమిషనర్ పూనేఠాకు రిపోర్టు చేశారు. ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన సింధుకు ఏపీ సర్కార్ గ్రూప్-1 ఉద్యోగం ప్రకటించింది. తనకు మద్దతుగా నిలిచిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ర్టాల ముఖ్యమంత్రులకు ఈ సందర్భంగా సింధు కృతజ్ఞతలు తెలిపింది. రాబోయే వరల్డ్ చాంపియన్ షిప్‌లో బాగా ఆడి విజయం సాధిస్తానని సింధు ధీమా వ్యక్తం చేసింది.

మమ్మల్ని ఎందుకు గుర్తించరు?



గౌరవ్ గిల్

న్యూఢిల్లీ: మోటార్ రేసింగ్ క్రీడపై అర్జున అవార్డుల కమిటీ శీతకన్ను వేసిందంటూ రెండుసార్లు ఆసియా పసిఫిక్ ర్యాలీ చాంపియన్ గౌరవ్ గిల్ మండిపడ్డాడు. మోటార్ స్పోర్ట్స్ క్రీడాకారులను అర్జున అవార్డు పరిగణనలోకి తీసుకోకపోవడం సబబు కాదన్నాడు. గోల్ఫ్, క్యారమ్, క్యూస్పోర్ట్స్ లాంటి క్రీడలను కూడా గుర్తింపునిస్తున్న కమిటీ శారీరకంగా ఎంతో కష్టమైన మోటార్ రేస్‌ను ఎందుకు గుర్తించడం లేదో అర్థం కావడంలేదని గిల్ ఆవేదన వ్యక్తం చేశాడు. 2015 వరకు క్రీడాశాఖ మోటార్ స్పోర్ట్స్‌ను క్రీడగా గుర్తించకపోవడంతో ఈ క్రీడలో పాల్గొంటున్న డ్రైవర్లను ఇప్పటిదాకా అర్జున అవార్డులకు పరిశీలించలేదు. ఫార్ములావన్ స్థాయికి ఎదిగిన భారత ఏకైక రేసింగ్ డ్రైవర్ నారాయణ్ కార్తికేయన్ మాత్రమే 2010లో పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యాడు. ఇది మినహా మోటార్‌స్పోర్ట్స్ ఆటగాళ్లెవరికీ ఇప్పటివరకు ఎలాంటి గౌరవం లభించకపోవడంతో గిల్ అవార్డుల కమిటీని దుయ్యబట్టాడు. '10 బంతులు వదిలేసి ఒక్క బంతిని బాదే క్రికెటర్లకు అవార్డులు ప్రకటిస్తారు. ఎలాంటి శారీరక శ్రమకు గురికాని క్రీడలను, క్రీడాకారులను గుర్తిస్తారు. నా క్రీడలో ఎంతో సాధించాను. అయినా నాకెంత మాత్రం మద్దతు లభించడం లేదు' అని గిల్ తీవ్రంగా వ్యాఖ్యానించాడు.



అజర్ బకాయిలపై తేల్చని బీసీసీఐ!

సర్వసభ్య భేటీలో చర్చించాలని నిర్ణయం

న్యూఢిల్లీ: భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజరుద్దీన్‌కు చెల్లించాల్సిన బకాయిలపై బీసీసీఐ ఎటూ తేల్చలేదు. ఈ విషయాన్ని సర్వసభ్య భేటీ (జనరల్ బాడీ)లో చర్చించాలని నిర్ణయించింది. 'అజర్ అంశంపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. బోర్డు న్యాయ బృందం తమ అభిప్రాయాన్ని చెప్పింది. వీటన్నింటిని పరిశీలించిన తర్వాత జనరల్ బాడీ దీనిపై ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటుంది' అని బుధవారం క్రికెట్ పరిపాలక కమిటీ (సీవోఏ)తో జరిగిన సమావేశంలో పాల్గొన్న తర్వాత బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా వెల్లడించారు. ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టే అంశంపై కూడా బీసీసీఐ ఎలాంటి నిర్ణయానికి రాలేకపోయింది. ఈ విషయాన్ని కూడా జనరల్ బాడీకి వదిలేశారు. దీంతో మొదట్నించి వ్యతిరేక భావనతో ఉన్న బీసీసీఐ.. దాన్నే కొనసాగించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాడాలో ఉన్న 'ఎప్పుడు, ఎక్కడ' నిబంధనను క్రికెటర్లు తీవ్రంగా వ్యతిరేస్తుండటంతో దాన్ని సాకుగా చూపాలని బోర్డు ప్రయత్నిస్తున్నది. మరోవైపు మహిళల, పురుషుల జట్ల సెలెక్టర్లకు తలా రూ. 15 లక్షల నగదు పురస్కారాన్ని ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. అంతర్జాతీయ టోర్నీలకు, ఐపీఎల్‌కు మధ్య 15 రోజుల వ్యవధి ఉండాలన్న జస్టిస్ లోధా నిబంధనను అమలుచేసేందుకు ప్రయత్నిస్తున్నామని బీసీసీఐ పేర్కొంది. శ్రీశాంత్‌పై కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును బీసీసీఐ లీగల్ టీమ్ అధ్యాయనం చేస్తుందని ఎడ్ల్జీ వెల్లడించింది.

బెట్టింగ్‌ను చట్టబద్ధం చేస్తే ఎలా ఉంటుంది?

క్రికెట్‌ను పట్టిపీడిస్తున్న 'బెట్టింగ్'కు చెక్ పెట్టడానికి సరికొత్త ప్రయత్నాలు మొదలయ్యాయి. దేశంలో దీన్ని రూపుమాపాలంటే చట్టబద్ధం చేయడమే మేలని చాలా వైపుల నుంచి వస్తున్న ఒత్తిళ్లకు పరిష్కారం కనుగొనే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా భారత్‌లో బెట్టింగ్‌ను చట్టబద్ధం చేయడంపై తమ అభిప్రాయాలు తెలుపాలని అన్ని రాష్ట్ర క్రికెట్ సంఘాలకు లా కమిషన్ కోరింది. ఈ మేరకు లా కమిషన్ కార్యదర్శి సంజయ్ సింగ్ అన్ని రాష్ర్టాలకు లేఖ రాశారు. వీలైనంత త్వరగా దీనిపై స్పందించాలని కోరారు. గతంలో బీసీసీఐ వర్సెస్ బీహార్ క్రికెట్ అసోసియేషన్ కేసు విచారణలో భాగంగా దేశంలో బెట్టింగ్, జూదాన్ని చట్టబద్ధం చేయడంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని లా కమిషన్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కమిషన్ లేఖ పంపడం ప్రాధాన్యం సంతరించుకుంది.

కుంబ్లే నిర్ణయం సరైనదే: అజర్

భారత చీఫ్ కోచ్ పదవికి రాజీనామా చేసిన అనిల్ కుంబ్లే అంశంపై అజరుద్దీన్ స్పందించాడు. ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టకుండా కోచ్‌గా తప్పుకొని కుంబ్లే సరైన నిర్ణయం తీసుకున్నాడని అజర్ అన్నాడు.

- భారత్ ఆశలన్నీ జావెలిన్ త్రోయర్‌పైనే
- నేడు క్వాలిఫయింగ్ రౌండ్ ఆడనున్న హర్యానా స్టార్
- ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

నీరజ్ మెప్పించేనా?



ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మొదలై వారం రోజులు కావొస్తున్నది. చిన్నచిన్న దేశాలు సైతం కనీసం ఒక్కో పతకమైనా సాధిస్తున్నాయి. ఎప్పుడోగానీ గుర్తుకురాని అథ్లెట్లు కూడా తమ సత్తాను చూపెడుతున్నారు. కానీ జగమెరిగిన భారత్ బలగం మాత్రం లండన్ గడ్డపై త్రివర్ణాన్ని రెపరెపలాడించలేకపోతున్నది. సరైన అడుగు వేయకుండానే 'పరుగు'లో వెనుకబడ్డ మనకు.. ఇప్పుడో ఆశాకిరణంగా జావెలిన్ వీరుడు నీరజ్ చోప్రా కనిపిస్తున్నాడు. మరి ఇతనైనా ఖాతా తెరుస్తాడా? పతక అదృష్టాన్ని చవిచూస్తాడా?

లండన్: ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన ప్రతీ ఈవెంట్‌లో రిక్తహస్తాలతో వెనక్కి వస్తున్న భారత్ ఇప్పుడు జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపై భారీ ఆశలు పెట్టుకుంది. గురువారం జరిగే క్వాలిఫయింగ్ రౌండ్-ఎలో అతను తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. లండన్ గడ్డపై తన సత్తాను చూపెడుతూ ఈ టోర్నీలో భారత్ కొనసాగిస్తున్న చెత్త ప్రదర్శనకు చెక్ పెట్టాలని భావిస్తున్నాడు. గతేడాది జావెలిన్‌ను 86.48 మీటర్ల దూరం విసిరి జూనియర్ వరల్డ్ రికార్డును నమోదు చేసిన 19 ఏండ్ల నీరజ్.. సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల జరిగిన ఓ టోర్నీలో 85.63 మీటర్ల సీజన్ బెస్ట్‌ను నమోదు చేయడమే ఇందుకు నిదర్శనం. ఈ అద్భుత ప్రదర్శనతో ఐఏఏఎఫ్ ర్యాంకింగ్స్‌లో 14వ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. లండన్‌లో ఈ రెండింటిలో ఏ ఒక్కదాన్ని అధిగమించినా.. పతకం ఖాయం. అయితే 90 మీటర్ల మార్క్‌ను కలిగి ఉన్న ఒలింపిక్, వరల్డ్ చాంపియన్ థామస్ రోహెలర్, జోహన్నాస్ వెటెర్‌ల నుంచి నీరజ్‌కు గట్టిపోటీ ఎదురుకానుంది. ఈ సీజన్‌లో మూడుసార్లు 85 మీటర్ల మార్క్‌ను నమోదు చేసిన నీరజ్.. రెండుసార్లు డైమండ్ లీగ్‌లో దీన్ని సాధించడం విశేషం. ఇక నీరజ్‌తో పాటు దేవేందర్ సింగ్ కాంగ్ కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. కానీ ఇతనిపై పెద్దగా ఆశల్లేవు. జూన్‌లో నిషిద్ధ ఉత్ర్పేరకం మారిజువానాను సేవించి పట్టుబడినా.. సస్పెన్షన్ నుంచి తప్పించుకున్నాడు.

బార్బరాదే మహిళల జావెలిన్ త్రో



బార్బరా

మహిళల జావెలిన్ త్రోలో ప్రపంచ రికార్డు గ్రహీత బార్బరా స్పొటకోవా మళ్లీ టైటిల్ కొట్టింది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన 36 ఏండ్ల ఈ స్టార్ అథ్లెట్ లండన్‌లో రెండోసారి అదరగొట్టింది. 2012 ఒలింపిక్స్‌లో ఇదే వేదికపై స్వర్ణంతో మురిపించిన బార్బరా.. బుధవారం జరిగిన పోటీల్లోనూ విజేతగా నిలిచి మహిళల జావెలిన్ త్రోలో తనకు తిరుగులేదని నిరూపించింది. ఫైనల్స్‌లో బార్బరా జావెలిన్‌ను 66.76 మీటర్లు త్రో చేసి స్వర్ణ పతకం సాధించింది. రెండుసార్లు ఒలింపిక్ చాంపియన్ అయిన బార్బరాకు ఇది రెండో ప్రపంచ స్వర్ణ పతకం కావడం విశేషం. 'ఈ స్టేడియం నాదే. ఇక్కడ నాకు తిరుగులేదు. ఐదేండ్ల క్రితం ఇదే వేదికపై ఒలింపిక్స్‌లో స్వర్ణం అందుకున్నాను. మళ్లీ ఇప్పుడిలా చాంపియన్‌గా నిలిచాను. చాలా సంతోషంగా, ఉద్వేగంగా ఉంది' అని బార్బరా వ్యాఖ్యానించింది.



సామ్ కెండ్రిక్స్

సైనికుడు సత్తాచాటాడు

పురుషుల పోల్‌వాల్ట్‌లో అమెరికా సైనికుడు సత్తాచాటాడు. యూఎస్‌లో ఆర్మీలో కమాండర్‌గా పనిచేస్తున్న 24ఏండ్ల సామ్ కెండ్రిక్స్ పోల్‌వాల్ట్‌లో స్వర్ణం సాధించాడు. రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అయిన సామ్ 5.95 మీటర్ల ప్రదర్శనతో ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. తొలుత 6.01 మీటర్ల దాకా ప్రయత్నించి విఫలమైన సామ్, చివరకు 5.95 మీటర్ల వద్ద విజయవంతమై విజేతగా నిలిచాడు. హాట్ ఫేవరెట్‌గా పోటీపడ్డ రియో ఒలింపిక్స్ చాంపియన్ రెనాడ్ లావిలెనికి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మరోసారి స్వర్ణం కలగానే మిగిలింది. ఫ్రాన్స్‌కు చెందిన రెనాడ్ కాంస్యం పతకానికి పరిమితమయ్యాడు. పోలెండ్‌కు చెందిన పీటర్ లిసెక్‌కు రజతం దక్కింది. పురుషుల 400 మీటర్ల రేసులో దక్షిణాఫ్రికా అథ్లెట్ వాన్ నికెర్క్ స్వర్ణం సాధించాడు.

సచిన్‌తో కోహ్లీకి పోలిక సరికాదు



జాంటీ రోడ్స్

చెన్నై: సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ మధ్య పోలికలు అస్సలు వద్దని దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ జాంటీ రోడ్స్ అన్నాడు. ఎవరి ఆటతో వారే గొప్పవారిని ఇద్దరిని పోల్చి చూడటం తప్పని ఈ మెరుపు ఫీల్డర్ చెప్పుకొచ్చాడు. క్రీడల్లో అత్యుత్తమంగా రాణించిన వారి కోసం ఓ ప్రముఖ విద్యా సంస్థ బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోడ్స్ పలు అభిప్రాయాలను పంచుకున్నాడు. 'రికార్డుల మీద నాకు అంతగా నమ్మకం లేదు. వేర్వేరు తరాలకు చెందిన ఇద్దరు అత్యుత్తమ క్రికెటర్లను పోల్చేందుకు నేను అంతగా ఇష్టపడను. వాళ్లు అద్భుతమైన ఆటగాళ్లు. సచిన్.. సచినే, కోహ్లీ..కోహ్లీనే. 16 ఏండ్ల వయస్సులోనే దేశానికి ఆడిన సచిన్ 24 ఏండ్ల కెరీర్‌లో ఎన్నో మైలురాళ్లను అందుకున్నాడు. కోహ్లీ అంత సుదీర్ఘ కాలం ఆడుతాడా అన్నది చెప్పలేను. భారత జట్టులో యువరాజ్‌సింగ్, కైఫ్ అత్యుత్తమ ఫీల్డర్లు. టెస్ట్ క్రికెట్ కంటే వన్డేల భవిష్యత్తు ప్రమాదకరంగా మారింది' అని రోడ్స్ అన్నాడు.

కోహ్లీ, ధవన్ కంటే పుజార బెస్ట్



గంభీర్

న్యూఢిల్లీ: భారత టెస్ట్ స్పెషలిస్టు బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారాపై గంభీర్ ప్రశంసలు కురిపించాడు. ప్రస్తుత టెస్ట్ క్రికెట్‌లో కోహ్లీ, ధవన్ కంటే పుజార నిలకడగా రాణిస్తున్నాడని గౌతీ అన్నాడు. 'టెస్ట్ క్రికెట్‌కు మనం అస్సలు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఎంతసేపు వన్డేలు, టీ20లపై దృష్టి పెడుతున్నాం. కానీ టెస్ట్ క్రికెట్ విషయానికొస్తే పుజార అందరికంటే టాప్‌లో ఉంటాడు. నిలకడైన ఆటతీరుకు మారుపేరైన అతను కోహ్లీ, ధవన్‌ల కంటే మెరుగ్గా రాణిస్తున్నాడు. దీనికంతటికి ప్రధాన కారణం అతను కేవలం ఒక టెస్ట్ ఫార్మాట్‌కే పరిమితం కావడం. వన్డేలు, టీ20ల్లో కూడా ప్రాతినిధ్యం వహిస్తే అప్పుడు ఫలితం వేరేలా ఉండేది. ఎందుకంటే ఫార్మాట్ ఫార్మాట్‌కు ఆటతీరును మార్చుకోలేక ఇబ్బందులు ఎదుర్కొనే వాడు. దీంతో పాటు టెస్ట్ సిరీస్‌లు లేని సమయాల్లో ఇంగ్లండ్ కౌంటీల్లో పుజార ఆడటం అతనికి బాగా కలిసొచ్చింది. టెస్ట్‌ల్లో మెరుగ్గా రాణించేందుకు కౌంటీలు పుజారకు బాగా ఉపయోగపడుతున్నాయి. కానీ భారత్‌లో అలా ఎర్ర బంతితో క్రికెట్ సిరీస్‌లు ఆడే పరిస్థితులు లేవు. ఐపీఎల్ లాంటి టోర్నీలతో ఎక్కువగా తెలుపు బంతితోనే క్రికెట్ ఆడుతున్నారు. క్లిష్టమైన పేస్‌కు చిరునామా అయిన ఇంగ్లండ్ పిచ్‌లపై ఆడి టెక్నిక్ పరంగా పరిణతి సాధించిన పుజార లంకలో అలవోకగా పరుగులు కొల్లగొడుతున్నాడు' అని గంభీర్ అన్నాడు.

ధోనీని ఆదర్శంగా తీసుకోండి

గ్రామీణ యువతకు చిక్కా సలహా



కళాశాల స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న కృష్ణమాచారి శ్రీకాంత్

పాలమూరు, నమస్తేతెలంగాణ: గ్రామీణస్థాయిలో ప్రతిభావంతులైన యువకులెందరో ఉన్నారని, వాళ్లు తమ ప్రతిభకు మరింత మెరుగులు దిద్దుకొని అంతర్జాతీయస్థాయికి ఎదుగాలని భారత మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అన్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జయప్రకాశ్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమానికి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిక్కా మాట్లాడుతూ, 'చాలామంది సెలెబ్రిటీలు గ్రామీణస్థాయి నుంచి వచ్చినవారే. అందుకు నిదర్శనం భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ. ఎంతో కష్టపడి పైకొచ్చిన ధోనీ ఇవాళ మనమంతా గర్వించదగ్గ క్రికెటర్‌గా ఎదిగాడు. అకుంఠిత దీక్ష, పట్టుదలతో కష్టపడ్డందుకే సచిన్ టెండూల్కర్ ఇవాళ క్రికెట్ దేవునిగా నీరాజనాలందుకుంటున్నాడు' అని అన్నాడు.

వారియర్స్‌కు షాక్



నాగ్‌పూర్: ప్రొ కబడ్డీ లీగ్ ఐదో సీజన్‌లో బెంగాల్ వారియర్స్‌కు తొలి పరాజయం ఎదురైంది. బుధవారం జరిగిన జోన్ బీ లీగ్ మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 31-25 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్ జట్టుకు షాకిచ్చింది. బెంగళూరు జట్టులో అజయ్ కుమార్ 9, రోహిత్ కుమార్ 6 పాయింట్లతో చెలరేగి వారియర్స్‌ను గెలిపించారు. వారియర్స్ స్టార్ రైడర్, కొరియాకు చెందిన జాంగ్ కున్ లీ 8 పాయింట్లు సాధించినా ఫలితం లేకపోయింది. రెండు జట్లూ రైడింగ్‌లో సమవుజ్జీలుగా నిలిచినా, ట్యాక్లింగ్ పాయింట్లపరంగా బెంగళూరు పైచేయి సాధించింది. బెంగళూరు 14 రైడింగ్, 12 ట్యాక్లింగ్, 2 ఆలౌట్, 3 ఎక్స్‌ట్రా పాయింట్లు సాధించగా.. వారియర్స్ 15 రైడింగ్, 8 ట్యాకిల్, 2 ఆలౌట్ పాయింట్లు అందుకుంది.

కష్టానికి ఫలితం అందుకుంటా: కుల్దీప్



క్యాండీ: కుల్దీప్ యాదవ్.. భారత తొలి చైనామన్ బౌలర్. వైవిధ్యమైన బౌలింగ్‌తో ఆస్ట్రేలియాతో అరంగేట్రం టెస్ట్‌లోనే తన సత్తా ఏంటో చాటిచెప్పాడు. అయితే స్టార్ స్పిన్నర్ రవీంద్ర జడేజాపై ఐసీసీ సస్పెన్షన్ వేటుతో మూడో టెస్ట్‌లో తనకు అవకాశం దక్కవచ్చన్న ఆశతో కుల్దీప్ ఉన్నాడు. జడేజాకు బదులుగా మూడో టెస్ట్‌కు ఎంపికైన అక్షర్‌పటేల్‌తో తుదిజట్టులో చోటు కోసం పోటీ ఎదుర్కొంటున్న కుల్దీప్ తన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుందన్న ధీమాతో ఉన్నాడు. 'జట్టులో చోటుపై ఉత్సాహంగా ఉన్నాను. అరంగ్రేటం టెస్ట్ ఆడినప్పుడు కూడా ఇలాగే ఫీలయ్యాను. ఒక వేళ లంకతో మూడో టెస్ట్‌లో ఆడే అవకాశం దక్కితే అది నా కష్టానికి తగిన గుర్తింపుగా భావిస్తా' అని కుల్దీప్ అన్నాడు.



తెలుగు రాష్ర్టాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ బుధవారం బెజవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో సూర్యకుమారి, అధికారులు.. ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో గవర్నర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. - హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ

మంత్రి తుమ్మలకు గవర్నర్ పరామర్శ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇటీవల అస్వస్థతకు గురైన రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో బుధవారం సాయంత్రం గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ పరామర్శించారు. గాంధీ దవాఖానలో అధునాతన సౌకర్యాలతో కొత్తగా నిర్మించిన ఐసీయూ బ్లాక్‌ను గురువారం గవర్నర్ ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి పరిశీలించారు.

పదోన్నతుల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

ఢిల్లీ జంతర్‌మంతర్‌లో బీసీ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: మండల్ కమిషన్ మొదలు నాచియప్పన్ కమిషన్ వరకు పదోన్నతుల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని సిఫారసులు చేసినా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదని, దీనికోసం బీసీ ఉద్యోగులు ముక్తకంఠంతో ఉద్యమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నిరంజన్ అధ్యక్షతన ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో బుధవారం బీసీ ఉద్యోగులు, యువత ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీల ప్రాతినిధ్యం పెరుగాలని, పదోన్నతుల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 53 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల్లో కేవలం మూడున్నర లక్షల మంది మాత్రమే బీసీ కులాలకు చెందినవారు ఉన్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లుగానే రాజ్యాంగాన్ని సవరించి బీసీలకు కూడా దీన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. బీసీ క్రీమీలేయర్‌ను ఎత్తేయాలని, ఓబీసీ విద్యార్థులకు రాజీవ్ ఫెలోషిప్‌లను మంజూరు చేయాలని కోరారు. బీసీల హక్కుల గురించి గొంతెత్తని పార్టీలకు వారి ఓట్లు అడిగే నైతిక అర్హత లేదని అన్నారు. ఈ ర్యాలీలో బీసీ నాయకులు లక్ష్మీనారాయణ, దుర్గయ్యగౌడ్, కాశయ్య, శ్రీనివాసరావు, భిక్షపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఢిల్లీలో జేడీయూ నేత శరద్‌యాదవ్‌ను కలిసి బీసీ హక్కుల గురించి చర్చించారు. పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లుతోపాటు చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం కృషి చేయాలని శరద్‌యాదవ్‌కు కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ ఉద్యోగులు, యువకుల ర్యాలీ



బుధవారం ఢిల్లీలో టీఆర్‌ఎస్ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరైన లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్. చిత్రంలో ఎంపీలు జితేందర్‌రెడ్డి, సీతారాం నాయక్, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

సిద్దిపేట జిల్లాలో బృహత్ శిలాయుగపు ఆనవాళ్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో బృహత్‌శిలాయుగపు ఆనవాళ్లు, మానవాకృతులు, సమాధులు లభించాయని పురావస్తు శాఖ (ఆర్కియాలజీ) డైరెక్టర్ ఎన్ విశాలాక్షి తెలిపారు. పూర్వ మెదక్‌జిల్లాలో చారిత్రక అవశేషాల కోసం ఈ ఏడాది మే నెలలో తవ్వకాలు నిర్వహించామని, హైదరాబాద్‌కు సమీపంలోని ఈ ప్రాంతంలో నాలుగువేల ఏండ్ల కిందటే మానవజీవనం ఉన్నదని చెప్పడానికి ఆధారాలు లభించాయని చెప్పారు. తవ్వకాల్లో ఆకట్టుకునే ఆకృతిలో ఎముకలతో తయారుచేసిన ఆభరణాలను గుర్తించినట్టు పేర్కొన్నారు. మరో బృహత్ శిలాయుగపు సమాధిలో మానవపుర్రె, ఎముకలు లభించాయని డైరెక్టర్ వివరించారు.

ఉప్మా డబ్బాలో విదేశీ కరెన్సీ

- పుణె విమానాశ్రయంలో ఇద్దరి అరెస్టు.. రూ.1.29 కోట్ల విలువైన నగదు స్వాధీనం



న్యూఢిల్లీ, ఆగస్టు 9: ఇద్దరు ప్రయాణికులు భారీమొత్తంలో విదేశీ కరెన్సీని ఉప్మా డబ్బాలో దాచి అక్రమంగా తరలిస్తుండగా పుణె విమానాశ్రయంలో భద్రతా సిబ్బంది పట్టుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1.29 కోట్ల విలువైన విదేశీ కరెన్సీని స్వాధీనం చేస్తున్నారు. మంగళవారం నిశాంత్ వై అనే వ్యక్తి దుబాయ్ వెళ్లేందుకు పుణె విమానాశ్రయానికి వచ్చాడు. అతడి సామగ్రిని అధికారులు తనిఖీ చేశారు. చేతిలో ఉన్న పాలిథిన్ కవర్‌లోని డబ్బా ఏమిటని ప్రశ్నించగా ఉప్మా అని చెప్పాడు. డబ్బా బరువు ఎక్కువగా ఉండటంతో దానిని తెరిచి చూశారు. అందులో 86,600 అమెరికా డాలర్లు, 15,000 యూరోలు ఉన్నాయి. అదేరోజు ఇదే తరహాలో హెచ్ రంగ్లానీ అనే మహిళ విదేశీ కరెన్సీని తరలిస్తుండగా సీఐఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. ఆమె దగ్గరున్న ఉప్మా డబ్బాలోనూ 86,200 అమెరికా డాలర్లు, 1,500 యూరోలు లభించాయి. వీరిద్దరిని భద్రతా సిబ్బంది కస్టమ్స్ అధికారులకు అప్పగించారు. వీటి విలువ భారతీయ కరెన్సీలో రూ.1.29 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.



జమ్ములో లోయలో పడ్డ టెంపో

పది మంది దుర్మరణం

జమ్ము, ఆగస్టు 9: జమ్ముకశ్మీర్‌లోని రియాసి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికులను తీసుకెళ్తున్న టెంపో 200 అడుగుల లోతు లోయలో జారి పడింది. ఈ ఘటనలో పది మంది దుర్మరణం చెందగా, మరో 15 మంది గాయపడ్డారు. బుధవారం ఉదయం మహోరే బెల్ట్‌లో చెకినల్లా ప్రాంతంలోని ఓ భారీ లోయలో టెంపో పడిపోయిందని రియాస్సీ ఎస్ఎస్పీ తహి సాజద్ తెలిపారు. పదిమంది చనిపోయారని, 15 మంది గాయపడ్డారని పేర్కొన్నారు. మృతదేహాలను దవాఖానకు తరలించినట్టు, క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

రక్షాబంధన్ సాక్షిగా బాలికలకు వేధింపులు

- ఇద్దరు సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్

రాయిపూర్, ఆగస్టు 9: దంతేవాడ జిల్లాలో రక్షాబంధన్ రోజు సైనికులకు రాఖీ కట్టేందుకు వచ్చిన విద్యార్థినులపై వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఇద్దరు సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు సస్పెండ్‌కు గురయ్యారు. వీరిలో ఒకరిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే.. గతనెల 31న సీఆర్పీఎఫ్ దళాలు నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమంలో దంతేవాడ జిల్లాలోని పాల్నర్‌లో ఉన్న బాలికల వసతిగృహానికి చెందిన 500 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. కొంతమంది విద్యార్థినులు మూత్రశాలలకు వెళ్తుండగా కానిస్టేబుళ్లు వేధింపులకు పాల్పడినట్టు హాస్టల్ వార్డెన్.. జిల్లా అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదుచేసినట్టు ఎస్పీ కాంలోచన్ కశ్యప్ తెలిపారు. కార్యక్రమంలో తీసిన ఫొటోల ఆధారంగా వేధింపులకు పాల్పడ్డ వ్యక్తులను గుర్తించినట్టు చెప్పారు. సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ షమీమ్ అహ్మద్‌ను బుధవారం అరెస్టు చేశామని, సెలవులో ఉన్న మరొకరిని పట్టుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటనపై డీఐజీ అధ్యక్షతన ఉన్నతస్థాయి విచారణ చేపట్టనున్నట్టు సీఆర్పీఎఫ్ అధికార ప్రతినిధి తెలిపారు.



విమానాల రెక్కలు ఢీ

న్యూఢిల్లీ, ఆగస్టు 9: ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రెండు విమానాల రెక్కలు పరస్పరం ఢీకొన్నాయి. ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియా విమానాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణిస్తున్న డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ప్రమాదంపై దర్యాప్తు చేపట్టింది.

ముదురుతున్న మాటల యుద్ధం!

- బెదిరింపులు ఆపకపోతే ఉగ్రరూపాన్ని చూస్తారన్న ట్రంప్
- అమెరికా నడిబొడ్డున అణు దాడి చేస్తామన్న ఉత్తర కొరియా



వాషింగ్టన్, ఆగస్టు 9: అమెరికా, ఉత్తర కొరియాల మధ్య మాటల యుద్ధం ముదురుతున్నది. సవాల్‌కు ప్రతిసవాల్ చేసుకుంటున్నాయి. అమెరికాకు వ్యతిరేకంగా ఉత్తర కొరియా బెదిరింపులు ఆపకపోతే ప్రపంచం మునుపెన్నడూ చూడని రీతిలో తమ ఉగ్రరూపాన్ని చూడాల్సి వస్తుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన మరుసటిరోజే ఉత్తర కొరియా ఘాటుగా స్పందించింది. తమపై దాడి జరుగుతున్నట్టు ఏ మాత్రం సంకేతాలు అందినా అమెరికా నడిబొడ్డునదాడి చేస్తామని ఉత్తరకొరియా హెచ్చరించింది. అమెరికా ప్రధాన భూభాగాన్ని అణుదాడితో ఛిద్రం చేస్తామని ఉత్తరకొరియా అధికార వార్తా సంస్థ బుధవారం పేర్కొన్నది. ఉత్తరకొరియా ఇక ఎటువంటి బెదిరింపులకు పాల్పడినా సహించేది లేదని ట్రంప్ మంగళవారం హెచ్చరించారు. తమ గురించి తప్పుడు అంచనాలు వేయవద్దని స్పష్టం చేశారు. తమ దేశాధ్యక్షుడు ఉత్తరకొరియాకు అర్థమయ్యే భాషలో ఘాటైన సందేశం పంపారని అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ అన్నారు. ఉత్తరకొరియా వాగాడంబరం రోజురోజుకూ పెరుగుతున్నదని, దాని బెదిరింపులు పెచ్చుమీరుతున్నాయని చెప్పారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌కు దౌత్య పరిభాష అర్థం కావడం లేదని, అందుకే ఆయనకు అర్థమయ్యే రీతిలో ట్రంప్ సందేశం పంపారని పేర్కొన్నారు. ఇదిలాఉండగా, తమ అణ్వాయుధాల అమ్ములపొది ఇప్పుడు ఎంతో పటిష్ఠంగా, మునుపెన్నడూ లేనంత శక్తిమంతంగా ఉన్నదని ట్రంప్ ట్వీట్ చేశారు. తమకున్న ఈ శక్తిని ఎన్నటికీ ఉపయోగించబోమన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. తామెప్పటికీ ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన దేశంగా ఉంటామని పేర్కొన్నారు. ఉత్తర కొరియా ఇప్పటికైనా అణ్వాయుధాల అన్వేషణ నుంచి వెనక్కు తగ్గాలని అమెరికా రక్షణ విభాగం పెంటగాన్ సూచించింది. తమను తాము ఒంటిరిని చేసుకొనే చర్యలను నిలిపివేయాలని, అణ్వాయుధాల ప్రయోగాల నుంచి వెనక్కు తగ్గాలని అమెరికా రక్షణ మంత్రి జిమ్ మాటిస్ చెప్పారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

- భద్రతాదళాల కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదుల హతం

న్యూఢిల్లీ, ఆగస్టు 9: జమ్ముకశ్మీర్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. పుల్వామా జిల్లా ట్రల్ తహశీల్‌లోని గులాబ్ బఘ్ ప్రాంతంలో మధ్యాహ్నం 1.15 గంటలకు భద్రతాదళాలు, ఉగ్రవాదులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. గులాబ్‌బఘ్‌లో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో సీఆర్పీఎఫ్, సైనికులు, పోలీసులు తనిఖీలు చేపట్టారు. సోదాలు నిర్వహిస్తుండగా ఉగ్రవాదులు కాల్పులు జరుపడంతో భద్రతాదళాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఎదురుకాల్పుల్లో ఇషాక్ అహ్మద్ భట్, జహీద్ అహ్మద్ భట్, మహ్మద్ అష్రఫ్ అనే ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ ముగ్గురు ఉగ్రవాదులు ఇటీవల జకీర్ మూసా బృందంలో చేరినట్లు తెలుస్తున్నది. గతవారం ఎన్‌కౌంటర్‌లో హతమైన లష్కరే తాయిబా కమాండర్లు అబు దుజానా, ఆరిఫ్ లెహరి కూడా మూసా గ్రూపులో పనిచేసిన విషయం ఈ ఎన్‌కౌంటర్‌లో బయటపడింది.

జర్నలిస్టులా..పాకిస్థానీలా?

- భారత్ మాతాకి జై అననందుకు విలేకరులపై బీహార్ మంత్రి చిందులు!

పాట్నా: జర్నలిస్టులపై బీహార్ మంత్రి వినోద్‌కుమార్ చిందులు వేశారు. 'మీరు పాకిస్థానీలా?' అని వారిని నిందించారు. తరువాత తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేశారు. మంగళవారం పాట్నాలో జరిగిన 'సంకల్పసమ్మేళన్'లో 'భారత్ మాతాకీ జై' అంటూ తనతో కలిసి నినాదాలు చేయాలని మంత్రి వినోద్ కుమార్ సభకు హాజరైన వారిని కోరారు. అయితే అక్కడున్న మీడియా ప్రతినిధులు మాత్రం నినాదాలు చేయలేదు. దాంతో ఆయన ఆగ్రహంతో ఊగిపోయారు. 'మీరు పాకిస్థాన్ బిడ్డలా?' అని ప్రశ్నించారు. అనంతరం, ఆవేశం ఆపుకోలేక నోరు జారానంటూ విచారం వ్యక్తంచేశారు.

పార్టీ నుంచీ నవాజ్ షరీఫ్‌కు ఉద్వాసన

- పీఎంఎల్-ఎన్ అధ్యక్షునిగా షాబాజ్ షరీఫ్

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో అధికార పీఎంఎల్-ఎన్ పార్టీ అధ్యక్షునిగా నవాజ్ షరీఫ్ సోదరుడు షాబాజ్ షరీఫ్ (65) ఎన్నికకానున్నారు. ప్రధాని పదవికి నవాజ్ షరీఫ్ అనర్హుడని సుప్రీంకోర్టు తేల్చిన నేపథ్యంలో ఆయన ప్రధాని పదవితోపాటు జాతీయ అసెంబ్లీలో తన స్థానాన్ని కూడా కోల్పోయారు. ఆయన స్థానంలో పీఎంఎల్-ఎన్ అధ్యక్షుడిగా షాబాజ్ షరీఫ్ ఎన్నికవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు వచ్చే ఎన్నికల వరకు షాహిద్ ఖాకన్ అబ్బాసీయే ప్రధానిగా కొనసాగుతారని మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ బుధవారం ప్రకటించారు.

14 మంది డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇటీవల డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు పొంది వెయిటింగ్‌లో ఉన్న 14 మంది రెవెన్యూ అధికారులకు పోస్టింగులిస్తూ బుధవారం రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ తహసీల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డికి మంచిర్యాల ఆర్డీవోగా పోస్టింగ్ ఇచ్చారు. అబ్కారీశాఖ కమిషనర్ కార్యాలయానికి అసిస్టెంట్ సెక్రటరీగా వీ రమాదేవిని, మైనార్టీ సంక్షేమశాఖకు డిప్యుటేషన్‌పై ఆర్ రత్నకల్యాణి, సీహెచ్ వెంకటేశ్వర్లును పంపించారు. మెదక్ జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్‌గా వీ రాములు, మెదక్ జిల్లా డీఆర్డీఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆర్ దశరథ్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల మైనార్టీ సంక్షేమశాఖ అధికారులగా ఎం శంకర్, సిడమ్ దత్తు, ఆదిలాబాద్ జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్‌గా జీ ప్రభాకర్, ఉట్నూర్ గిరిజన సంక్షేమశాఖ అధికారిగా ఆర్ఎస్ చిత్రు, సంగారెడ్డి జిల్లా జాతీయ పెట్టుబడుల పరిశ్రమల జోన్ (న్యాల్‌కల్ - ఝరాసంగం) అధికారిగా కే శివరామ్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా న్యాయ అధికారిగా పీ ధర్మచంద్రారెడ్డి, రాష్ట్ర విద్యాసంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ అడ్మినిస్ట్రేషన్ జీఎంగా ఈఎస్ అనురాధకు పోస్టింగులు ఇచ్చారు. పంచాయతీరాజ్‌శాఖకు డిప్యుటేషన్‌పై ఎన్ మధుసూదనరావును పంపించారు.

12 వరకు పీజీఈసెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్: రాష్ట్రంలో ఎంటెక్, ఎంఫార్మసీ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం ఈ నెల 6 నుంచి ప్రారంభమైన పీజీఈసెట్-2017 కౌన్సెలింగ్ ఈ నెల 12తో ముగియనున్నది. ఈ నెల 10న విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ పూర్తవుతుంది. 12వరకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఆ తర్వాత సీట్ల కేటాయింపు చేపడుతారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఎంటెక్‌లో 5,978 సీట్లు, ఎంఫార్మసీలో 2,973 సీట్లు అందుబాటులో ఉన్నాయని పీజీఈసెట్ కో కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్ పేర్కొన్నారు.

ఇక రాజకీయాలు మాట్లాడను

- రాజ్యసభను హుందాగా నడుపుతా
- మీడియా ప్రతినిధులతో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇకపై తాను రాజకీయాలు మాట్లాడబోనని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. కానీ, ప్రజలకు సంబంధించిన సమస్యలు, వివిధ అంశాలపై మాట్లాడకూడదనే పరిమితులేమీ లేవని చెప్పారు. తాను ఉపరాష్ట్రపతిగా ఎలా హుందాగా వ్యవహరించాలనే విషయమై అధ్యయనం చేస్తున్నానని తెలిపారు. గతంలో ఇదే హోదాలో ఎంతో ఉన్నతంగా వ్యవహరించిన రాధాకృష్ణన్, జాకీర్ హుస్సేన్, హిదాయతుల్లా వంటి వారి అనుభవాలను తెలుసుకుంటున్నానని వెంకయ్యనాయుడు వెల్లడించారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని కత్రియా హోటల్‌లో మీడియా ప్రతినిధులతో ఆయన కొద్దిసేపు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'ఉపరాష్ట్రపతి హోదాలో ఇకపై రాజకీయాలు మాట్లాడకూడదు. ఇక మాట్లాడను కూడా. కానీ, ప్రజా సమస్యలు, ఇతర విషయాలను ప్రస్తావించకూడదని ఎక్కడా లేదు' అని పేర్కొన్నారు. దేశంలోని నిరక్షరాస్యత, ఆర్థిక అసమానతలు, పక్షపాతం తదితర అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నానని చెప్పారు. రాజ్యసభ చైర్మన్‌గా తాను సభను సాఫీగా, హుందాగా నడుపడానికి అన్ని చర్యలు తీసుకుంటానన్నారు. వివిధ అంశాలపై ప్రతిపక్షసభ్యులకు మాట్లాడే అవకాశం కల్పిస్తానని, పక్షపాతానికి తావివ్వబోనని స్పష్టంచేశారు. 40 ఏండ్లుగా హైదరాబాద్‌తో విడదీయని బంధం ఉందని తన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తన ఎదుగుదలలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని పేర్కొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లోని కత్రియా హోటల్లో మీడియాతో వెంకయ్య మాటామంతీ

గుజరాత్ ఎన్నికల్లో వీవీపీఏటీ యంత్రాలు

- సుప్రీంకు తెలిపిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, ఆగస్టు 9: ఈ ఏడాది చివరిలో జరిగే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు తాము వేసిన గుర్తుకే ఓటు పడిందా? అన్న విషయం నిర్ధారించుకునేందుకు ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీపీఏటీ) యంత్రాలను వాడనున్నట్లు సుప్రీంకోర్టుకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) తెలిపింది. సీఈసీ దాఖలు చేసిన ప్రతిపాదనలను ఆమోదించిన చీఫ్ జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ ఆదర్శ్‌కుమార్ గోయల్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం.. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో వీవీపీఏటీ యంత్రాలను వాడాలని ఈసీని ఆదేశించాలని దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. 'గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో వీవీపీఏటీ యంత్రాలు వాడుతామని ఈసీ తన అఫిడవిట్‌లో తెలిపింది. ఈ నివేదికపై మేం తృప్తి చెందాం. ఈ విషయమై దాఖలైన పిటిషన్ కొట్టివేస్తున్నాం' అని పేర్కొన్నది. వచ్చే నెలలో ఈవీఎంలతో అనుసంధానం చేసేందుకు 73,500 వీవీపీఏటీ యంత్రాలు అందుబాటులోకి వస్తాయని, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో 70 వేల యంత్రాలు అవసరమని ఎన్నికల సంఘం తెలిపింది.



ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో బుధవారం జరిగిన 'ఎట్ హోమ్' కార్యక్రమంలో సన్మాన గ్రహీతలైన వివిధ రాష్ట్రాల స్వాతంత్ర్య సమరయోధులతో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

స్వాతంత్ర్య సమరయోధులకు రాష్ట్రపతి సత్కారం

- తెలంగాణకు చెందిన తొమ్మిది మందికి సన్మానం

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: క్విట్ ఇండియా ఉద్యమానికి 75 ఏండ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాలకు చెందిన సమరయోధులను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సత్కరించారు. రాష్ట్రపతిభవన్‌లో బుధవారం సాయంత్రం జరిగిన 'ఎట్ హోమ్' కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి 93 మంది స్వాతంత్ర్యసమరయోధులను ఆహ్వానించి సన్మానించారు. వారికి ప్రశంసాపత్రంతోపాటు కానుకను అందజేశారు. ఈ సత్కారం పొందినవారిలో తెలంగాణకు చెందిన తొమ్మిది మంది సమరయోధులున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి తొమ్మిది మంది సమరయోధుల స్మారక తపాలాబిళ్లలను విడుదల చేశారు. రాష్ట్రపతి చేతుల మీదుగా సన్మానం అందుకోవడం సంతోషంగా ఉన్నదని వ్యాఖ్యానించిన సమరయోధులు గాంధీజీ పిలుపు, స్వాతంత్ర్యం పోరాటం, తాము పడిన బాధలను , గుర్తుకు తెచ్చుకుని కంటతడి పెట్టారు. సన్మాన కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు హాజరయ్యారు.

రాష్ట్రపతి చేతుల మీదుగా సత్కారం అందుకున్న తెలంగాణ సమరయోధులు:

- **ఎర్రవెల్లి రంగారావు,** భాగ్యనగర్ కాలనీ, కరీంనగర్
- **పొనగంటి రామానుజం,** మొగిలిపాలెం గ్రామం, తిమ్మాపురం మండలం, కరీంనగర్ జిల్లా
- **అంగిరేక రాజలింగయ్య,** గొడిశాల గ్రామం, సైదాపురం మండలం, కరీంనగర్ జిల్లా
- **బొమ్మినేని శ్రీనివాసరెడ్డి,** ఎల్కతుర్తి హవేలీ గ్రామం, గీసుకొండ మండలం, వరంగల్ జిల్లా
- **కే కొమురయ్య,** ఖిలా వరంగల్, వరంగల్ అర్బన్
- **బలేరావు కిషన్‌రావు,** నారాయణపూర్ గ్రామం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా
- **వేములపల్లి నారాయణ,** వారాసిగూడ, సికింద్రాబాద్ (స్వంత జిల్లా ఖమ్మం)
- **మహాకాళ బాలపాపిరెడ్డి,** మల్కాపురం గ్రామం, చిలుకూరు మండలం, జనగామ జిల్లా
- **బాసని మురహరి,** పర్కాల గ్రామం, వరంగల్ రూరల్ జిల్లా

వికాస్ బరాల అరెస్ట్

- నేడు కోర్టులో ప్రవేశపెట్టే అవకాశం
- సీసీటీవీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా కేసు: డీజీపీ
- కేసు దర్యాప్తునకు నా కుమారుడు సహకరిస్తాడు: సుభాష్ బరాల
- తమపై ఎవరూ ఒత్తిడి తేలేదన్న వర్ణిక తండ్రి

చండీగఢ్, ఆగస్టు 9: ఐఏఎస్ అధికారి కూతురు వర్ణిక కుందును వెంటాడి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించిన కేసులో బీజేపీ హర్యానా శాఖ అధ్యక్షుడు సుభాష్ బరాల తనయుడు వికాస్ బరాల, అతడి స్నేహితుడు ఆశీష్ కుమార్‌లను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారిని గురువారం కోర్టులో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నది. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు చండీగఢ్‌లోని సెక్టార్ 26 పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారిద్దరినీ అరెస్టు చేశామని చండీగఢ్ డీజీపీ తేజిందర్ సింగ్ లుథ్రా మీడియాకు తెలిపారు. ఐపీసీ 365, 511 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి వారిని అరెస్టు చేయడం ఇది రెండోసారి. ఇంతకుముందు అరెస్టు చేసిన వెంటనే బెయిల్‌పై విడుదల చేశారు. గత శనివారం తెల్లవారుజామున చండీగఢ్‌లోని ఏడో సెక్టార్ నుంచి పంచ్‌కుల వైపు వెళుతున్న వర్ణిక కుందును కారులో వికాస్, ఆశీష్ వెంటాడినట్లు సీసీటీవీ కెమెరాల్లో సాక్ష్యాధారాలు లభించాయని, వీటి ఆధారంగా కేసు నమోదు చేస్తామని అన్నారు. ఈ కేసులో తమపై ఎటువంటి రాజకీయ ఒత్తిడి లేదన్నారు. విచారణకు హాజరు కావాలని తాము జారీ చేసిన నోటీసులు స్వీకరించేందుకు వికాస్ నిరాకరించారని డీజీపీ చెప్పారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నదని చెప్పారు. వికాస్ అతడి స్నేహితుడు రక్త నమూనాలు, మూత్ర నమూనాలు ఇచ్చేందుకు నిరాకరించారన్నారు. వికాస్ బరాలా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కొద్దిసేపటికే ఆయన తండ్రి సుభాష్ విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు విచారణకు సహకరిస్తారని తెలిపారు. కాగా, వికాస్ బరాల కుటుంబం నుంచి రాజీ కోసం తమపై ఎటువంటి ఒత్తిడి రాలేదని వర్ణిక కుందు తండ్రి చెప్పారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు. చట్టపరంగా సాగే పోరాటంలో తమకు న్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వెంటాడిన ఆకతాయిని పోలీసులకు పట్టించిన మహిళ

ఓ మహిళ తనను రోడ్డుపై నుంచి ఇంటివరకూ వెంటాడిన ఆకతాయిని పోలీసులకు పట్టించి ఆదర్శంగా నిలిచారు. ఇటువంటి ఆకతాయిలకు తాను భయపడనని అంటూ తన కుమారులకు ఆదర్శంగా నిలిచేందుకే ఆ దుండగుడిని పోలీసులకు అప్పగించానని తెలిపారు. ముంబైలో ఫ్యాషన్ డిజైనర్‌గా పనిచేస్తున్న అదితి నాగ్‌పాల్ ఆరేండ్ల, పదేండ్ల వయసున్న తన ఇద్దరు కొడుకులతో రాత్రివేళ కారులో మెడికల్ షాప్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా, ఓ ఆకతాయి వారి కారును వెంబడించాడు. ఆ వ్యక్తి ఇంటివరకూ వచ్చి కాలింగ్ బెల్ కొట్టడంతో తాము తీవ్ర భయాందోళనకు గురయ్యామని చెప్పారు. అతడిని అలా వదిలేయకూడదని నిర్ణయించుకొని, వాచ్‌మెన్, సెక్యూరిటీ సిబ్బంది సాయంతో పట్టుకుని పోలీసులకు అప్పగించామని అదితి తెలిపారు. ఆ ఆకతాయి నితేశ్‌కుమార్ శర్మ అని, ఐటీ నిపుణుడని పోలీసులు దర్యాప్తులో తేల్చారు. ఈ ఘటనపై స్పందించిన నితేశ్ రెండో భార్య ఫేస్‌బుక్‌లో అదితి నాగ్‌పాల్ ధైర్యాన్ని ప్రశంసించారు. నితేశ్‌కు మహిళలను వెంటాడే దుర్బుద్ధి ఉందని, అతనిపై ఎటువంటి సానుభూతి చూపవద్దని కోరారు.



యువతిని వేధించిన కేసులో బుధవారం వికాస్ బరాలా, ఆశీష్‌లను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

శరద్ యాదవ్‌కు ఉద్వాసన?

- నేటి నుంచి నితీశ్‌కు వ్యతిరేకంగా బీహార్ పర్యటన

పాట్నా, ఆగస్టు 9: జనతాదళ్ (యూ) సీనియర్ నాయకుడు శరద్ యాదవ్‌పై వేటు వేసేందుకు పార్టీ అధ్యక్షుడు, బీహార్ సీఎం నితీశ్‌కుమార్ సిద్ధమవుతున్నారు. బీహార్‌లో మహాఘట్‌బంధన్‌ను వీడి బీజేపీతో చేతులు కలిపిన నితీశ్ నిర్ణయాన్ని శరద్‌యాదవ్ వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. ప్రజల తీర్పునకు వ్యతిరేకంగా వ్యవహరించిన నితీశ్ నిర్ణయాన్ని ఎండగుడుతూ శరద్‌యాదవ్ గురువారం నుంచి బీహార్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటన చేపట్టవద్దని పార్టీ ముందుగానే ఆయనను హెచ్చరించింది. పార్టీ ఆదేశాలను బేఖాతరు చేస్తూ తన పర్యటనను కొనసాగించాలని ఆయన నిర్ణయించుకున్నారు. దీంతో ఈ నెల 19న జరుగనున్న జేడీయూ జాతీయ కార్యవర్గ సమావేశంలో శరద్‌యాదవ్‌పై క్రమశిక్షణ చర్య తీసుకోవచ్చని తెలుస్తున్నది. ఇంతకుముందే గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్‌పటేల్‌కు ఓటు వేశాడన్న నెపంతో జేడీయూ ఎమ్మెల్యే, శరద్‌యాదవ్ అనుచరుడైన అరుణ్ శ్రీవాస్తవను పార్టీ నుంచి తొలగించారు. గతంలో కూడా నితీశ్ తీరును తప్పు పట్టినందుకు సీనియర్ సోషలిస్టు నాయకుడు జార్జ్ ఫెర్నాండెజ్‌పై కూడా వేటు పడింది. 2009లో జార్జ్ ఫెర్నాండెజ్ పదోసారి లోక్‌సభకు ఎన్నిక కాకుండా ఆయనకు టికెట్ ఇచ్చేందుకు నితీశ్ కుమార్ నిరాకరించారు. అయితే ఫెర్నాండెజ్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. వెంటనే ఓ సమావేశాన్ని ఏర్పాటుచేసిన నితీశ్‌కుమార్ ఫెర్నాండెజ్‌ను పార్టీనుంచి బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. రేపు శరద్‌యాదవ్‌కు కూడా ఇదేరీతిలో ఉద్వాసన తప్పదని భావిస్తున్నారు.



అహ్మద్‌పటేల్‌కు శరద్‌యాదవ్ అభినందన

ఉత్కంఠభరిత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన అహ్మద్‌పటేల్‌కు జేడీయూ సీనియర్ నేత శరద్‌యాదవ్ అభినందనలు తెలిపారు. 'తీవ్ర ఒడుదొడుకులను తట్టుకుని రాజ్యసభకు ఎన్నికైన మీకు హృదయపూర్వక అభినందనలు' అని బుధవారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

చైనా భూకంపంలో మృతులు.. 19 మంది

- 247 మందికి గాయాలు.. 40 మంది పరిస్థితి విషమం
- మృతుల్లో ఐదుగురు పర్యాటకులు

బీజింగ్, ఆగస్టు 9: చైనాలోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం సిచుయాన్ రాష్ట్రంలో ఉన్న జియుజైగోలో మంగళవారం రాత్రి సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య బుధవారం నాటికి 19కి చేరింది. ఇండ్లు కూలి శిథిలాల కింద పడిఉన్న మృతదేహాలను రక్షకదళాలు గుర్తించాయి. 247 మంది గాయపడగా, వారిలో 40 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. మృతిచెందిన వారిలో ఐదుగురు పర్యాటకులు ఉన్నట్టు పేర్కొన్నాయి. మంగళవారం రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 7.0గా నమోదుకాగా, బుధవారం ఉదయం గ్జిన్‌జియాంగ్‌లో 6.6 తీవ్రతతో భూమి కంపించింది. ఇందులో ముగ్గురు గాయపడ్డారు. మంగళవారం ఒక్కరోజే 45వేల మందికి పైగా పర్యాటకులు జియూజైగో ప్రాంతాన్ని సందర్శించారని, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని ప్రభుత్వం తెలిపింది. భూకంపంతో దాదాపు 24వేల ఇండ్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నది.

యూపీలో రక్తదానోద్యమం

- ముందుకొచ్చిన 1.35 లక్షల మంది బీజేపీ కార్యకర్తలు
- జాబితా విడుదల చేసిన సీఎం యోగి ఆదిత్యనాథ్

లక్నో/ గోరఖ్‌పూర్, ఆగస్టు 9: ఉత్తర్‌ప్రదేశ్ బీజేపీ రక్తసేకరణ కోసం నడుం బిగించింది. ప్రభుత్వ దవాఖానల్లో రక్తం అవసరమున్న పేదల కోసం రక్తదాతలైన 1.35 లక్షల బీజేపీ కార్యకర్తల జాబితాను సిద్ధంచేసింది. బీజేపీ కార్యకర్తలకు రక్త పరీక్షలు చేశాక జాబితా రూపొందించామని పార్టీ అధికార ప్రతినిధి సలాబ్‌మణి త్రిపాఠి చెప్పారు. ప్రస్తుతం ఇందులో 1.35 లక్షల మంది రక్తదాతల వివరాలు ఉన్నాయని, భవిష్యత్‌లో రెట్టింపు అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. రక్తదాతల జాబితాను బుధవారం గోరఖ్‌పూర్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విడుదల చేశారు. దేశంలో ప్రతిరోజు 1.20 కోట్ల యూనిట్ల రక్తం అవసరం అవుతుంటే కేవలం 60 లక్షల యూనిట్ల రక్తం అందుబాటులో ఉన్నదని యోగి వివరించారు. బీజేపీ కార్యకర్తల జాబితాతో ఆ లోటును పూర్తిచేయాలన్నారు.

ఖతార్‌కు వీసా లేకుండా వెళ్లొచ్చు!

ఖతార్, ఆగస్టు 9 : భారత్ సహా 80 దేశాలకు చెందిన పౌరులను వీసా లేకుండా తమ దేశంలో ప్రవేశించేందుకు అనుమతిస్తామని ఖతార్ బుధవారం ప్రకటించింది. భారత్‌తోపాటు బ్రిటన్, అమెరికా, కెనడా, దక్షిణాఫ్రికా, సీషెల్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల పౌరులు తమ దేశంలో పర్యటించేందుకు వీసా కోసం దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, పాస్‌పోర్టు ఉంటే చాలని తెలిపింది. కనీసం ఆరు నెలల గడువు ఉన్న పాస్‌పోర్టు, రాకపోకలకు ముందుగా తీసుకున్న టికెట్ ఉంటే అనుమతిస్తామని పేర్కొంది. పౌరుల జాతీయతను బట్టి 30 నుంచి 180 రోజులపాటు తమ దేశంలో ఉండేందుకు లేదా ఆ వ్యవధిలో పలుమార్లు రాకపోకలు సాగించేందుకు అనుమతిస్తామని తెలిపింది.